శనివారం 9-3-2024



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 348

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ 473/8

5వ టెస్టులో ఇంగ్లండ్‌పై 255 పరుగుల ఆధిక్యం...రోహిత్, గిల్ సెంచరీలు - 15లో



టాటా సన్స్ మెగా ఐపీఓ

అంచనా విలువ రూ.11లక్షల కోట్లు. ఐపీఓ పరిమాణం రూ. 55వేల కోట్లు - 15లో



పెద్దల సభకు సుధామూర్తి

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణమూర్తి సతీమణి డాక్టర్ సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారు.

- వివరాలు 6లో



ట్రంప్ ప్రపంచానికే ముప్పు

ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛకు ట్రంప్ ముప్పుగా పరిణమించాడని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆరోపించారు.


- వివరాలు 6లో



'స్టార్టప్ ఇండియా' లోపభూయిష్టం

నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన 'స్టార్టప్ ఇండియా' విధానం సరిగ్గా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు.

- వివరాలు 6లో



బెంగళూరు గొంతు ఎండుతోంది..

దేశ ఐటీ రాజధాని బెంగళూరు గొంతు ఎండిపోతోంది. తీవ్ర నీటి కొరతతో అల్లాడుతోంది. నగర వ్యాప్తంగా బోర్లు ఎండిపోయాయి.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

వైఎస్ విజన్ వల్లే హైదరాబాద్ అభివృద్ధి



ఉమ్మడి ఏపీలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విజన్, విధానాల వల్లే హైదరాబాద్ అభివృద్ధి సాధ్యమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం క్రెడాయ్ హైదరాబాద్ 13వ ప్రాపర్టీ షోను ఆయన హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభించారు.

- వివరాలు 10లో

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పరిధి భీమారంలోని ఓ ప్రైవేట్ కాలేజీకి చెందిన హాస్టల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అయితే తమ కూతురును హత్య చేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.


- వివరాలు 10లో

'మల్కాజిగిరి'కి మల్లారెడ్డి ఫ్యామిలీ దూరం!

- ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి కాలేజీ కూల్చివేత నేపథ్యంలో మారిన సీన్
- సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన మల్లారెడ్డి..
- ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ ప్రచారం
- దీంతో కేటీఆర్‌తో భేటీ అయిన మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి
- పార్టీ మారబోమని వివరణ.. మల్కాజిగిరి నుంచి తమ కుటుంబం పోటీ చేయబోదని వెల్లడి - 2లో

ఇదండీ జగత్





మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి వేములవాడ రాజన్న ఆలయం వద్ద భక్తుల రద్దీ - 2లో

పాతబస్తీపై ఫోకస్!



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

2050 విజన్‌తో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం..

ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ

పాతబస్తీ మెట్రో రైల్ నిర్మాణ పనుల శంకుస్థాపనలో సీఎం రేవంత్

- ఇక్కడి నుంచి మెట్రోను ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేస్తాం
- చంచల్‌గూడ జైలు స్థలంలో స్కూల్, కాలేజీ.. మూసీ నదిని సుందరీకరిస్తాం
- మజ్లిస్‌తో కలసి హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తానన్న సీఎం
- పాతబస్తీకి మెట్రో సంతోషకరం: అసదుద్దీన్

చాంద్రాయణగుట్ట (హైదరాబాద్): హైదరాబాద్ మహా నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, పాతబస్తీ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిపెడతామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2050 విజన్‌తో పాతబస్తీ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఎంఐఎం పార్టీతో కలసి పనిచేస్తామని చెప్పారు. శుక్రవారం పాతబస్తీ మెట్రోరైల్ నిర్మాణ పనులకు ఫలక్‌నుమా ఫారూక్‌నగర్‌లో సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. వివరాలు రేవంత్ మాటల్లోనే..


''హైదరాబాద్‌లో రవాణా సదుపాయాలు మెరుగుపరుస్తున్నాం. కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణ చేపట్టాం. హైదరాబాద్‌లో పూర్తిస్థాయిలో మెట్రోరైల్ విస్తరిస్తే సామాన్య ప్రజలకు వెసులుబాటుగా ఉంటుంది. 2050 విజన్‌తో పాతబస్తీ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. అందరూ ఈ ప్రాంతాన్ని ఓల్డ్ సిటీ అని చిన్నచూపు చూస్తుంటారు. కానీ ఈ ప్రాంతమే ఒరిజినల్ సిటీ. ఓల్డ్ సిటీపై నాకు అవగాహన ఉంది. మా ఊరు(కల్వకుర్తి)కు చాంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్ మీదుగానే వెళతాం. పాతబస్తీలో రోడ్ల నిర్మాణం కోసం ఎంపీ అసదుద్దీన్ కోరిన వెంటనే రూ.200 కోట్లు మంజూరు చేశాం. హైదరాబాద్‌లో ఎక్కడెక్కడో మెట్రో రైల్‌ను ప్లాన్ చేసిన గత పాలకులు పాతబస్తీ మెట్రోను విస్మరించారు. మేం నాగోల్ నుంచి ఎల్‌బీనగర్‌కు, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, పి–7 రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టుకు మెట్రోను అనుసంధానం చేస్తాం. దీంతోపాటు రాజేంద్రనగర్‌లో నిర్మించనున్న మిగతా 2వ పేజీలో ▶

డబుల్ డెక్కర్ కారిడార్‌కు నేడే శంకుస్థాపన - 2లో

బాబు... బిల్లీ... లక్ష కోట్లు!

20 ఏళ్ల కిందటే అత్యంత భారీ దోపిడీకి స్కెచ్

ఐఎంజీ భారత పేరుతో బిల్లీరావును దింపి కథ నడిపిన చంద్రబాబు



14లో

- గచ్చిబౌలిలో విలువైన 850 ఎకరాలు.. రూ.2 కోట్లకే కేటాయింపు
- అప్పట్లోనే వాటి విలువ రూ. 20వేల కోట్లు.. ఇపుడు 60 వేల కోట్లపైనే
- స్టేడియంలన్నీ లీజుకివ్వటంతో పాటు నిర్వహణ వ్యయాలు సర్కారువే
- మొత్తం క్రీడారంగాన్ని బిల్లీరావు చేతిలో పెట్టేసిన నారా వారి నిర్వాకం
- అలా మరో రూ. 50–60 వేల కోట్లు లబ్ధి చేకూర్చేందుకు పన్నాగం
- అదే జరిగితే రాష్ట్రంలో సామాన్యులకు క్రీడలే దూరమయ్యేవి
- 2004లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉంటూనే అన్నీ కానిచ్చేసిన తీరు
- 2004లో వైఎస్‌ఆర్ గెలవటంతో ఒప్పందం వెనక కుట్ర బట్టబయలు
- రద్దు చేసి భూముల్ని వెనక్కి తీసుకుని... సీబీఐ విచారణకు ఆదేశం
- తగిన సిబ్బంది లేరంటూ సీబీఐ విచారణ చేయని లక్ష్మీనారాయణ
- భూములు వెనక్కి తీసుకోవటంపై కోర్టుకెక్కిన బాబు బినామీ బిల్లీ
- కోర్టుల్ని 'మేనేజ్' చేయటానికి మొత్తం స్కీమ్‌తో సిద్ధమైన ముఠా
- రహస్య కెమెరాల 'సాక్షి'గా 2009లోనే ఇవన్నీ వెల్లడించిన బిల్లీరావు
- కుట్ర బయట పడటంతో ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్
- అప్పట్లోనే సీబీఐ దర్యాప్తు జరిగి ఉంటే ఈ పాటికి బాబు జైల్లోకి



బీజేపీకి 333 పైమాటే

టౌమ్స్ నౌ సర్వే వెల్లడి

ఎన్డీఏ కూటమికి 378 సీట్లు

'ఇండియా'కు 120, ఇతరులకు 45

కాంగ్రెస్‌కు 28–48 మించకపోవచ్చు

- వివరాలు 6లో

తెలంగాణ

కాంగ్రెస్‌కు 9 స్థానాలు

- టైమ్స్ నౌ ఛానల్ సర్వే వెల్లడి
- బీజేపీకి 5, బీఆర్‌ఎస్‌కు 2, ఎంఐఎంకు 1 - 14లో

ఆంధ్రప్రదేశ్

ఖాయంగా తు'ఫ్యానే'

- 21-22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం
- 3-4 ఎంపీ సీట్లకే టీడీపీ-జనసేన కూటమి పరిమితం
- టైమ్స్‌నౌ - ఈటీజీ సర్వేలో వెల్లడి

- వివరాలు 14లో

నలుగురికే లైన్‌క్లియర్

4 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

జహీరాబాద్, నల్లగొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్‌కు ఎంపిక

సురేశ్ షెట్కార్, రఘువీర్‌రెడ్డి, బలరాం నాయక్, వంశీచంద్‌రెడ్డికి టికెట్లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న 39 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను కాంగ్రెస్ హైకమాండ్ విడుదల చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. జహీరాబాద్, నల్లగొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉన్న సంగతి తెలిసిందే. కాగా మహబూబ్‌నగర్ నుంచి వంశీచంద్‌రెడ్డి, జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, నల్లగొండ నుంచి మిగతా 2వ పేజీలో ▶



సురేశ్ షెట్కార్



రఘువీర్‌రెడ్డి



వంశీచంద్‌రెడ్డి



బలరాం నాయక్

మిగతా స్థానాలు 20 తర్వాతేనా?

20 తర్వాత జరిగే భేటీలోనే మిగతా అభ్యర్థుల ఖరారు..

చేవెళ్ల సీటు దాదాపు సునీతా మహేందరరెడ్డికే ఖరారు!

- వివరాలు 2లో



ఎల్పీజీ సిలిండర్ ధర రూ.100 తగ్గింపు

- సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 14.2 కేజీల వంటగ్యాస్ సిలిండర్ ధరపై రూ.100 తగ్గిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. తగ్గిన ధర వెంటనే అమల్లోకి వచ్చిందని తెలిపింది. 'మహిళా దినోత్సవం సందర్భంగా మా ప్రభుత్వం ఎల్పీజీపై రూ.100 తగ్గించింది. దేశవ్యాప్తంగా కోట్లాది గృహాలకు ముఖ్యంగా నారీశక్తికి ఈ నిర్ణయం లబ్ధి చేకూరుతుంది' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. -6లో

ఇలాగైతే ఎప్పటికయ్యేనో?

- ఏడు రోజుల్లో 31 శాతం ధరణి దరఖాస్తులకే లైన్ క్లియర్
- టీఎం15, 33ల కింద పెండింగ్‌లో ఉన్న 1.45 లక్షల దరఖాస్తులు
- స్పెషల్ డ్రైవ్‌లో పరిష్కారమైంది 25 వేల లోపు మాత్రమే
- సిబ్బంది లేమి, రికార్డుల పరిశీలనలో జాప్యంతో ఆలస్యమవుతున్న ప్రక్రియ
- 85% క్లియరెన్స్‌తో ముందంజలో జగిత్యాల, 6% క్లియరెన్స్‌తో అట్టడుగున పాలమూరు
- ఇంకా స్పెషల్ డ్రైవ్ కొనసాగే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం నిర్వహిస్తోన్న స్పెషల్ డ్రైవ్ ఈనెల 9వ తేదీ(శనివారం) తర్వాత కూడా కొనసాగనున్నట్టు తెలుస్తోంది. ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తోన్న స్పెషల్ డ్రైవ్‌లో కేవలం 31 శాతం దరఖాస్తులు మాత్రమే క్లియర్ అయిన నేపథ్యంలో మరికొన్ని రోజుల పాటు కార్యాచరణ కొనసాగుతుందని రెవెన్యూ, ధరణి పునర్నిర్మాణ కమిటీ వర్గాలు చెపుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న 2,46,536 దరఖాస్తులకు గాను ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 76,382 దరఖాస్తులను క్లియర్ చేయగా, మరో 1,70,154 దరఖాస్తులపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే, 9 రోజుల తర్వాత పెండింగ్‌లో ఒక్క దరఖాస్తు కూడా ఉండకూడదని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఉండడం, రికార్డుల పరిశీలనలో జాప్యం జరుగుతుండడంతో పాటు 8, 9 తేదీల్లో సెలవులు రావడంతో ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో ఈనెల 9 తర్వాత కూడా మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

అన్ని రంగాల్లో సమాన అవకాశాలు దక్కాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు, సమాన హక్కు లు దక్కాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సంక్షేమంలో తెలంగాణ దేశ దృష్టిని ఆకర్షిస్తుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా త్వరలోనే మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపడతామని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలకు అండగా తమ ప్రభుత్వం మరిన్ని కొత్త పథకాలు అందుబాటులోకి తెస్తుందని చెప్పారు. అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి, ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు. మహిళా సాధికారతతో పాటు ఆర్థిక స్వావలంబనకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, ఇంటింటికీ రూ.500 గ్యాస్ సిలిండర్ గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు సుఖసంతోషాలు, శాంతిని ప్రసాదించాలని గరళ కంఠుణ్ణి సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ప్రార్థించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సీఎం రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శివరాత్రి ఉపవాస పూజలను భక్తి ప్రపత్తులతో ని ర్వహిస్తున్న భక్తులందరికీ ఆ మహాదేవుని ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

సోదరుడిని పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్

మాదాపూర్‌: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని మాదాపూర్‌లోని మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం గురువారం చేర్పించిన సంగతి తెలిసిందే. మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. సీఎం రేవంత్ శుక్రవారం సోదరుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఖర్గేతో మంత్రి ఉత్తమ్ భేటీ

పార్లమెంట్ ఎన్నికలపై చర్చ



సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన ఆయన శుక్రవారం మధ్యాహ్నం ఖర్గేతో భేటీ అయి రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ భేటీలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైతం పాల్గొన్నారు. నల్లగొండ, భువనగిరి, నాగర్‌కర్నూల్, నిజామాబాద్ పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై తన అభిప్రాయాన్ని ఉత్తమ్ తెలియజేసినట్లు సమాచారం. రాష్ట్రంలో కనీసంగా 14 ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా ఖర్గే సూచించినట్లు తెలిసింది. ఈ భేటీలో ఖర్గే సహా ఇతర పార్టీ అగ్రనేతల రాష్ట్ర పర్యటనలపైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయం వద్ద భక్తుల రద్దీ

వేములవాడలో వైభవంగా మహాశివరాత్రి

రాజన్న సన్నిధికి 2 లక్షల మంది రాక

వేములవాడ: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి స్థానాచార్యులు అప్పాల భీమశంకరశర్మ ఆధ్వర్యంలో మహాలింగార్చన నిర్వహించారు. దాదాపు 2 లక్షల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. శివదీక్షాపరులతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. సాయంత్రం 6 గంటలకు మహాలింగార్చన జరిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆర్జిత సేవలు రద్దు చేసిన అధికారులు, నిరంతరం లఘు దర్శనాలు కొనసాగించారు. అర్ధరాత్రి నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ గౌతమి పరిశీలించారు.



మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామివారి దర్శనానికి వరంగల్ నగరంలోని వేయిస్తంభాల ఆలయం నుంచి రోడ్డుపైకి బారులుదీరిన భక్తులు.
- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

డబుల్ డెక్కర్ కారిడార్‌కు నేడే శంకుస్థాపన

సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫాం రోడ్డు వరకు నిర్మాణం

- జంట నగరాలు సహా ఐదు జిల్లాల ప్రజలకు ప్రయోజనం
- 5.32 కిలోమీటర్ల కారిడార్.. రూ.1,580 కోట్ల వ్యయం
- మలి దశలో దీనిపైనే మెట్రోరైల్ మార్గం నిర్మాణం
- కండ్లకోయ వద్ద శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్ జంట నగరాలతోపాటు ఉత్తర తెలంగాణలోని ఐదు జిల్లాల ప్రజలకు ప్రయోజనకరమైన 'డబుల్ డెక్కర్ కారిడార్'కు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేయనున్నారు. 44వ నంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–44)పై దశాబ్దాలుగా వాహనదారులు ఎదుర్కొంటున్న కష్టాలకు దీనితో ఉపశమనం లభించనుంది. రూ.1,580 కోట్లతో 5.32 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. తర్వాత దీనిపైనే మెట్రోరైల్ మార్గాన్ని ఏర్పాటు చేస్తారు.

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ఇలా..

ప్రతిపాది కారిడార్ సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి మొదలై తాడ్‌బండ్ జంక్షన్, బోయినపల్లి జంక్షన్ల మీదుగా డెయిరీ ఫామ్ రోడ్డు వద్ద ముగుస్తుంది. మొత్తం కారిడార్ పొడవు 5.32 కిలోమీటర్లుకాగా.. ఇందులో ఎలివేటెడ్ కారిడార్ 4.65 కిలోమీటర్లు, అండర్‌గ్రౌండ్ టన్నెల్ సుమారు 600 మీటర్ల వరకు ఉంటాయి. మొత్తం 131 పియర్స్ (స్తంభాలు)తో.. ఆరు వరుసల రహదారిని నిర్మిస్తారు. ఈ కారిడార్‌లోకి ప్రవేశించేందుకు, దిగేందుకు బోయినపల్లి జంక్షన్ సమీపంలో ఇరువైపులా రెండు చోట్ల (0.248 కిలోమీటర్ వద్ద), (0.475 కిలోమీటర్ వద్ద) ర్యాంపులు నిర్మిస్తారు.



డబుల్ డెక్కర్ కారిడార్ నమూనా

ఎలివేటెడ్ కారిడార్ పూర్తయ్యాక దానిపై మెట్రోరైల్ మార్గం నిర్మిస్తారు. దానితో ఇది డబుల్ డెక్కర్ కారిడార్‌గా మారుతుంది.

రోజూ వేలాది వాహనాలు..

ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్న ప్రాంతంలో ప్యారడైజ్ జంక్షన్ వద్ద రోజూ సగటున 1,57,105 వాహనాలు (ప్యాసింజర్ కార్ యూనిట్ పర్ డే- పీసీయూ) ప్రయాణిస్తుంటే.. ఓఆర్ఆర్ జంక్షన్ సమీపంలో 72,687 వాహనాలు వెళ్తున్నాయి. ప్రస్తుతం ఈ దారి ఇరుగ్గా ఉండటంతో ట్రాఫిక్ స్తంభించిపోతూ.. వాహనదారులు, ఆయా ప్రాంతాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే ఈ కష్టాలు తీరుతాయి.

ఎలివేటెడ్ కారిడార్ విశేషాలివీ

- మొత్తం పొడవు: 5.320 కిలోమీటర్లు
- ఎలివేటెడ్ కారిడార్: 4.650 కిలోమీటర్లు
- అండర్‌గ్రౌండ్ టన్నెల్: సుమారు 600 మీటర్లు
- సేకరించాల్సిన భూమి: 73.16 ఎకరాలు
- ఇందులో రక్షణశాఖ భూమి: 55.85 ఎకరాలు
- ప్రైవేట్ స్థలాలు: 8.41 ఎకరాలు
- అండర్‌గ్రౌండ్ టన్నెల్ కోసం: 8.90 ఎకరాలు
- మొత్తం ప్రాజెక్టు వ్యయం: రూ.1,580 కోట్లు

ప్రాజెక్టుతో ప్రయోజనాలివీ

- జాతీయ రహదారి–44లో సికింద్రాబాద్‌తోపాటు ఆదిలాబాద్ వైపు జిల్లాల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి.
- హైదరాబాద్ నగరం మధ్య నుంచి ట్రాఫిక్ ఆటంకాలు లేకుండా ఓఆర్ఆర్ వరకు చేరుకునే అవకాశం.
- మేడ్చల్–మల్కాజిగిరి–మెదక్–కామారెడ్డి–నిజామాబాద్–నిర్మల్–ఆదిలాబాద్‌కు ప్రయాణికులు, సరకుల రవాణా వేగంగా సాగనుంది.

పాతబస్తీపై ఫోకస్!

మొదటి పేజీ తరువాయి

హైకోర్టు వరకు, రాయదుర్గం–ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మియాపూర్–ఆర్సీపురం వరకు మెట్రోను విస్తరిస్తాం. మీరాలం ట్యాంక్ వద్ద రూ.363 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడతాం.

అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే..

మెట్రోరైల్, ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్ట్ అన్నీ కాంగ్రెస్ హయాంలోనే నిర్మించాం. 2004 నుంచి 2014 మధ్య హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి తాగునీటిని తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌దే. మూసీ నదిని సుందరీకరించి, దేశంలోనే చక్కటి టూరిస్ట్ స్పాట్‌గా మారుస్తాం. ఇందులో భాగంగానే అక్బరుద్దీన్ ఒవైసీతో కలసి లండన్‌లో థేమ్స్ నదిపై అధ్యయనం చేశాం. గుజరాత్‌లో సబర్మతీ నదిని అభివృద్ధి చేసిన ప్రధాని మోదీ.. ఇక్కడ గండిపేట నుంచి 55 కిలోమీటర్ల పొడవునా మూసీ సుందరీకరణకు కూడా కేంద్ర నిధులు వెచ్చించాల్సిన అవసరం ఉంది. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చినది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే. నేను కూడా మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తా. అందుకే మైనార్టీ శాఖ, మున్సిపల్ శాఖలను నా వద్దే ఉంచుకున్నా.

చంచల్‌గూడ జైలును తరలిస్తాం

చంచల్‌గూడ జైలును హైదరాబాద్ నగరం వెలుపలకు తరలిస్తాం. ఆ స్థలంలో కేజీ, పీజీ క్యాంపస్ ద్వారా విద్యను అందిస్తాం. ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనాన్ని నిర్మిస్తాం. 1994–2004 మధ్య టీడీపీ, 2004–2014 కాంగ్రెస్, 2014–2023 వరకు బీఆర్ఎస్ పాలించాయి. నేను 2024 నుంచి 2034 వరకు ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..''అని సీఎం రేవంత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మజ్లిస్ ఎమ్మెల్యేలు ముబీన్, మీర్ జుల్ఫీకర్ అలీ, జాఫర్ హుస్సేన్ మేరాజ్, అహ్మద్ బలాలా, ఎమ్మెల్సీ రియాజుల్ హసెండీ, ప్రభుత్వ సలహారు షబ్బీర్ అలీ, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీకి మెట్రో సంతోషకరం: అసదుద్దీన్ ఒవైసీ

పాతబస్తీకి మెట్రో రైల్ వస్తుండటం సంతోషకరమని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఇది అందుబాటులోకి వస్తే పాతబస్తీ నుంచి నిత్యం 10–15వేల మంది హైటెక్ సిటీకి వెళతారని చెప్పారు. సీఎం రేవంత్ పాతబస్తీ అభివృద్ధిపై దృష్టి సారించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌ను కూడా ఈ ప్రాంతం నుంచి తరలించాలని కోరారు. డీఎస్సీని ఉర్దూ మాధ్యమంలో కూడా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మూసీ సుందరీకరణకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని చెప్పారు. దేశంలో విద్వేషాన్ని నింపుతున్న వారిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పాతబస్తీ మెట్రోరైలు ప్రాజెక్టు మ్యాప్‌ను వివరిస్తున్న మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి. చిత్రంలో అసదుద్దీన్ ఒవైసీ, షబ్బీర్ అలీ తదితరులు

మిగతా స్థానాలు 20 తర్వాతేనా?

- నాలుగు లోక్‌సభ స్థానాలకే అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్
- సీఈసీ తదుపరి భేటీలో 'తెలంగాణ'పై చర్చకు నో చాన్స్
- 20వ తేదీ తర్వాత జరిగే సమావేశంలోనే మిగతా అభ్యర్థుల ఖరారు
- చేవెళ్ల సీటు దాదాపు సునీతా మహేందర్‌రెడ్డికే ఖరారు!

సాక్షి, హైదరాబాద్‌: ఇప్పటికి నాలుగు లోక్‌సభ స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించిన ఏఐసీసీ, తెలంగాణలోని మిగిలిన స్థానాలకు ఈ నెల 20వ తేదీ తర్వాతే లైన్‌క్లియర్ చేయనున్నట్టు తెలుస్తోంది. ఈనెల 11 లేదా 14, 15 తేదీల్లో మరోమారు కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) భేటీ జరిగే అవకాశమున్నా ఆ భేటీలో తెలంగాణ అభ్యర్థులపై చర్చ ఉండకపోవచ్చని సమాచారం. తదుపరి భేటీలో తెలంగాణలోని మిగిలిన అభ్యర్థిత్వాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని, ఈ భేటీ ఈ నెల 20 తర్వాత జరిగే అవకాశముందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. ఇటీవల జరిగిన సీఈసీ భేటీ ఎజెండాలో రాష్ట్రం నుంచి 9 పార్లమెంటు స్థానాలపై నిర్ణయం తీసుకునే అంశం ఉన్నప్పటికీ, కేవలం ఐదింటిపైనే చర్చించారని తెలిసింది. కానీ అనూహ్యంగా నాలుగింటిని మాత్రమే ఏఐసీసీ ప్రకటించింది. చేవెళ్ల నుంచి సునీతా మహేందర్‌రెడ్డి అభ్యర్థిత్వం కూడా ఖరారైందని, మలి జాబితాలో ఆమె పేరు ప్రకటిస్తారని తెలుస్తోంది.

ఒకటి రిజర్వ్‌డ్, మూడు జనరల్

తాజాగా ప్రకటించిన నాలుగు స్థానాల్లో ఒకటి రిజర్వ్‌డ్ కాగా, మూడు జనరల్ స్థానాలు. ఇందులో మహబూబాబాద్ (ఎస్టీ) నుంచి పాతకాపు పోరిక బలరాం నాయక్‌కే మరోమారు అవకాశమిచ్చారు. ఇక్కడ టికెట్ కోసం విజయాబాయి, బెల్లయ్య నాయక్‌లు శతవిధాలా ప్రయత్నించినా హైకమాండ్ బలరాం నాయక్‌వైపే మొగ్గుచూపింది. ఇక మహబూబ్‌నగర్‌లో అందరూ ఊహించినట్టుగానే వంశీచంద్‌రెడ్డి పేరు ఖరారయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుదిరిన ఒప్పందం మేరకు జహీరాబాద్ స్థానాన్ని బీసీ నేత సురేశ్ షెట్కార్‌కు కేటాయించారు. మరోవైపు నల్లగొండలో సీనియర్ నేత జానారెడ్డి మరోమారు తన పట్టు నిలుపుకున్నారు. ఈ స్థానం విషయంలో చాలా ఊహాగానాలు వచ్చినప్పటికీ తన కుమారుడు రఘువీర్‌కు టికెట్ ఇప్పించుకోవడంలో జానా సఫలీకృతులు కావడం గమనార్హం. ఇక, నాలుగు ప్రకటిత స్థానాల్లో రెండు రెడ్డి సామాజిక వర్గానికి, ఒకటి బీసీకి, మరొకటి ఎస్టీకి కేటాయించారు.

నలుగురికే లైన్‌క్లియర్

మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి జానారెడ్డి కుమారుడు కుందూరు రఘువీర్ రెడ్డి, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్ పోటీ చేయనున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో లోక్‌సభ స్థానాలు కేటాయిస్తామంటూ ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ అధిష్టానం.. ప్రస్తుతం ప్రకటించిన నలుగురు అభ్యర్థులకు తొలి జాబితాలోనే చోటు కల్పించింది.

మహిళా శక్తికి ఇది ప్రోత్సాహం

సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేయడంపై కె.లక్ష్మణ్

సాక్షి,హైదరాబాద్‌: ఇన్ఫోసిస్ సంస్థ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి సతీమణి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, గేట్స్ ఫౌండేషన్‌లో కీలకపాత్ర పోషిస్తున్న సంఘ సేవకురాలు సుధామూర్తిని రాష్ట్రపతి కోటాలో ప్రధాని మోదీ రాజ్యసభకు నామినేట్ చేయడం మహిళలకు గర్వకారణమని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. దేశానికి సుధామూర్తి సేవలు మరింత అవసరమని భావించి ఆమెను నామినేట్ చేయడం ప్రధాని మోదీ మహిళాశక్తికి ఇచ్చిన ప్రోత్సాహంగా ఆయన అభివర్ణించారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలకు లక్ష్మణ్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణను హెల్త్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- నిమ్స్‌లో డీఎస్‌ఏ, క్రిటికల్ కేర్ సిమ్యులేషన్ ల్యాబ్‌లు ప్రారంభం
- 39 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 300 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు



నిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం డీఎస్ఏ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాజనర్సింహ

లక్డీకాపూల్ (హైదరాబాద్): తెలంగాణను హెల్త్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. పేద ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ, సంస్థకు మంచి గుర్తింపు తేవడానికి నిమ్స్ వైద్యులు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. శుక్రవారం ఆయన నిమ్స్ ఆస్పత్రిలో రూ.12 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన డీఎస్ఏ ల్యాబ్, యూఎస్ ఎయిడ్ సంస్థ సహకారంతో రూ.5.5 కోట్ల వ్యయంతో నిర్మించిన క్రిటికల్ కేర్ సిమ్యులేషన్ స్కిల్ ల్యాబ్‌లతో పాటు రూ.2 కోట్ల విలువైన సీటీవీసీయూను ప్రారంభించారు. స్కిల్ ల్యాబ్‌లో సీపీఆర్ విధానాన్ని ఆయన స్వయంగా చేసి మెళకువలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజనర్సింహ మాట్లాడుతూ.. నిమ్స్‌కు జాతీయస్థాయిలో బ్రాండ్ ఇమేజ్ ఉందని.. దాని కొనసాగింపునకు తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. రాష్ట్రంలో ఉస్మానియా, గాంధీ, కాకతీయ, ఆసుపత్రులతో పాటు నిమ్స్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే 20 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్య, వైద్య రంగాలు మరింత అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్యాచరణను రూపొందిస్తోందని వివరించారు. నిమ్స్‌లో దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ సిమ్యులేషన్ సిల్క్ లాబ్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం కొత్తగా నియుక్తులైన 39 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 300 మంది స్టాఫ్ నర్సులకు మంత్రి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, కార్డియాలజీ విభాగం అధిపతి సాయి సతీశ్, యూఎస్ ఎయిడ్ డాక్టర్ వరప్రసాద్, హైదరాబాద్‌లోని అమెరికా కౌన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, నిమ్స్, ప్రభుత్వ అనుసంధానకర్త డాక్టర్ మార్త రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళలకు మరో శుభవార్త

- రెండు, మూడ్రోజుల్లో ప్రకటిస్తాం
- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు



మంథని: మరో రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర మహిళలకు ప్రభుత్వం ఇంకో శుభవార్త చెబుతుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. వారికి ప్రయోజనం కలిగించేలా ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించిందని తెలిపారు. అలాగే రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని వివరించారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మరో శుభవార్త చెపుతామన్నారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలకు ఉపాధి, హక్కుల కల్పన, సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని హామీలు, ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత సెప్టెంబర్, అక్టోబర్‌లో వానలు కురవక యాసంగి పంటలకు ఇబ్బందులు వస్తున్నాయని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ రంగానికి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉన్నామని చెప్పారు.

నిపుణుల సూచనల మేరకే కాళేశ్వరంపై నిర్ణయం

కాళేశ్వరం ప్రాజెక్టుపై సాంకేతిక నిపుణుల సూచనల మేరకే నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే స్పష్టమైన ప్రకటన చేశారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ క్రమంలో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బ్యారేజీలను పరిశీలిస్తోందని పేర్కొన్నారు.

'మల్కాజిగిరి'కి మల్లారెడ్డి ఫ్యామిలీ దూరం!

ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి కాలేజీ కూల్చివేత నేపథ్యంలో మారిన రాజకీయ పరిణామాలు

- సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి మల్లారెడ్డి..
- ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ ప్రచారం
- దీంతో కేటీఆర్‌తో భేటీ అయిన మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి
- పార్టీ మారబోమని వివరణ.. మల్కాజిగిరి నుంచి తమ కుటుంబ సభ్యులెవరమూ పోటీచేయబోమని వెల్లడి



సాక్షి, హైదరాబాద్‌: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. లోక్‌సభ అభ్యర్థులుగా పోటీలో ఉంటారనుకున్న నేతలు బరి నుంచి తప్పుకొంటుంటే.. మరోవైపు కొత్తవారి పేర్లు తెరపైకి వస్తున్నాయి. కొందరు నేతలు, ఎంపీలు.. మరో పార్టీలో చేరి పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లో, నాగర్‌కర్నూల్, జహీరాబాద్ ఎంపీలు పి.రాములు, బీబీ పాటిల్ బీజేపీలో చేరారు. చేవెళ్ల నుంచి పోటీచేయబోనని సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్ అధిష్టానానికి సంకేతాలు ఇచ్చారు. తాజాగా మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల బరి నుంచి మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కుటుంబం తప్పుకున్నట్లు ప్రకటించడం గమనార్హం.

ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ కూల్చివేతతో..


మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి చెందిన ఇంజనీరింగ్ కళాశాల భవనాలను అక్రమ నిర్మాణాలంటూ ప్రభుత్వం గురువారం కూల్చివేతలు చేపట్టిన విషయం తెలిసిందే. దీనితో మల్కాజిగిరిలో రాజకీయాలపై ప్రభావం పడింది. వాస్తవానికి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి మల్కాజిగిరి అభ్యర్థిగా మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి బరిలోకి దిగడం ఖాయమనే ప్రచారం జరిగింది. పార్లమెంటు పరిధి లో భద్రారెడ్డి పేరిట ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు కూడా వెలిశాయి. కానీ గత రెండు రోజుల్లో పరిణామాలు మారిపోయాయి. మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు సీఎం రేవంత్ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి చర్చించారు. కానీ అధికారులు మేడ్చల్ కలెక్టర్ ఆదేశాలతో కళాశాల భవనాన్ని పాక్షికంగా కూల్చివేశారు. దీనిపై మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు. మల్లారెడ్డిపై కక్ష సాధింపు ధోరణితో సీఎం రేవంత్ వ్యవహరిస్తున్నారని.. మల్లారెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆర్థిక మూలాలను దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ ప్రచారం జరిగింది. ఈ క్రమంలో మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. గురువారం రేవంత్ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలవడంపై, పార్టీ మారుతున్నట్టు జరిగిన ప్రచారంపై కేటీఆర్‌కు వివరణ ఇచ్చారు. తాను పార్టీ మారడం లేదని తెలిపారు. తన అల్లుడు రాజశేఖర్‌రెడ్డికి చెందిన కాలేజీ భవనాల కూల్చివేత అంశంలో కలిశామని వివరించారు. ఇదే సమయంలో తమ కుటుంబం లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధంగా లేదని కేటీఆర్‌కు స్పష్టం చేసినట్టు తెలిసింది.

ఆస్తులపై దాడులకు భయపడేనా?

సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి పోటీ కోసం 3 ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులు సిద్ధమయ్యారు. బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ పేరును ప్రకటించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి పోటీచేయడం దాదాపు ఖరారైంది. కానీ మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ఆస్తులపై దాడుల నేపథ్యంలో ఈ సీటు నుంచి తమ కుటుంబసభ్యులెవరూ పోటీ చేయబోరని మల్లారెడ్డి పేర్కొనడం చర్చనీయాంశమైంది.

కబ్జా భూములను సరెండర్ చెయ్

- కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటాం.. మాజీ మంత్రి మల్లారెడ్డికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆఫర్
- రూ.25 వేల కోట్ల విలువైన భూములను ఆక్రమించారని ఆరోపణ



సాక్షి, మేడ్చల్ జిల్లా: మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కబ్జా చేసిన ప్రభుత్వ, అసైన్డ్, చెరువు శిఖం భూములను ప్రభుత్వానికి అప్పగిస్తే ఆయనను కాంగ్రెస్‌లో చేర్చుకుంటామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్ శివార్లలోని కండ్లకోయలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''మామ మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి సహా మేడ్చల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రూ.25 వేలకోట్ల విలువ చేసే ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్, చెరువు శిఖం భూములను ఆక్రమించారు. అలాంటి భూకబ్జాదారులకు కాంగ్రెస్ పార్టీలో స్థానం లేదు. అలాంటి వారు చేరేందుకు వస్తే.. జిల్లా కాంగ్రెస్ నాయకత్వం సమష్టిగా ఎదుర్కొంటుంది..''అని మైనంపల్లి పేర్కొన్నారు. చెరువులోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని.. ఇకమీద తాము దగ్గరుండి కూల్చివేతలకు సహకరిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతల భూకబ్జాలను బయటపెడతామన్నారు. శనివారం సీఎం రేవంత్ ఆధ్వర్యంలో కండ్లకోయలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ శంఖారావం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో కిషన్‌రెడ్డి భేటీ

- బీజేపీలో చేరాల్సిందిగా ఆహ్వానం!

హనుమకొండ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్‌తో శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేసినందుకు సీతారాం నాయక్‌కు శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, సీతారాం నాయక్‌ను బీజేపీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. ఇందుకు ఆయన.. తనకు మహబూబాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరినట్టు తెలిసింది. ఈ సందర్భంగా సీతారాం నాయక్ బీజేపీలో చేరతారా అని కిషన్‌రెడ్డిని విలేకరులు అడగ్గా, ఆయననే అడగాలని సమాధానమిచ్చారు. అనంతరం సీతారాం నాయక్ మాట్లాడుతూ తనకు బీఆర్‌ఎస్‌లో గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కిషన్‌రెడ్డి తన సేవలను గుర్తించారన్నారు. తాను పార్టీ నుంచి బయటకు వెళితే తనకు తాను వెళ్లినట్లు కాదని, పార్టీ ద్రోహం చేసి బయటకు పంపినట్లన్నారు. తన అనుచరులతో సంప్రదించి బీజేపీలో చేరికపై నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

శివుడి అనుగ్రహంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం


- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


స్నానాల లక్ష్మీపురం ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు

వైరా/వైరా రూరల్: శివుడి అనుగ్రహంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని తమ స్వగ్రామమైన ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భట్టి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ శివుడి అనుగ్రహంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తామని తెలిపారు. అలాగే, మధిర, ముదిగొండ, చింతకాని మండలాల్లోని ఆలయాల్లో కూడా భట్టి దంపతులు పూజలు చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

కల్యాణలక్ష్మి, తులం బంగారం ఏమాయె?: ఎమ్మెల్యే హరీశ్‌రావు

- నీళ్లు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు


సిద్దిపేటలోని కోటిలింగేశ్వర ఆలయంలో శివుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీ అమలు ఏమైందో చెప్పాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో మహాశివరాత్రి సందర్భంగా దేవాలయంలో హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు, శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదింటి ఆడపిల్లల పెళ్లి కోసం కల్యాణలక్ష్మి అమలు చేసిందన్నారు. గతంలో రైతుల బాధ తీర్చే క్రమంలో కాళేశ్వరం ద్వారా సాగునీటిని అందించామని, ప్రస్తుతం సాగునీటి కోసం రైతులు ఎదురుచూసే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తూ రైతులకు నీరు వదడం లేదని ఆరోపించారు.

ఉద్యోగులను రెచ్చగొడుతున్నారు

- వారికి జీతాలివ్వడాన్ని నేనెప్పుడూ వ్యతిరేకించలేదు
- 'ఎక్స్'లో హరీశ్‌రావు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులకు జీతాలు ఇవ్వడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు 'ఎక్స్'వేదికగా ట్వీట్ చేశారు. తన ప్రసంగాన్ని తప్పు అర్థం వచ్చేలా ప్రచురించిన ఆ మీడియా సంస్థకు రిజాయిండర్ పంపించి, వార్తను సరిచేయించడం జరిగిందని, అయినా కొందరు కావాలని.. ఉద్యోగులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామనే ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని తాను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పదే పదే నిలదీస్తూ వస్తున్నానని, అసెంబ్లీ సాక్షిగా ఉద్యోగుల పక్షాన గొంతెత్తానని తెలిపారు. ఉద్యోగుల హక్కుల కోసం అండగా నిలిచే తనపై కొందరు కావాలని చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రభుత్వ ఉద్యోగులు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. ఉద్యోగులకు సంబంధించి నాలుగు కరువు భత్యాలను విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు.

ఇలాగైతే ఎప్పటికయ్యేనో?

▶ మొదటి పేజీ తరువాయి

ఈ డ్రైవ్‌ను కొనసాగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.

6 శాతం.... 85 శాతం

జిల్లాల వారీగా పరిశీలిస్తే పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారంలో జగిత్యాల ముందంజలో ఉంది. ఇక్కడ 85 శాతం దరఖాస్తులపై రెవెన్యూ వర్గాలు నిర్ణయం తీసుకున్నాయి. ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలో 69 శాతం దరఖాస్తులు క్లియర్ అయ్యాయి. నారాయణపేట (65), పెద్దపల్లి (65), భద్రాద్రి కొత్తగూడెం (62), వరంగల్ (56), జనగామ (56), రాజన్న సిరిసిల్ల (52), సిద్దిపేట, హనుమకొండ (51) జిల్లాల్లో 50 శాతానికి పైగా దరఖాస్తులు పరి ష్కారమయ్యాయి. ఇక, అత్యల్పంగా మహబూబ్‌నగర్ జిల్లాలో కేవలం 6 శాతమే పరిష్కారం కాగా, కరీంనగర్‌లోనూ 6 శాతం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 7, రంగారెడ్డిలో 9 శాతం దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. మాడ్యూళ్ల వారీగా చూస్తే కీలకమైన రెండు మాడ్యూళ్లలో దరఖాస్తుల క్లియరెన్స్ నత్తనడకనే సాగుతున్నట్టు అర్థమవుతోంది. టీఎం15 కింద ల్యాండ్ మ్యాటర్స్ సమస్యల పరిష్కారానికిగాను 40,605 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా 43 శాతం అంటే 17,372 దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇంకా 23,233 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మరో కీలకమైన టీఎం 33 మాడ్యూల్‌లో 1,01,132 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, 27,047 దరఖాస్తులు పరిష్కారం చేయగా, 74,085 పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం.

ఇది నిరంతర ప్రక్రియ: ధరణి కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి

'ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ ఆగదు. స్పెషల్ డ్రైవ్ కోసం ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌లోనూ ఇదే విషయాన్ని పేర్కొన్నాం. ఈనెల 9వ తేదీ తర్వాత కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఎన్నికల కోడ్ వచ్చినా దీనిపై ఎలాంటి ప్రభావం ఉండదు. రెవెన్యూ సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నప్పటికీ కొందరు ధరణి దరఖాస్తుల పరిశీలనలో పాలు పంచుకుంటారు.

ఆగస్టు నుంచి ట్రైబల్ వర్సిటీలో క్లాసులు

- గిరిజన యువతలో గేమ్ చేంజర్‌గా ట్రైబల్ యూనివర్సిటీ
- సమ్మక్క–సారక్క ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


వేయి స్తంభాల ఆలయంలో కల్యాణ మండపం ముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు, నాయకులు

ములుగు, రాయదుర్గం: సమ్మక్క–సారక్క ట్రైబల్ యూనివర్సిటీలో తొలి ఏడాది బీఏ (ఇంగ్లిష్), బీఏ (సోషల్ సైన్స్) కోర్సులను ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ములుగు జిల్లా జాకారం సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపు కార్యాలయాన్ని శుక్రవారం ఆయన.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క, ఎంపీ మాలోత్ కవితతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, అటవీశాఖ అభ్యంతరాలతో మధ్యలోనే నిలిచిన 50 ఎకరాల స్థలాన్ని త్వరితగతిన అప్పగించినట్లయితే పీఎం మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గిరిజన యూనివర్సిటీకి భూమి పూజ చేసుకుందామని అన్నారు. ఇప్పటివరకు వివిధ కారణాలతో ఆలస్యమైనప్పటికీ 337 ఎకరాలను రాష్ట్రం కేటాయించిందని చెప్పారు. అన్ని రకాల క్లియరెన్స్ వస్తే కాంపౌండ్ వాల్, డీపీఆర్, టెండర్ ప్రక్రియలను ప్రారంభిస్తామని తెలిపారు. ట్రైబల్ యూనివర్సిటీ గిరిజన యువతలో గేమ్ చేంజర్‌గా మారనుందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. యూనివర్సిటీలో 33 శాతం రిజర్వేషన్‌లను గిరిజనులకే కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు. గిరిజన ఆచారాలు, సంస్కృతి, వైద్య పరమైన మూలికలు, అడవి జీవన విధానాలు రీసెర్చ్‌లో భాగంగా ఉంటాయని తెలిపారు. ఈ యూనివర్సిటీకి మెంటార్ యూనివర్సిటీగా గచ్చి బౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వ్యవహరిస్తుందని తెలిపారు. యూజీసీ అధీనంలోని వెళ్లేంతవరకు హెచ్‌సీయూ అసోసియేట్ ప్రొఫెసర్ వంశీ కృష్ణారెడ్డిని ఓఎస్డీగా నియమించినట్టు వివరించారు. అనంతరం వెంకటాపురం(ఎం) మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని కేంద్ర మంత్రి సందర్శించి రామలింగేశ్వరుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ పథకంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గిరిజన శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, కంట్రోలర్ ఎగ్జామినేషన్ పోరిక తుకారాం తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల గుడిలో కల్యాణ మండపాన్ని ప్రారంభించిన కిషన్‌రెడ్డి

హనుమకొండ కల్చరల్: పవిత్రమైన మహాశివరాత్రి రోజున వేయిస్తంభాల కల్యాణ మండపాన్ని మహాశివుడికి అంకితం చేస్తున్నామని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వరంగల్ నగరంలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో కల్యాణమండపాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు ఆయన కుటుంబ సమేతంగా శ్రీరుద్రేశ్వరశివలింగానికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ పసునూరి దయాకర్, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

12 న రాష్ట్రస్థాయి మహిళా సదస్సు

సీఎస్ శాంతికుమారి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో దాదాపు లక్షమంది స్వయం సహాయక బృందాల మహిళలతో రాష్ట్రస్థాయి మహిళా సదస్సును నిర్వహించనున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని సీఎస్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న మహిళా సదస్సు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ రవి గుప్తా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు తదితర అధికారులు ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

కోఠిలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) కోఠిలోని ప్రాంతీయ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఎంబ్రేస్ డైవర్సిటీ– ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్ 'పేరుతో నిర్వహించిన ఈ వేడుకల్లో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలను ఘనంగా సత్కరించారు. సత్కారం అందుకున్న వారిలో హైదరాబాద్ ఎన్‌ఐ–ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ జనరల్ డా.సుంచు గ్లోరీ స్వరూప, దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ పారుల్ భరద్వాజ్, కేర్ ఆసుపత్రి క్లినికల్ డైరెక్టర్ డా.సుధా సిన్హా, ఆర్టిస్ట్, సోషల్ వర్కర్ డా.పొట్లబత్తిని పద్మావతి ఉన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు రష్మీ సిన్హా ఎస్‌బీఐ సీజీఎం రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మా పోరాటాల ఫలితమే గ్యాస్ ధరల తగ్గింపు

మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు

సాక్షి, హైదరాబాద్: వంట గ్యాస్ ధర తగ్గించాలంటూ తాము చేసిన పోరాటాల ఫలితంగానే కేంద్రం గ్యాస్ ధర తగ్గించాలని నిర్ణయం తీసుకుందని తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలెండర్‌కు రూ.100 తగ్గించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌ఎస్పీతో కలిసి కేసీఆర్ కుట్ర: మాజీ ఎమ్మెల్యే కోనప్ప

- 13న కాంగ్రెస్‌లో చేరతానని వెల్లడి



కౌటాల(సిర్పూర్): మాజీ సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో తనను ఓడించేందుకు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్(ఆర్‌ఎస్పీ)తో కలిసి కుట్ర చేశారని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపించారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో శుక్రవారం అనుచరులు, అభిమానులతో ఆయన సమావేశమయ్యారు. తనను సంప్రదించకుండా కేసీఆర్ బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం బాధ కలిగించిందన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ గత ఎన్నికల్లో తనపై వ్యక్తిగతంగా ఆరోపణలు చేశారని, కేసీఆర్‌ను తీవ్రంగా దూషించారని చెప్పారు. ఈ నెల 13న కాగజ్‌నగర్‌లో మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

హృదయపు సర్వగ్రంథులూ చక్కగా విచ్చుకున్నప్పుడు,
మర్త్యుడైన మానవుడు ఈ శరీరంలోనే అమరత్వం
పొందగలుగుతాడు.
– కఠోపనిషత్తు

సాక్షి
శనివారం, 9 మార్చి 2024

భయపెడుతున్న వలస కథలు

దుర్భర కష్టాల నుంచి విముక్తి పొందాలన్న ఆకాంక్షతో అవకాశాలను అన్వేషిస్తూ ఎంత దూరమైనా పోవటానికి సిద్ధపడటం మనిషి నైజం. దీన్ని ఆసరాచేసుకుని మానవ వ్యాపారం చేస్తున్న మాయగాళ్ల ఆటకట్టించటం ప్రభుత్వాలకు అసాధ్యమా? గత కొన్ని నెలలుగా మీడియాలో వస్తున్న కథనాలు ప్రజల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఎక్కడో ఉద్యోగమని, ఏదో చదువని నమ్మి అప్పులు చేసి, ఏజెంట్లకు లక్షలకు లక్షలు పోసి విమానాలు ఎక్కుతున్న యువకులు చివరకు అత్యంత ప్రమాదకరమైన యుద్ధ క్షేత్రాల్లో తేలుతున్నారు. ఏ క్షిపణి దాడులకో, బాంబు పేలుళ్లకో బలవుతున్నారు. లేదా దుర్భరమైన చాకిరీలో ఇరుక్కుని బయటపడే మార్గం దొరక్క అల్లాడుతున్నారు. హైదరాబాద్ పాత బస్తీనుంచి రష్యా వెళ్లిన యువకుడు కిరాయి సైన్యంలో చేరి ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటూ కన్నుమూశాడు. కేరళకు చెందిన మరో వ్యక్తి ఇజ్రాయెల్‌లో పనిచేస్తూ హమాస్ రాకెట్ దాడిలో చనిపోయాడు. మరో ఏడెనిమిదిమంది యువకులు తమను కాపాడాలంటూ రష్యానుంచి వీడియో కాల్‌లో ప్రాధేయపడ్డారు. కిరాయి సైన్యాల్లో పనిచేసినవారు తిరిగొచ్చాక తగిన ఉపాధి చూపకపోతే సమస్యాత్మకంగా మారే ప్రమాదం కూడా వుంటుంది. నిరుడు డిసెంబర్‌లో ఫ్రాన్స్‌లో మన దేశం నుంచి నికరాగువా, సోమాలియా వంటి దేశాలకు వెళ్లే 300 మందిని అనుమానం వచ్చి నిలువరిస్తే ఏజెంట్ల మాయ బయటపడింది. వీరిలో చిన్న పిల్లలు సైతం వున్నారు. చట్టవిరుద్ధ మార్గాల్లోనైనా అమెరికా పోయి డాలర్ల పంట పండించుకోవాలని ప్రయత్నించేవారూ పెరిగారు. 2022 అక్టోబర్–2023 సెప్టెంబర్ మధ్య 96,917 మంది భారతీయులు అమెరికాలో ప్రవేశించటానికి విఫలయత్నం చేసి పట్టుబడ్డారు. ఇది అంతకుముందు సంవత్సరంకన్నా అయిదు రెట్లు అధికం. అమెరికా పోవాలంటే వీసా రావటం అంత తేలిక కాదు గనుక ఇతరేతర మార్గాలు వెదుక్కుంటున్నారు. రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ తదితర దేశాలకు టూరిస్టు వీసాలు లభించటం పెద్ద కష్టం కాదు. అక్కణ్ణించి వేర్వేరు చోట్లకు వెళ్తున్నారు. ఇలాంటివారు వెనకబడిన రాష్ట్రాలనుంచి కాదు, సంపన్న రాష్ట్రాల నుంచే అధికంగా వుండటం ఆందోళన కలిగించే అంశం. ఎక్కువగా గుజరాత్, పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల యువకులు ఈ వలలో చిక్కుకుంటున్నారు. గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా సీబీఐ సాగిస్తున్న దాడుల్లో ఢిల్లీ చుట్టుపక్కలా, దేశంలోని వివిధ నగరాల్లో దర్జాగా బ్రాంచీలు పెట్టుకుని మనుషుల్ని రవాణా చేస్తున్న ముఠాల ఆచూకీ బట్టబయలైంది. సామాజిక మాధ్యమాల ద్వారా, స్థానిక ఏజెంట్ల ద్వారా యువకులకు వలవేసి ఈ ముఠాలు తీసుకుపోతున్నాయి. రష్యా వెళ్లేవారికి మంచి ఉద్యోగాలంటూ నమ్మించి తీరా ఉక్రెయిన్ యుద్ధ క్షేత్రానికి బలవంతంగా తరలిస్తూ వారి ప్రాణాలను పణం పెడుతున్నారు. అనేకులు యుద్ధంలో తీవ్రంగా గాయపడి సాయం చేసే దిక్కులేక ఆసుపత్రుల్లో విలవిల్లాడుతున్నారు. ఇలా యువకులను తీసుకెళ్లిన ఉదంతాలు 35 వరకూ బయటపడ్డాయని సీబీఐ అంటున్నది. మరెందరు వీరివల్ల మోసపోయారో తేలాలి. హమాస్ నుంచి, హిజ్బుల్లా నుంచి నిరంతరం రాకెట్ దాడులు సాగుతున్న ఇజ్రాయెల్‌లో నిర్మాణరంగంలో తాత్కాలిక అవకాశాలున్నాయంటూ రిక్రూట్‌మెంట్ మొదలెడితే హిందీ భాషా రాష్ట్రాలనుంచి అత్యధికులు క్యూ కట్టారు. ప్రభుత్వ కనుసన్నల్లో జరిగిన ఈ రిక్రూట్‌మెంట్ కోసం వచ్చినవారిని మీడియా కదిలిస్తే ఆకలితో చచ్చేకన్నా పనిచేస్తూ ప్రాణాలు పోగొట్టుకోవటం నయమన్న జవాబొచ్చింది. తమ ప్రాణాలు పోయినా కుటుంబాలకు ఎంతో కొంత అందుతుందన్న ధీమా వారిది. ఎంత విషాదకర స్థితి!

మరో ఆరేళ్లలో మన దేశం ఏడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ప్రభుత్వ అంచనాలు చెబుతున్నాయి. ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా వున్న చైనాను అధిగమించటం మరెంతో దూరంలో లేదని ఆర్థికరంగ నిపుణులు ఊరిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో వున్న 6.1 శాతం వృద్ధి రేటు ఈ ఏడాది చివరికల్లా 6.8 శాతానికి ఎగబాకుతుందని ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్నారు. నిరుద్యోగిత తగ్గిందని, కొనుగోలు శక్తి బాగా పెరిగిందని, తయారీ రంగం పుంజుకుందని గణాంకాలు అంటున్నాయి. అయినా ఇంతమంది ఎందుకు వలసబాట పడుతున్నారు? ఇబ్బందులుంటాయని తెలిసినా తప్పుడు మార్గాల్లో అమెరికాకు ఎందుకు వెళ్లాలనుకుంటున్నారు? ప్రభుత్వాలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఆర్థికవ్యవస్థ వెలుగులీనటం నిజమే అయినా అందులో సామాన్యులకు వాటా లేకపోతే సాధించిన అభివృద్ధికి అర్థమేముంటుంది? యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతున్నామంటే లోపం ఎక్కడుందో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం లేదా? యుద్ధ క్షేత్రాలవైపు పోయి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని మన విదేశాంగ శాఖ ఈమధ్య ఒక ప్రకటన చేసింది. మంచిదే. కానీ అదొక్కటే సరిపోతుందా?

తమ విధానాలను విమర్శిస్తారనుకున్నవారిని దేశంలో అడుగుపెట్టకుండా విమానాశ్రయాల నుంచే వెనక్కిపంపుతున్నారు. పరాయిగడ్డపై దేశానికి వ్యతిరేకంగా మాట్లాడతారన్న శంకతో కొందరిని బయటికి వెళ్లకుండా నిరోధిస్తున్నారు. కానీ మనుషుల్ని మోసపుచ్చి వారిని అక్రమంగా తరలిస్తున్న మాయదారి ముఠాలకు కళ్లెం వేయటం ఎందుకు సాధ్యపడదు? ఇది ఎన్నికల నామ సంవత్సరం గనుక కనీసం ఇప్పుడైనా ఉపాధి కల్పనకూ, తయారీరంగ పరిశ్రమలు పుంజుకోవటానికీ, వ్యవసాయ అనుబంధరంగాల్లో పనులు పుష్కలంగా లభించటానికీ చర్యలు తీసుకోవాలి. గణాంకాలు కళ్లు చెదిరేలావుండొచ్చు. కానీ అవి కడుపు నింపవు.

డబ్ల్యూటీవో అంతర్ధానానికి నాంది?

విశ్లేషణ


మోహన్ కుమార్

అబూ ధాబీలో ఇటీవల ముగిసిన ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రివర్గ సమావేశం (ఎంసీ 13) పెద్దగా సాఫల్యతలు లేకుండానే ముగిసింది. భారత్ లాంటి దేశాలకు ముఖ్యమైన మత్స్య రాయితీల అంశంలో, ప్రభుత్వాలు నిల్వచేసే ఆహార ధాన్యాల అంశంలో ఏ విధమైన పరిష్కారాలనూ కనుగొనలేదు. పైగా వివాదాల పరిష్కారం కోసం ఉద్దేశించిన అప్పిలేట్ బాడీ పునరుద్ధరణకు అమెరికా ససేమిరా అంది. అదే జరిగితే మళ్లీ 'గాట్' రోజులకు తిరిగి మరలాల్సి ఉంటుంది. ఇక, డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వస్తే ఆ దేశం ఏకంగా డబ్ల్యూటీవో నుంచే నిష్క్రమించినా ఆశ్చర్యం లేదు. 166 సభ్య దేశాలున్న ఈ సంస్థ ఉనికి ఇప్పటికే ప్రశ్నార్థకంగా ఉంది. ఈ నేపథ్యంలో భారత్ తన ఒప్పందాల విషయంలో త్వరపడాలి.

అబూ ధాబీలో (ఫిబ్రవరి 26 నుంచి మార్చ్ 2 వరకు) జరిగిన మరో డబ్ల్యూటీవో (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) మంత్రివర్గ సమావేశం ఎలాంటి ఆసక్తిని రేకెత్తించకుండానే ముగిసింది. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రధాన విధులు, అంటే చర్చల పనివిధానం, వివాద పరిష్కార పనితీరు గత కొంత కాలంగా స్తంభించిపోయాయి. ఇప్పటికే సమస్యల్లో ఉన్న ఈ సంస్థకు చెందిన 166 సభ్యదేశాల్లో బలమైన విభజనలు పెంచేలా, ఈ రెండింటినీ పునరుద్ధరించే ప్రయత్నాలు ఫలించలేదు.

అబూ ధాబీలో జరిగిన 13వ మంత్రివర్గ సమావేశం (ఎంసీ 13)లో డబ్ల్యూటీఓ సభ్యులకు నాలుగు ప్రధాన సవాళ్లు ఎదురయ్యాయి. ఒకటి, మత్స్య రాయితీలపై అంతుచిక్కని బహుపాక్షిక ఒప్పందాన్ని ఎలా ముగించాలి? రెండు, అప్పిలేట్ బాడీని ఎలా పునరుద్ధరించాలి? తద్వారా వివాద పరిష్కార యంత్రాంగంగా డబ్ల్యూటీఓ కిరీటంలో ఆభరణంగా ఉన్న దాని ఖ్యాతిని తిరిగి ఎలా పునరుద్ధరించాలి? మూడు, భారతదేశంతోపాటు అనేక ఇతర దేశాలు డిమాండ్ చేస్తున్న ఆహార భద్రతకు సంబంధించిన పబ్లిక్ స్టాక్ హోల్డింగ్ (ఆహార భద్రత కోసం ధాన్యాన్ని ప్రభుత్వం నిల్వచేయడం) సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఎలా పొందాలి? చివరగా, పరిశ్రమ కోరుతున్న ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిషన్‌లపై కస్టమ్స్ డ్యూటీకి సంబంధించిన మారటోరియం పొడిగింపును ఎలా నిర్ధారించాలి? ఇందులో ఉన్న ఆదాయ నష్టం కారణంగా కొన్ని ప్రభుత్వాలు (భారత్ వంటివి) దీన్ని ఇష్టపడలేదు. కొన్ని ఇతర సమస్యలు కూడా ఉన్నా, ఇవి ఎంసీ 13 కోసం ప్రధాన అజెండా అయ్యాయి.

మత్స్యకారులకు సబ్సిడీలపై బహుపాక్షిక ఒప్పందం గత మంత్రివర్గ సమావేశంలో పాక్షికంగా ముగిసింది. ఇది అమల్లోకి వచ్చేలా ఈ ఎంసీ 13లో పూర్తి చేయవలసి ఉంది. కానీ ఈ సందర్భంలో, సంధానకర్తలు ఏదీ సాధించలేకపోయారు. భారత్ సమానత్వం కోసం, న్యాయం కోసం పోరాడింది. దీనివల్లే యూరోపియన్ యూనియన్ సంధానకర్త ఒకే ఒక్క దేశం (భారత్) దీనికి తన సమ్మతిని నిలిపివేసినట్లు చెప్పారు. ఇది నిజమే అయినప్పటికీ, భారత్ తన మత్స్యకారుల జీవనోపాధి కోసం మంజూరు చేస్తున్న సబ్సిడీలను యూరోపియన్ యూనియన్, జపాన్, చైనా, తైవాన్‌లు ఇస్తున్న భారీ సబ్సిడీలతో సమానం చేయడం అసంబద్ధం. భారత్ 25 ఏళ్ల సమయాన్ని కోరింది. ఇది కొంచెం ఎక్కువగానే కనిపిస్తుంది. కానీ మన లాంటి సమాఖ్య నిర్మాణంలో, మనం నెమ్మదిగా మాత్రమే త్వర పడగలము! ఎన్నికల సంవత్సరం కూడా అయినందువల్ల మత్స్య కారుల ప్రయోజనాలను గట్టిగా కాపాడటం తప్ప, ఇంకేదీ ప్రభుత్వం చేయలేక పోయింది.

మన రైతులకు కూడా ఇదే వర్తిస్తుంది. పబ్లిక్ స్టాక్‌హోల్డింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొంటామని భారత్ లాంటి దేశాలకు ప్రకటించిన నిబద్ధతను ప్రపంచ వాణిజ్య సంస్థ నిలుపుకోలేదు. సమస్యంతా మార్కెట్ ప్రాప్యతతో దీన్ని లింక్ చేయాలని పట్టుబట్టిన అభివృద్ధి చెందిన దేశాలతోనూ, కెయిర్న్స్ గ్రూప్ తోనూ (19 వ్యవసాయ సంబంధ ఎగుమతి దేశాల గ్రూప్) ఉంది. పబ్లిక్ స్టాక్ హోల్డింగ్ అనేది తీవ్రమైన పేదరికాన్ని, ఆకలిని నిర్మూలించే స్థిరమైన అభివృద్ధి లక్ష్యంతో ముడిపడిన ఒక తీవ్రమైన అంశం. దీనిని మార్కెట్ యాక్సెస్‌కు తాకట్టు పెట్టడం అన్యాయం, అధర్మం కూడా. అంతిమ పరిణామం ఏమిటంటే, ఎంసీ 13 ఈ సమస్యపై పురోగతి సాధించడంలో విఫలమైంది.



యూఏఈలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రివర్గ సమావేశం (ఎంసీ 13)

అప్పిలేట్ బాడీ పునరుద్ధరణ గురించిన కథ సైతం భిన్నంగా ఏమీ లేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒక్క సభ్యదేశం, అంటే అమెరికా మాత్రమే దానిపై అభ్యంతరం వ్యక్తం చేయడమే గాక, దానిమీదే భీష్మించుకుని కూర్చుంది. అమెరికన్ ఎన్నికల వల్ల దీనికి అదనపు అనిశ్చితి కూడా తోడైంది. డోనాల్డ్ ట్రంప్ గనక విజయం సాధిస్తే, అన్నీ ముగిసిపోతాయి. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా అప్పిలేట్ బాడీ పునరుద్ధరణను అడ్డుకోవడమే కాకుండా ఏకంగా డబ్ల్యూటీఓ నుండే మొత్తంగా వైదొలిగినా ఆశ్చర్యం లేదు. ఏం జరగనుందో వేచి చూడాల్సిందే.

మూడు ప్రధాన సవాళ్లను ఎదుర్కోవడంలో విఫలమైన ఈ ఎంసీ 13 సమావేశం, ఎలక్ట్రానిక్ ప్రసారాలకు సంబంధించిన కస్టమ్స్ డ్యూటీ నిలుపుదలను కేవలం రెండేళ్లపాటు పొడిగించగలిగింది. అలా జరగకుండా అడ్డుకోవాలనే పట్టుదలతో ఉన్న భారత్... యూఏఈ వాణిజ్య మంత్రి నుంచి వచ్చిన వ్యక్తిగత అభ్యర్థన మేరకు చివరి నిమిషంలో అంగీకరించినట్లు భారత వాణిజ్య మంత్రి ద్వారా స్పష్టం చేసింది.

ఎంసీ 13 ఎదుర్కొన్న ఇతర ప్రధాన సమస్య ఏమిటంటే, బహుపాక్షిక చర్చల కార్యక్రమాలతో ఎలా వ్యవహరించాలి అనేదే. ఒక విషయం చాలా ముఖ్యమైనది: అదేమిటంటే, 100 దేశాల మద్దతుతో జరిగిన చైనా నేతృత్వంలోని పెట్టుబడి సులభతర అభివృద్ధి ఒప్పందం. కానీ ప్రతి డబ్ల్యూటీవో సభ్యదేశ ఏకాభిప్రాయాన్ని పొందనందున, దీన్ని సూత్రప్రాయంగా భారత్, దక్షిణాఫ్రికా వ్యతిరేకించాయి. చైనా ఈ పరిణామాన్ని ఊహించి ఉండాల్సింది. దీంతో బహుపాక్షిక వేదికలలో చైనా–భారత సన్నిహిత సహకార యుగం ముగింపు దశకు చేరుకుందని నిర్ధారించవచ్చు. 'బ్రిక్స్' సమూహానికి ఇది ఎలాంటి చిక్కులను కలిగిస్తుందో చూడాలి.

కాబట్టి అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుంటే, ఎంసీ 13లో వచ్చిన ఫలితాలు స్వల్పం. కొన్ని తాత్కాలిక నిర్ధారణలుగా వీటిని తీసుకోవచ్చు: ఒకటి, ప్రపంచ వాణిజ్య సంస్థకు నిజమైన బహుపాక్షిక(మల్టీలేటిరల్) సంస్థగా ఉజ్వల భవిష్యత్తు లేదు. కాబట్టి, అది బహుముఖంగా(ప్లూరీలేటిరల్) మారుతుందా? అలా అయితే, భారత్ దాన్ని ఎలా చూస్తుంది? రెండు, యథాతథ స్థితిని సూచించే అప్పీలేట్ బాడీ పునరుద్ధరణకు అమెరికా అంగీకరించే అవకాశం కనిపించడం లేదు. బదులుగా మనం కేవలం ఒకే-దశ ప్యానెల్ విధానంతో సాగిన 'గాట్' (పన్నులు, సుంకాలపై సాధారణ ఒప్పందం) తరహా పాత చెడ్డ రోజులకు తిరిగి మరలవచ్చు. అదే జరిగితే, భారత్ దానిని ఎలా ఎదుర్కొంటుంది? చివరగా, ప్రపంచ వాణిజ్య సంస్థను పునరుజ్జీవింపజేసే స్వల్ప అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్, బ్రిటన్, గల్ఫ్ సహకార మండలి (జీసీసీ)తో తన కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ త్వరపడాలి. ఈ విషయంలో సమయాన్ని వృథా చేసే ప్రసక్తే లేదు, మే నెలలో వచ్చే కొత్త ప్రభుత్వం దీన్నొక ప్రాధాన్యతగా దృష్టి సారించాల్సి ఉంది.

భారత వ్యూహాత్మక/విదేశీ విధాన చర్చలకూ, దాని వాణిజ్య విధాన చర్చలకూ మధ్య కొంత వ్యత్యాసం కూడా ఉంది. మనం అనతి కాలంలోనే ఏడు లేదా పది ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారతాం అనే ఊహపై మన వ్యూహాత్మక చర్చలు ఆధారపడి ఉన్నాయి. అయితే ప్రస్తుత వాణిజ్య విధాన ప్రక్రియ కేవలం రెండు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకే సరిపోతుంది! ఈ అంతరాన్ని పూడ్చాల్సిన అవసరం ఉంది. మే నెలలో ఏర్పడనున్న కొత్త ప్రభుత్వం వ్యవసాయం, భూమి, కార్మికులు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో లోతైన, నిర్మాణాత్మకమైన సంస్కరణలను చేపట్టడం దీనికి ఒక మార్గం. ఇది భారత్‌ను పెద్ద ఆర్థిక కూటమిలోకి చేరేలా సాయపడుతుంది.

వ్యాసకర్త మాజీ రాయబారి, డబ్ల్యూటీవోలో భారత అనుసంధానకర్త ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వెనకేసుకొచ్చే కారణం


చాలామంది అమెరికన్లకు ఇప్పటికీ తెలియని విషయం ఏమిటంటే, ప్రతి రాష్ట్రానికి ఎన్ని హౌజ్ సీట్లు ఉండాలనేది నిర్ణయించడం కోసం జనగణన అనేది 'అందరినీ' లెక్కిస్తుంది, అక్రమ వలసదారులతో సహా. దీని ఫలితంగా డెమోక్రాట్ (పాలిత) రాష్ట్రాలు అదనంగా మరో 20 దాకా హౌజ్ సీట్లు పొందుతాయి. అక్రమ వలసదారులను వెనక్కి పంపకుండా ఉండేందుకు డెమోక్రాట్లకు ఇది మరొక బలమైన ప్రోత్సాహకం.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

టైము పాటించవా?


గత ఏడాదిలో నేను చేసిన ఏ ఒక్క దేశీయ విమాన ప్రయాణం కూడా ఠంచనుగా టైముకు ప్రారంభం కాలేదు. ఒక్కటి కూడా! ఏ ఎయిర్‌లైన్స్ అన్నదానితో సంబంధం లేకుండా అంతటా ఇదే కథ. ప్రయాణీకుల సమయం పట్ల గౌరవమే లేదు. పౌర విమానయాన డీజీ, ఇలా జరగడం సరైందేనా?

– పాల్కీ శర్మ, జర్నలిస్ట్

ఏం చేయాలని?


ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) ప్రకారం, 2011 నుంచి 2022 మధ్యకాలంలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) తన క్యాడర్‌కు చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో శిక్షణ ఇచ్చేందుకుగానూ అజ్ఞాత వర్గాల నుంచి 9 కోట్ల రూపాయలు పోగేసింది.

– ప్రకాశ్ సింగ్, పోలీసు మాజీ ఉన్నతాధికారి

ముందు నేను...


మమ్మల్ని తల్లులు, చెల్లెళ్లు అని పిలవడం మానుకోండి! ఒక వ్యక్తికీ, ఆ వ్యక్తి పోషించే ఒకానొక పాత్రకీ మీకు తేడా తెలియదా?

– తారా కృష్ణస్వామి, యాక్టివిస్ట్

లీవు పూర్తవుతుందా?


బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ బోర్డు) అద్భుతమైన యజమాని. ఎవరినీ (ఉద్యోగం లోంచి) తీసేయదు. కేవలం మెడికల్ లీవు మీద పంపుతుందంతే.

– రమేశ్ శ్రీవత్స్, సెటైరిస్ట్

ఇన్ బాక్స్

ఓటు హక్కు కోల్పోతున్న విచారణ ఖైదీలు

మళ్ళీ ఎలక్షన్లు వస్తున్నాయి. విచారణ ఖైదీలు మరొక్కసారి ఓటు హక్కును వినియోగించు కోలేక పోతున్నారు. నేరం రుజువు కాకుండా, న్యాయమూర్తి శిక్ష వేయకుండా జైలులో ఉన్న సుమారు ఐదు లక్షల మంది విచారణ ఖైదీలు 2019 లోక్‌సభ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 62(5) ప్రకారం జైలు శిక్ష అనుభ విస్తున్నవారు, విచారణ ఖైదీలు, చట్టబద్ధమైన కస్టడీలో ఉన్నవారు ఎన్నికలలో ఓటు వేయకూడదు.



మన జైళ్లలో విచారణ ఖైదీలే 80 శాతం ఉన్నారు కాబట్టి ఓటు హక్కు విషయంలో శిక్ష పడ్డవారిని, విచారణ ఖైదీలను విడిగా చూడవలసిన అవసరం ఉంది. దోషిగా తేలిన వ్యక్తి బెయిల్‌పై బయట ఉంటే ఓటు వేయగలిగితే, కోర్టు ద్వారా నేరానికి పాల్పడినట్లు ఇంకా నిర్ధారణకాని వ్యక్తి హక్కు మాత్రం నిరాకరించబడుతోంది. ఎన్నికల చట్టంలోని ఈ నిబంధనను సవాలు చేస్తూ కొందరు కోర్టును ఆశ్రయించారు. 1997లో ఖైదీలకు ఓటు హక్కును కోరుతూ వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరిస్తూ, అటువంటి నిషేధం ఎందుకు అనే దానికి కొన్ని కారణాలను తెలిపింది. జైలులోని ప్రతి వ్యక్తీ ఓటు వేయడానికి భద్రతా ఏర్పాట్ల కోసం పెద్ద ఎత్తున పోలీసు బల గాలు అవసరమవుతాయి. తన ప్రవర్తన ఫలితంగా జైలులో ఉన్న వ్యక్తి సమాన స్వేచ్ఛను పొందలేడు. నేర నేపథ్యం ఉన్న వ్యక్తులను ఓటు హక్కుకు దూరంగా ఉంచడం సామాజిక అవసరం అని సుప్రీం పేర్కొంది.

ఏప్రిల్ 2019లో ముగ్గురు న్యాయ విద్యార్థులు ఖైదీలకు ఓటు వేసే హక్కు, ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951కు సవరణలు కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని పౌరులుగా తీర్చిదిద్ది తిరిగి సమాజానికి అందించే లక్ష్యంగా ఉన్న సంస్కరణాత్మక వ్యవస్థలో ఓటు హక్కు ఒక భాగం అని వారు సుప్రీం కోర్టుకు నివేదించారు. 2022 ఫిబ్రవరిలో వేసిన ఒక పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్క రించింది. అది శాసన నిర్ణయమనీ, అందులో కోర్టు జోక్యం కలిగించుకోలేదనీ పేర్కొంది. 2022 అక్టోబర్‌లో దాఖలైన మరో పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. ప్రజా ప్రాతి నిధ్య చట్టం–1951లోని సెక్షన్ 62(5)లోని చట్టబద్ధతను పరి శీలించేందుకు సుప్రీం అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వానికీ, ఎన్నికల కమిషన్‌కూ నోటీసు పంపి వాటి అభిప్రాయాన్ని కోరింది. ఆ తరవాతే పిల్‌ను విచారణకు చేపట్టనుంది.

ఖైదీల ఓటు హక్కును నిషేధించిన అతి కొద్ది దేశాల్లో భారత్ ఒకటి. 2018లో అమెరికాలోని ఖైదీలు దేశవ్యాప్త సమ్మె జరిపి ప్రధాన డిమాండుగా ఓటు హక్కును సాధించారు. బల్గేరియా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఇరాన్, ఇజ్రా యెల్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, ఘనా, కెన్యా, బోట్స్వానా వంటి దేశాలు తమ ఖైదీలకు ఎన్నికలలో ఓటు హక్కును అందిస్తున్నాయి. అయితే కొన్ని నియమ, నిబంధనలకు లోబడి ఈ హక్కు కల్పించారు.

గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి నుండే ఓటేసే అవకాశం కొత్తగా కల్పించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేవారికి పోస్టల్ బ్యాలెట్ విధానం ఉంది. వీటిని పాటిస్తే పోలింగ్ స్టేషన్ దాకా తరలించేందుకు భద్రతా ఏర్పాట్ల కోసం పోలీసు సిబ్బంది సరిపోదు అనే ప్రశ్న ఉత్పన్నం కాదు. నిజాయితీగా ఓటింగ్ జరగడమంటే యోగ్యులైన పౌరులందరికీ ఆ హక్కును వినియోగించుకొనే అవకాశం ఈయడమే అని శాసన కర్తలు గ్రహించాలి.

– బి. నర్సన్ | 94401 28169

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను ఆదుకోవాలి

అభిప్రాయం


డా॥ కొర్ర ఈశ్వర్ లాల్

2012వ సంవత్సరంలో మొదలైన గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థలో ప్రస్తుతం రాష్ట్రంలో 145 డిగ్రీ కళాశాలల్లో ఆర్థిక శాఖ అనుమతి పొందిన 1,940 శాంక్షన్ పోస్టుల్లో 1,600 మంది గెస్ట్ లెక్చరర్లు పని చేస్తున్నారు. వీరిలో డాక్టరేట్ పట్టాలు, నెట్, సెట్ లాంటి ఉన్నత విద్యార్హతలు కలిగినవారు ఉన్నారు. రాష్ట్రంలో అన్ని డిగ్రీ కళాశాలలూ 60 నుండి 70 శాతం వరకు గెస్ట్ లెక్చరర్లతోనే నడుస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే 25 కళాశాలల్లో 300 పైగా గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారంటే పరిస్థితి అర్థమవుతుంది. డిగ్రీ కళాశాలల్లో ప్రస్తుతం రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్ కేవలం 1400 (కాంట్రాక్ట్ నుండి రెగ్యులర్ అయిన వారిని కలుపుకొని) మంది మాత్రమే. కాంట్రాక్టు లెక్చరర్లు 500, గెస్ట్ లెక్చరర్లు 1,600 మంది ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కాంట్రాక్టు వ్యవస్థలో కొనసాగిన డిగ్రీ లెక్చరర్లను గత ప్రభుత్వం రెగ్యులర్ చేయడం జరిగింది. కానీ గెస్ట్ ఫ్యాకల్టీలో పది సంవత్సరాల పైబడి పనిచేస్తూ అన్ని విద్యా అర్హతలూ కలిగి ఉన్న మమ్మల్ని కాంట్రాక్టు పద్ధతికి మార్చరు. 12 నెలలకూ జీతాలు ఇవ్వరు. సర్వీస్‌ను కొనసాగించరు. ఒకే రాష్ట్రంలో ఒకే వ్యవస్థలో పనిచేస్తున్న వారిని రెండు విధాలుగా చూడడం ఎంతవరకు న్యాయం?

ప్రస్తుతం పదేళ్ల నుంచి డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న వారు కూడా ప్రతి సంవత్సరం ఉన్నత విద్యా కమిషనరేట్ వారు నియమించే 'త్రీ మెన్ కమిటీ' ముందు డెమో ఇచ్చి ఎంపిక అవ్వాల్సిందే. తెలంగాణలోని రెసిడెన్షియల్ కాలేజీలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు ఒక్కసారి డెమో చెప్పి కన్సాలిడేటెడ్ పేతో కొనసాగుతారు. ఇంటర్, కేజీబీవీ ఇంటర్ కాలేజీల విద్యా వ్యవస్థలో కూడా ఇదే పద్ధతిని కొనసాగిస్తున్నారు. కానీ కేవలం డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు మాత్రం భయం భయంతో, తీవ్ర ఆందోళన మధ్య జీవిస్తున్నారు. ప్రిన్సిపాళ్ల మెప్పుకోసం ఉపగ్రహాలుగా తిరుగుతూ... మిగతా రెగ్యులర్, కాంట్రాక్టు, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో అన్యోన్యంగా ఉంటూ వారి పనులు చేస్తూ బతుకుతున్నారు. అడ్మిషన్లు మొదలైనప్పుడు కాన్వాసింగ్ చేసుకుంటూ, విద్యార్థుల పాస్ పర్సంటేజీ పడిపోకుండా చూసుకుంటూ, కాలేజీలో పోటీపడి విద్యా బోధన చేస్తున్నారు. ఇంత గాడిద కష్టం చేసినా వచ్చేది ఆరేడు నెలల జీతమే. మిగతా స్టాఫ్‌తో సమానం కారన్న వివక్ష వారిని వేధిస్తోంది. మహిళలకు ప్రసూతి, చైల్డ్ కేర్ సెలవులు ఉండవు. గెస్ట్ లెక్చరర్ ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందోనని పెళ్లికాని యువకులకు ఎవరూ పిల్లను ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. అతిథి అధ్యాపకులు ఎంత దుర్భరంగా జీవిస్తున్నారో చెప్పడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.



ఈ పరిస్థితుల నుంచి వీరిని బయటపడేయడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను ఆటో రెన్యువల్ చేసి సర్వీసును కంటిన్యూ చేయాలి. 12 నెలలకు యూజీసీ నిబంధనల ప్రకారం పీరియడ్ విధానం రద్దు చేసి ప్రతి నెలకు రూ. 50 వేల ఏకీకృత వేతనాలు చెల్లించాలి. డెమో తీసుకొని పునర్నియమించే విధానానికి స్వస్తి పలికి, ఉద్యోగ భద్రత కల్పించి, మినిమం టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలి. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి తగు న్యాయం చేయాలి. మూడు సంవత్సరాల పైబడి బోధన చేస్తున్న లెక్చలర్లందరికీ 'ఈక్వలెంట్ సెట్ సర్టిఫికెట్'ను కమిషనర్ గారిచే జారీ చేయించాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నాం.

వ్యాసకర్త తెలంగాణ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు | 94911 11983

ఏవి నియంత్రించాలి?

జ్యోతిర్మయం

అత్యంత ప్రాచీన శ్రేష్ఠమైన జీవనవిధానం మనది. ఋషి సంప్రదాయం మనది. మానవ జీవితంలో సాధించాల్సినవి కూడా ఏనాడో మన పూర్వీకులు గ్రంథాల్లో పొందుపరచారు. ఆచరణలో అందించారు. అవే చతుర్విధ పురుషార్థాలు. పురుషుడు అంటే ఇక్కడ మానవుడు (స్త్రీ/పురుష) అని అర్థం. ఆ మానవుడు సాధించాల్సిన నాలుగు వరుసగా ధర్మం, అర్థం, కామం, మోక్షం.

ఆలయానికి వెళ్లిన ప్రతి సందర్భంలోనూ అర్చక స్వామి 'ధర్మార్థకామమోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం' అని అంటారు. కాని చాలా మంది అవి ఏమిటో తెలిసుకునే ప్రయత్నం చేయరు. ప్రతి ఒక్కరూ వరుసగా ఆ నాల్గింటినీ సాధించాలి మరి. అందులో మొట్టమొదటిదే ధర్మం. ఆ ధర్మానికి ముడిపడి ఉన్నవే అర్థ (సంపద), కామము (కోరిక)లు. ధర్మబద్ధమైన సంపదల వల్ల, ధర్మబద్ధమైన కోరికల వల్ల మానవ జన్మకి కలిగే విముక్తియే మోక్షం.

మనిషి ధర్మాన్ని పట్టుకోవాలి. అర్థ, కామాల్ని నియంత్రించుకోవాలి. ధర్మబద్ధ జీవితం వల్ల మోక్షం దానంతట అదే వస్తుంది. అర్థ, కామములు నది ప్రవాహంలోని వరదల వంటి వేగం కలవి. రెండు వైపులా వరదల వేగాన్ని నియంత్రించే నదీ తీరాలే ధర్మ, మోక్షాలు.

ఆధునిక మనోకాలుష్య ప్రపంచంలో ధార్మిక జీవనానికి స్థానమేది? చతుర్విధ పురుషార్థాల ఆలోచనేది? హడావిడి, ఆడంబర భక్తి పెరిగింది తప్ప ధర్మబద్ధ జీవనం, ఆధ్యాత్మికత్వం, ధర్మం అన్నదే లేదు. అధికాధిక డబ్బు సంపాదన, తరతరాలకు తరగని ఆస్తులు కూడబెట్టటం తప్ప ధర్మబద్ధమైన ఆర్థిక ప్రణాళిక, దానధర్మాలకు తావు లేదు. మితిమీరిన, తీరలేని, విలాసవంతమైన భౌతిక సుఖాలు–కోరికల వెంట పరుగెత్తటం తప్ప, ధర్మబద్ధమైన తృప్తి ఎక్కడ?

పాశ్చాత్య జీవన శైలికి అలవాటుపడ్డ మానవుడు భౌతిక సుఖాల వెంట పరుగెత్తుతూ, మానవ జీవిత లక్ష్యాన్ని విస్మరిస్తున్నాడు. ప్రపంచ దేశాలన్నీ భౌతిక వాదంతో ప్రకృతిని కొల్లగొట్టి, ప్రమాదకర పరిస్థితుల్లోకి భూగోళాన్నే నెట్టేశాయి. అనుభవించటమే జీవనసూత్రంగా పెట్టుకున్న దేశాలు, ఆయా దేశాల్లోని ప్రజలు తిరిగి ఆనందం, సుఖశాంతుల కోసం మన భారతీయ సాంస్కృతిక జీవన విధానం వైపు మరలుతున్నారు. ఈ క్రమంలో భారతీయులుగా మన వైభవోపేతమైన సాంస్కృతిక జీవన విలువల్ని పునఃస్థాపిద్దాం.

– సాక్షి

గ్రహం అనుగ్రహం: శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి**: బ.చతుర్దశి సా.5.58 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం**: ధనిష్ఠ ఉ.7.05 వరకు, తదుపరి శతభిషం తె.5.31 వరకు (తెల్లవారితే ఆదివారం), **వర్జ్యం**: ప.1.50 నుండి 3.18 వరకు, **దుర్ముహూర్తం**: ఉ.6.15 నుండి 7.49 వరకు, **అమృతఘడియలు**: రా.10.45 నుండి 12.13 వరకు ; **రాహుకాలం**: ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం**: ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం**: 6.17, **సూర్యాస్తమయం**: 6.04.

మహిళా సంక్షేమంలో మా పాలన దేశానికే ఆదర్శం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- అందరినీ కంటికి రెప్పలా కాపాడామని 'ఎక్స్'లో ట్వీట్



సాక్షి, హైదరాబాద్: మహిళా సంక్షేమంలో తమ పార్టీ పదేళ్ల పాలన దేశానికే ఆదర్శమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. అప్పుడే పుట్టిన ఆడబిడ్డ నుంచి అరుపదులు దాటిన అవ్వల వరకు తమ ప్రభుత్వం అందరినీ కంటికి రెప్పలా కాపాడిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు మహిళా దినోత్సవం సందర్భంగా 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'ఆకాశంలో సగం కాదు.. 'ఆమే'ఆకాశం, సంక్షేమంలో సగం కాదు.. 'ఆమే'అగ్రభాగం'అని ఆయన పేర్కొన్నారు. గర్భిణులకిచ్చిన న్యూట్రిషన్ కిట్లు ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి తొలి మెట్లు అని అన్నారు. ఆడబిడ్డ పుట్టిందంటే..ఇంట్లో లక్ష్మీదేవి అడుగుపెట్టినట్టేనని, కేసీఆర్ కిట్‌తోపాటు రూ.13 వేలు అందించామని వివరించారు. కార్పొరేట్‌కు దీటైన గురుకులాలతో పేద, మధ్య తరగతి తల్లిదండ్రుల కలలు సాకారమయ్యాయని అన్నారు. ఆడబిడ్డలకు రక్షణ కవచంగా నిలిచిన షీటీమ్స్ ఓ సంచలనమని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దిన వీహబ్ ఓ సంకల్పమని స్పష్టం చేశారు. అలాగే ప్రతి బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ ఓ గొప్ప సంప్రదాయమని అన్నారు. కల్యాణలక్ష్మి కేవలం పథకంకాదు.. ఒక సరికొత్త విప్లవమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఓవైపు భ్రూణహత్యలకు బ్రేక్ పడితే.. మరోవైపు బాల్యవివాహాలకు ఫుల్‌స్టాప్ పడిందన్నారు. గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్లదూరం నడిచిన మహిళల కష్టాలను భగీరథతో శాశ్వతంగా తీర్చిన మిషన్.. మన అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు అత్యధిక పారితోషికాలతో, గౌరవప్రదంగా జీవించే విజన్ అని అన్నారు. ఆరోగ్యలక్ష్మి పథకంపై నీతి ఆయోగ్ ప్రశంసల వర్షం కురిపించిందని గుర్తు చేశారు. అమ్మఒడి వాహనాలపై సర్వత్రా హర్షం వ్యక్తం అయిందన్నారు. మహిళా సాధికారతలో నాడు తెలంగాణకు తిరుగులేదని పేర్కొన్నారు. భర్తను కోల్పోయిన అక్కాచెల్లెళ్లకు అన్నలా, ఒంటరి మహిళలకు తండ్రిలా, ఆడబిడ్డలకు మేనమామలా, అవ్వలకు పెద్దకొడుకులా కొండంత అండగా నిలిచిన ఏకైక పాలకుడు కేసీఆర్ అని అన్నారు. పదేళ్ల పాలనలో సముద్రమంత సంక్షేమాన్ని అందించి.. ఆడబిడ్డల సమగ్ర అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం బంగారు బాటలు వేసిందని పేర్కొన్నారు. యావత్ నారీ శక్తికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌కు మద్రాస్ ఐఐటీ ఆహ్వానం

- ఎంట్రప్రెన్యూర‌ల్ ఫెస్టివల్‌లో ప్రసంగించాలని కోరిన ఐఐటీ

సాక్షి, హైదరాబాద్: దేశంలోని అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో ఒకటైన ఐఐటీ మద్రాస్.. తమ సంస్థలో జరిగే ఎంట్రప్రెన్యూరల్ ఫెస్టివల్ (ఈ–సమ్మిట్)కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించింది. ఏటా తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఎంట్రప్రెన్యూరల్ ఫెస్టివల్లో కీలకోపన్యాసం చేయాలని కోరింది. ఈ– సమ్మిట్ కు మద్రాస్ ఐఐటీ ఏటా దేశ విదేశాల నుంచి ఎంట్రప్రెన్యూరల్ రంగంలో కీలకమైన వ్యక్తులను, సంస్థల అధిపతులను, పాలసీ మేకర్లను, ప్రముఖ వ్యక్తులను ఆహ్వానిస్తుంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను భవిష్యత్తు ఎంట్రప్రెన్యూరల్ ఔత్సాహికులకు దిశా నిర్దేశం చేయాల్సిందిగా కోరింది. శని, ఆదివారాల్లో జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన క్రిస్ గోపాలకృష్ణన్, హెచ్‌సీఎల్ సహ వ్యవస్థాపకుడు అజయ్ చౌదరి వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నట్లు ఐఐటీ మద్రాస్ తెలిపింది.

జీవో నంబర్ 3ను రద్దు చేయాలి

- ఉద్యోగ అభ్యర్థులకు గవర్నర్ అపాయింట్‌మెంట్ ఇవ్వాలి: కవిత



ఇందిరాపార్కులో దీక్ష చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

కవాడిగూడ (హైదరాబాద్): ఉద్యోగ నియామకాల్లో ఆడబిడ్డలకు అన్యాయం చేసే జీవో నంబర్ 3ను రద్దు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు ఉద్యోగాలలో 33శాతం వాటా కల్పించాలని కోరుతూ శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద భారత జాగృతి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి ఓటుకు కోట్లు కేసుపై ఉన్న శ్రద్ధ ఆడబిడ్డల ఉద్యోగాలపై లేదన్నారు. మహిళా దినోత్సవం రోజే మహిళల రిజర్వేషన్ల కోసం ధర్నా చేసే దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక కేసీఆర్ మహిళలకు అన్ని రంగాల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లు తగ్గేలా ఉత్తర్వులు తీసుకువచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక, బిహార్ రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నాయని, ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించడంలేదని ప్రశ్నించారు. ఉద్యోగ మహిళా అభ్యర్థులకు గవర్నర్ తమిళిసై అపాయింట్‌మెంట్ ఇస్తే జీవో నంబర్ 3 వల్ల నియామకాల్లో మహిళలకు జరిగే అన్యాయాన్ని వివరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, మాగంటి గోపీనాథ్, దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ...మహిళ లేనిదే గమ్యం, గమనం లేదన్నారు. భూమి కోసం భుక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ, రాణి రుద్రమ మనకు స్ఫూర్తి ప్రదాతలని చెప్పారు. తెలంగాణలో మహిళల అభ్యున్నతి కోసం పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆమె కేక్ కట్ చేసి విమెన్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు, పలువురు మహిళా నేతలు పాల్గొన్నారు.

పాత నేరస్తుల పని పడుతున్నారు!

- నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలులో సీఐడీ దూకుడు
- ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితులు కటకటాల్లోకి..
- ఏడాది కాలంలో 212 ఎన్‌బీడబ్ల్యూలు పూర్తి



సాక్షి, హైదరాబాద్: ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తులను, నిందితులను తెలంగాణ సీఐడీ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసి తీసుకువస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు పారిపోయిన మోసగాళ్లను సైతం కటకటాల వెనక్కి నెడుతున్నారు. గత 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్ల (ఎన్‌బీడబ్ల్యూ) అమలు కోసం తెలంగాణ సీఐడీ విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్‌బీడబ్ల్యూ స్పెషల్ ఎగ్జిక్యూషన్ టీం సత్ఫలితాలిస్తోంది. 2023 ఫిబ్రవరిలో ఈ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినప్పటి నుంచి మొత్తం 212 నాన్‌బెయిలబుల్ వారెంట్లను పరిష్కరించారు. రూ.కోట్లలో అమాయకులను మోసగించి దశాబ్దాలుగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న అంతర్రాష్ట్ర నేరస్తులపై ఎస్పీ రామ్‌రెడ్డి నేతృత్వంలోని ఈ ఎన్‌బీడబ్ల్యూ స్పెషల్ ఎగ్జిక్యూషన్ బృందం ఫోకస్ పెట్టింది. ఫలితంగా పాత కేసులలోనూ చిక్కుముడులు వీడుతున్నాయి. మొత్తంగా ఏడాదికాలవ్యవధిలో 156 ఎన్‌బీడబ్ల్యూల సమాచారం ప్రత్యేక బృందం సేకరించింది. 56 మంది పాత నేరస్తులను అరెస్టు చేసింది.

ఇటీవల అమలు చేసిన ఎన్‌బీడబ్ల్యూ కేసులు కొన్ని..

- మంచిర్యాల టౌన్‌లో 1995 నమోదైన ఒక డెకాయిటీ కేసులో 29 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న అప్పల సత్తయ్య అనే నేరస్తుడిని ఈ ఏడాది జనవరి 24న కరీంనగర్‌లో అరెస్టు చేసింది.
- ఆన్‌లైన్ ఓఎల్ఎక్స్ మోసం కేసులో ఎనిమిదేళ్లుగా సీఐడీ సైబర్‌క్రైం పోలీసులకు చిక్కకుండా ఉన్న సోహేల పొద్దార్ అనే పాత నిందితుడిని ముంబైలో ఈ ఏడాది జనవరి 29 ఎన్‌బీడబ్ల్యూ స్పెషల్ ఎగ్జిక్యూషన్ టీం అరెస్టు చేసింది.
- కృషి బ్యాంకు కుంభకోణం కేసులో 22 ఏళ్లుగా పరారీలో ఉన్న ఆ బ్యాంకు డైరెక్టర్ కాగితాల శ్రీధర్‌ను గతేడాది సెప్టెంబర్ 25న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో అరెస్టు చేసింది.

సాంకేతికత వినియోగంతో సమాచారం కూపీ లాగుతారు..

మోసాలు చేయడంలో దిట్ట అయిన సదరు పాత నేరస్తులను గుర్తించేందుకు తెలంగాణ సీఐడీ ఎన్‌బీడబ్ల్యూ స్పెషల్ ఎగ్జిక్యూషన్ టీం సాంకేతికతను వినియోగిస్తోంది. నేరస్తుల సీడీఆర్ (కాల్ డీటెయిల్డ్ రికార్డ్), బ్యాంకు ఖాతాలకు లింక్ అయిన ఉన్న మొబైల్ నంబర్ల ఆధారంగా, అదేవిధంగా స్విగ్గీ, ఓయో, ర్యాపిడో, అమెజాన్ డాటా ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. సైకాప్స్ అప్లికేషన్ ద్వారా కూడా వివరాలు విశ్లేషిస్తున్నారు. గ్యాస్ కనెక్షన్, మొబైల్ నంబర్‌కు ఇచ్చే ఆధారాలు, సోషల్ మీడియా ఖాతాల్లో ఫోన్ నంబర్లు ఇలా...అన్ని కోణాల్లో సదరు నిందితుల సమాచారం సేకరిస్తున్నారు. ఎక్కడున్నాడనేది స్పష్టత వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో ఆపరేషన్ చేపడుతున్నారు.

ఎన్‌బీడబ్ల్యూ అరెస్టులు ఇలా...

స్పెషల్ ఎగ్జిక్యూషన్ టీం అరెస్టు చేసిన నిందితుల సంఖ్య	32
ఎన్‌బీడబ్ల్యూ రీకాల్	21
అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో అరెస్టు చేసిన వారు	03
మొత్తం	56

ప్రజావాణికి ఇళ్ల దరఖాస్తుల వెల్లువ

- 461 అర్జీల్లో 139 ఇళ్ల కోసమే
- 105 మైనార్టీ సంక్షేమానికి

లక్డీకాపూల్ (హైదరాబాద్): మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఇళ్ల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. మహాశివరాత్రి పర్వదినమైనప్పటికీ శుక్రవారం వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 461 అర్జీలు అధికారులకు అందాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి పర్యవేక్షణలో ప్రజావాణి నోడల్ అధికారిణి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అందులో సొంతిళ్లు కావాలంటూ 139 దరఖాస్తులు రాగా మైనారిటీ సంక్షేమం కోసం 105 అర్జీలు అందాయి. భూ సమస్యల పరిష్కారం కోరుతూ 74 మంది, రేషన్‌కార్డు, పింఛను కోసం 54 దరఖాస్తులు పెట్టుకున్నారు. వీటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

రాజ్యసభకు సుధామూర్తి

నామినేట్ చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ/బనశంకరి: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎస్.ఆర్.నారాయణమూర్తి సతీమణి, ప్రముఖ సంఘ సేవకురాలు, రచయిత్రి డాక్టర్ సుధా నారాయణమూర్తి(73) రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఆమెను పార్లమెంట్ ఎగువ సభకు నామినేట్ చేశారు. సామాజిక, విద్యా రంగాల్లో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా పెద్దల సభకు పంపిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజే రాజ్యసభకు నామినేట్ చేయడం తనకు డబుల్ సర్‌ప్రైజ్ అని సుధామూర్తి పేర్కొన్నారు. తాను ఏనాడూ పదవులు ఆశించలేదని చెప్పారు. రాష్ట్రపతి తనను పెద్దల సభకు నామినేట్ చేయడానికి గల కారణం తెలియదని అన్నారు. ఉన్నత చట్టసభకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని వెల్లడించారు. ఇది తనకు కొత్త బాధ్యత అని వ్యాఖ్యానించారు. రాజ్యసభ సభ్యురాలిగా తన వంతు సేవలు అందిస్తానని వివరించారు. ప్రధాని మోదీకి సుధామూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో పర్యటిస్తున్న సుధామూర్తి ఫోన్‌లో మీడియాతో మాట్లాడారు.

ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సుధామూర్తిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు నామినేట్ చేయడం చాలా ఆనందంగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అనాథ ఆశ్రమాలు ఏర్పాటు చేయడంతోపాటు వివిధ రంగాల్లో ఎన్నెన్నో సేవలు అందించిన సుధామూర్తి చట్టసభలోకి అడుగు పెడుతుండడం నారీశక్తికి నిదర్శనమని మోదీ ఉద్ఘాటించారు. ఆమెకు అభినందనలు తెలియజేశారు.

టెల్కోలో తొలి మహిళా ఇంజనీర్

డాక్టర్ సుధామూర్తి 1950 ఆగస్టు 19న కర్ణాటకలోని హావేరి జిల్లా శిగ్గావిలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు డాక్టర్ ఆర్‌హెచ్ కులకర్ణి, విమలా కులకర్ణి. సుధామూర్తి హుబ్లీలోని బీవీబీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బీఈ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ నుంచి కంప్యూటర్స్‌లో ఎంఈ చేశారు. టాటా ఇంజినీరింగ్ లోకోమోటివ్ కంపెనీ(టెల్కో)లో ఉద్యోగంలో చేరారు. దేశంలోనే అతి పెద్దవాహన తయారీ కంపెనీలో మొదటి మహిళా ఇంజినీర్‌గా గుర్తింపు పొందారు. 1970 ఫిబ్రవరి 10న నారాయణమూర్తితో వివాహం జరిగింది. 1981లో స్థాపించిన ఇన్ఫోసిస్ కంపెనీకి సుధామూర్తి సహ వ్యవస్థాపకురాలు. సంస్థ ప్రారంభించే సమయంలో రూ.10వేలు తన భర్తకు ఇచ్చి ప్రోత్సహించారు.



సేవా కార్యక్రమాలు.. పురస్కారాలు

1996లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌ను సుధామూర్తి ప్రారంభించారు. కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో పలు పుస్తకాలు రాశారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వరద బాధితుల కోసం 2,300 ఇళ్లు నిర్మించారు. పాఠశాలల్లో 70 వేల గ్రంథాలయాలు నిర్మించారు. భారత ప్రభుత్వం నుంచి 2006లో పద్మశ్రీ,, 2023లో పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. కర్ణాటక ప్రభుత్వం నుంచి చింతామణి అత్తిమబ్బే అవార్డు స్వీకరించారు. సాహిత్యంలో ఆమె చేసిన సేవకుగానూ ఆర్కే నారాయణ సాహిత్య పురస్కారం, శ్రీరాజా–లక్ష్మీ ఫౌండేషన్ అవార్డు అందుకున్నారు. భర్త నారాయణమూర్తి (2014)తో సమానంగా 2023లో గ్లోబల్ ఇండియన్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు ద్వారా తాను అందుకున్న మొత్తాన్ని టోరంటో విశ్వవిద్యాలయానికి విరాళంగా ఇచ్చారు. నాన్‌ఫిక్షన్ విభాగంలో క్రాస్‌వర్డ్ బుక్ అ వార్డు, ఐఐటీ–కాన్పూర్ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. నారాయణమూర్తి, సుధామూర్తి దంపతులకు అక్షతామూర్తి, రోహన్‌మూర్తి సంతానం. అక్షతామూర్తి భర్త రిషి సునాక్ బ్రిటన్ ప్రధాన మంత్రి. వీరిది ప్రేమ వివాహం.

◆ రాజ్య సుధ

- ప్రత్యేక కథనం ఫ్యామిలీలో

బెంగళూరు గొంతెండుతోంది

ఎటుచూసినా నీటి ఎద్దడే నగరంలో వట్టిపోయిన బోర్లు

వేసవి రాకముందే సమస్య • నీటి వాడకంపై ఆంక్షలు • ఉల్లంఘిస్తే రూ.5,000 జరిమానా

"అవడానికి మాదో లగ్జరీ అపార్ట్‌మెంట్. కానీ ఏం లాభం? నెల రోజులుగా చుక్క నీటికీ దిక్కు లేక అల్లాడుతున్నాం! 24 గంటలూ రావాల్సిన నల్లా నీళ్లు ఏ రాత్రి వేళో వస్తున్నాయి. అవీ మురికిమయం! స్నానపానాలకే కాదు, చివరికి టాయ్‌లెట్ అవసరాలకు కూడా నీరు లేదు. సరిగా నీళ్లు కూడా పోయక ఏ ఫ్లాట్‌లో చూసినా టాయ్‌లెట్లు భరించలేనంతగా కంపు కొడుతున్నాయి. దాంతో రెసిడెంట్లు మూకుమ్మడిగా ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. అలా వెళ్లలేనివాళ్లం విధిలేక పక్కనే ఉన్న ఫోరం సౌత్ మాల్‌లోకి వెళ్లి టాయ్‌లెట్ అవసరాలు తీర్చుకుంటున్నాం!" - రెడిట్‌లో ఓ బెంగళూరు వాసి పెట్టిన పోస్టిది! అలాంటిదేమీ లేదంటూ సదరు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఖండించినా ఈ పోస్టు ప్రస్తుతం తెగ వైరలవుతోంది. దీనికి బెంగళూరు టెకీల నుంచి విపరీతమైన స్పందన వెల్లువెత్తుతోంది. తమ నీటి కష్టాలకు అంతు లేదంటూ వర్ణిస్తూ వారు పెడుతున్న పోస్టులతో ఇంటర్నెట్ హోరెత్తిపోతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్



దేశ ఐటీ రాజధాని బెంగళూరు గొంతెండిపోతోంది. తీవ్ర నీటి కొరతతో అల్లాడుతోంది. గుక్కెడు తాగునీటి కోసం జనం అలో లక్ష్మణా అంటూ అలమటిస్తున్నారు. నగరవ్యాప్తంగా బోర్లన్నీ చుక్క నీరైనా లేకుండా ఎండిపోయాయి. నగరంలో ఏటా వేసవిలో నీటి కొరత మామూలే అయినా ఈసారి మాత్రం సమస్య చాలా దారుణంగా ఉంది. ఇంకా వేసవి మొదలైనా కాకముందే నీటి కొరత తారస్థాయికి చేరింది. కోట్లు పెట్టి లగ్జరీ అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు కొనుక్కున్న వాళ్లు కూడా కనీసం స్నానానికైనా నీళ్లు లేక లబోదిబోమంటున్నారు. సమర్థమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లేవీ చేయలేక ప్రభుత్వ యంత్రాంగం కూడా ప్రస్తుతానికి చేష్టలుడిగింది. రాష్ట్రవ్యాప్తంగా నీటి ఎద్దడి నెలకొని ఉందంటూ ప్రకటించింది! నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఇప్పటికే తాలూకా స్థాయిలో కంట్రోల్ రూములు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసింది. బెంగళూరులో నీటి సమస్య నివారణకు ఎంతదూరమైనా వెళ్తామంటూ ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ చేసిన ప్రకటనలు ఇప్పటికైతే కార్యరూపం దాల్చలేదు. పరిస్థితి పూర్తిగా చేయి దాటకుండా చూసేందుకు నగరంలో నీటి వాడకంపై రాష్ట్ర జల బోర్డు కఠిన ఆంక్షలు విధించింది. కార్లు కడిగేందుకు, మొక్కలకు, మెయింటెన్స్, నిర్మాణ పనులకు తాగునీటి వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్టు ప్రకటించింది. ఉల్లంఘిస్తే రూ.5,000 జరిమానా తప్పదని హెచ్చరించింది. బెంగళూరులోనే గాక కర్ణాటకవ్యాప్తంగా నీటి ఎద్దడి ఆందోళనకర స్థాయిలోనే ఉంది. గత సీజన్లో వర్షాభావమే ఈ దుస్థితికి కారణమన్న ప్రభుత్వ ప్రకటనపై జనం మండిపడుతున్నారు. ఇంతటి సమస్య తప్పదని ముందే తెలిసి కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లేవీ చేయలేదంటూ దుయ్యబడుతున్నారు. "నిజానికి మూడు నెలలుగా నీటి సమస్య వెంటాడుతోంది. నెల నుంచి పరిస్థితి మరీ విషమించింది" అంటూ వాపోతున్నారు.

ట్యాంకర్ల రేట్లు చుక్కల్లోకి...

- ➤ బెంగళూరులో ఏకంగా 60 శాతం జనం నీటి కోసం వాటర్ ట్యాంక్‌ల మీదే ఆధారపడ్డారు! అదను చూసి ప్రైవేట్ ట్యాంకర్లు రేట్లు ఎడాపెడా పెంచేశాయి.
- ➤ మామూలు రోజుల్లోనే 6,000 లీటర్ల ట్యాంకర్‌కు రూ.600, 8,000 లీటర్లకు రూ.800, 12 వేల లీటర్ల ట్యాంకరైతే రూ.1,000 చార్జి చేస్తారు.
- ➤ ఈ రేట్లకు జీఎస్టీ అదనం. పైగా దూరం 5 కి.మీ. దాటితే మరో రూ.200 దాకా పెరుగుతుంది.
- ➤ ఇప్పుడు ప్రైవేట్ ట్యాంకర్లు రెట్టింపు, అంతకుమించి వసూలు చేస్తున్నాయంటూ జనం గగ్గోలు పెడుతున్నారు.
- ➤ దాంతో ట్యాంకర్ల రేట్లకు పరిమితి విధిస్తామన్న ప్రభుత్వ ప్రకటన ఎక్కడా పెద్దగా అమలు కావడం లేదు.
- ➤ ఇవేం ధరలంటూ గట్టిగా నిలదీస్తే ట్యాంకర్‌వాలాలు ఆ కాలనీల ముఖం కూడా చూడటం లేదు.
- ➤ మున్సిపాలిటీ నల్లాల వద్ద క్యూ లైన్లు కిలోమీటర్లు దాటేస్తున్నాయి. అక్కడా ఒక్క బిందెకు మించి ఇవ్వడం లేదు!
- ➤ ఆర్వో ప్లాంట్ల ముందు కూడా ఒక్కరికి ఒక్క క్యానే అంటూ బోర్డులు దర్శనమిస్తున్నాయి!
- ➤ చాలా ప్లాంట్లు 'నో వాటర్' అంటూ బోర్డులు పెట్టి బ్లాకులో అడ్డగోలు రేట్లకు అమ్ముకుంటున్నాయి.
- ➤ నీటి ఎద్దడి దెబ్బకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థలు ఆన్‌లైన్ బాట పడుతున్నాయి. ఆన్‌లైన్ క్లాసులతో పని కానిస్తున్నాయి.

ఎందుకింత సమస్య...

- ➤ 2023లో కర్ణాటక వ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ప్రస్తుత నీటి సమస్యకు ప్రధాన కారణాల్లో ఒకటి.
- ➤ రాష్ట్రంలో ఎక్కడ చూసినా భూగర్భ జలాలు అడుగంటాయి. కావేరీ బేసిన్లోని రిజర్వాయర్లన్నీ దాదాపుగా వట్టిపోయాయి.
- ➤ కర్ణాటకలోని 16 పెద్ద రిజర్వాయర్లలో 2023లో ఇదే సమయానికి సగం వరకున్న నీటిమట్టం ఈసారి 29 శాతానికి పడిపోయింది.
- ➤ బెంగళూరులో ఎక్కడ చూసినా బోర్లే దర్శనమిస్తుంటాయి. భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేయడం నగరంలో నీటి ఎద్దడికి ప్రధాన కారణం.
- ➤ రియల్టీ బూమ్ నేపథ్యంలో రెండు దశాబ్దాలుగా నగరంలోని చెరువులు, నీటి ఆవాసాలన్నీ కాలనీలు, అపార్ట్‌మెంట్లుగా మారిపోయాయి. ఆ దెబ్బకు స్థానిక నీటి వనరులు పూర్తిగా కనుమరుగయ్యాయి.

సిలిండర్ ధర రూ.100 తగ్గింపు

నారీశక్తికి లబ్ధి చేకూరుతుందన్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 14.2 కేజీల వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.100 తగ్గిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. తగ్గిన ధర వెంటనే అమల్లోకి వచ్చిందని ప్రభుత్వం పేర్కొంది. ధర తగ్గింపుతో ఢిల్లీలో 14.2 కేజీల గృహవినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.803కు దిగి వచ్చింది. స్థానిక పన్నుల్లో వ్యత్యాసాలను బట్టి రాష్ట్రాల్లో ధరలో స్వల్ప మార్పులు ఉండొచ్చు. దేశీయ ఇంధన ధరలకు ప్రామాణికంగా భావించే అంతర్జాతీయ చమురు, గ్యాస్ ధరలు స్వల్పంగా కిందకు దిగొచ్చిన కారణంగానే ఎల్పీజీ ధర తగ్గించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. రికార్డుస్థాయిలో గత 23 నెలలుగా పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ' మహిళా దినోత్సవం సందర్భంగా మా ప్రభుత్వం ఎల్పీజీపై రూ.100 తగ్గించింది. దేశవ్యాప్తంగా కోట్లాది గృహాలకు ముఖ్యంగా నారీశక్తికి ఈ నిర్ణయం లబ్ధి చేకూరుతుంది' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. గత ఆరునెలల వ్యవధిలో వంటగ్యాస్ ధర తగ్గించడం ఇది రెండోసారి. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది ఆగస్ట్‌లో సిలిండర్‌పై రూ.200 ధర తగ్గించారు. దీంతో అప్పటిదాకా తొమ్మిది నెలలుగా గరిష్టస్థాయి వద్ద ఉన్న సిలిండర్ ధర రూ.1,103 నుంచి రూ.903కు దిగివచ్చింది. శుక్రవారం నాటి తగ్గింపుతో వినియోగదారులకు ఇంకాస్త ఉపశమనం లభించింది.

ఉజ్వల లబ్ధిదారులకు రూ.503కే : దేశవ్యాప్తంగా అందరూ సబ్సిడీయేతర ధరకే వంటగ్యాస్‌ను కొనుగోలుచేస్తున్నారు. అయితే " ప్రధాన్‌మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత కనెక్షన్ పొందిన గ్రామీణ ప్రాంత పేదలకు మాత్రమే ఒక్కో సిలిండర్‌పై రాయితీ రూ.300 వారి బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి. తాజా తగ్గింపుతో వారు రూ.503కే సిలిండర్ పొందొచ్చు" అని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్న గ్యాస్ ధరలు ఎన్నికల్లో ప్రధానాంశంగా మారాయి. 2021 జూలై- 2023 ఆగస్ట్ మధ్య సిలిండర్ ధర ఏకంగా రూ.294 పెరిగింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ వినియోగదారులు 33 కోట్లకుపైగా ఉన్నారు. ఉజ్వల పథకం లబ్ధిదారులు దాదాపు 10 కోట్ల మంది ఉంటారు. ధర తగ్గింపుతో దేశంలోని రిటైల్ చమురు రంగ సంస్థలకు రూ.వేల కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా.


ఢిల్లీ ఎస్సై అత్యుత్సాహం

న్యూఢిల్లీ: శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల వేళ ఉత్తర ఢిల్లీలోని కిక్కిరిసిన రహదారిపై నమాజ్ చేస్తున్న ముస్లింలపై ఒక పోలీస్ అధికారి తన ప్రతాపం చూపించాడు. రోడ్డు దిగ్బంధం చేయొద్దని తిడుతూ వీరావేశంతో కొట్టడం మొదలెట్టాడు. తన్నుతూ అక్కడి వారిని పక్కకు నెట్టడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మసీదు జనంతో నిండిపోవడంతో రోడ్డుపై నమాజ్ చేయాల్సి వచ్చిందని కొందరు ఆ సబ్‌ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ తోమర్‌తో వాగ్వాదానికి దిగారు. ఢిల్లీలోని ఇందర్‌లోక్ మెట్రో స్టేషన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై నమాజ్ చేయొద్దని ఒక పోలీసు నెమ్మదిగా వారిస్తుండగా, కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో సబ్‌ఇన్‌స్పెక్టర్ కొట్టడాన్ని ముస్లింలు తీవ్రంగా తప్పుబట్టారు. ఎస్సైను సస్పెండ్‌చేయాలంటూ స్థానిక ముస్లింలు రాస్తారోకో చేపట్టారు. పరిస్థితి చేయి దాటకుండా ఉండేందుకు పారామిలటరీ బలగాలు రంగంలోకి దిగాయి. ఆ ఎస్సైను సస్పెండ్ చేస్తూ ఢిల్లీ నార్త్ డెప్యూటీ కమిషనర్ ఎంకే మీనా ఆదేశాలిచ్చారు.

ట్రంప్ ప్రపంచానికే ముప్పు

అమెరికా అధ్యక్షుడు బైడెన్ మండిపాటు

వాషింగ్టన్: తన కంటే ముందు దేశాధ్యక్షుడిగా పని చేసిన ఒక నాయకుడు అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛకు ముప్పుగా పరిణమించాడని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆరోపించారు. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్‌పై పరోక్షంగా దుమ్మెత్తి పోశారు. ఏ అధ్యక్షుడైనా అమెరికా ప్రజలను రక్షించడాన్ని కనీస బాధ్యతగా భావిస్తాడని, ఈ విషయంలో ఆ మాజీ అధ్యక్షుడు పదవిలో ఉన్నప్పుడు ఈ విషయంలో దారుణంగా విఫలమయ్యాడని, అతడిని క్షమించలేమని అన్నారు. బైడెన్ గురువారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గంటపాటు మాట్లాడిన బైడెన్.. ట్రంప్ పేరును 13 సార్లు పరోక్షంగా ప్రస్తావించారు. పలు అంశాల్లో ట్రంప్ వైఖరిని తప్పుపట్టారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ముందు ట్రంప్



మోకరిల్లాడని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. 'నాటో' దేశాలను ఏమైనా చేసుకోండి అంటూ పుతిన్‌కు సూచించాడని ఆరోపించారు. పుతిన్ చర్యలను అడ్డుకోకపోతే ప్రపంచ దేశాలకు నష్టం తప్పదని హెచ్చరించారు. పుతిన్ ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి ఉక్రెయిన్‌కు అన్ని రకాలుగా సాయం అందించాల్సి ఉందని పేర్కొన్నారు. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో సాధారణ పాలస్తీనియన్లు మరణించడం చూసి తాను తీవ్రంగా చలించిపోయానని బైడెన్ చెప్పారు.

గంజాయి తీసుకుంటే నేరం కాదు

డెమొక్రటిక్ పార్టీ నేత జో బైడెన్ మరోసారి అమెరికా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మళ్లీ నెగ్గడానికి యువ ఓటర్ల మనసులు గెలుచుకొనే పనికి శ్రీకారం చుట్టారు. గంజాయి తీసుకుంటే, గంజాయి కలిగి ఉంటే నేరంగా పరిగణించవద్దని తేల్చిచెప్పారు. గంజాయి విషయంలో అమల్లో ఉన్న నిబంధనలను సమీక్షించాలని తన మంత్రివర్గాన్ని ఆదేశించానని చెప్పారు. సాధారణంగా స్టేట్ ఆఫ్ ద యూనియన్ అడ్రస్‌లో తమ విదేశాంగ విధానంతోపాటు దేశీయంగా కీలక అంశాలను అమెరికా అధినేతలు ప్రస్తావిస్తుంటారు. కానీ, గంజాయి గురించి మాట్లాడిన మొట్టమొదటి అధ్యక్షుడు మాత్రం బైడెన్ కావడం విశేషం.



మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కార్యకర్తలు అందజేసిన కేక్‌ను కట్ చేస్తున్న రాహుల్ గాంధీ

'స్టార్టప్ ఇండియా' లోపభూయిష్టం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

గోధ్రా(గుజరాత్): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన 'స్టార్టప్ ఇండియా' విధానం సరిగ్గా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ విధానం ఫలితంగా దేశంలో ఒక్కటంటే ఒక్క స్టార్టప్ కూడా లేదన్నారు. ఉన్నవి కూడా విదేశీ సంస్థల నియంత్రణలోనే నడుస్తున్నాయన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర శుక్రవారం గుజరాత్‌లోని గోధ్రాకు చేరుకుంది. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన సభలో రాహుల్ మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే స్టార్టప్‌లకు ఊతమిచ్చేందుకు రూ.5 వేల కోట్లతో నిధిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అదేవిధంగా, 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. బడా పారిశ్రామిక వేత్తలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జోడో యాత్ర గురువారం రాజస్తాన్ నుంచి దహోద్ వద్ద గుజరాత్‌లో ప్రవేశించింది. రాత్రి దాహోద్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం ఆయన ఝాలోద్ పట్టణ సమీపంలోని కుంబోయి దామ్‌లో గిరిజనులకు ఆరాధ్యుడైన గోవింద్ గురుకు నివాళులర్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పార్టీ మహిళా కార్యకర్తలు అందజేసిన భారీ కేక్‌ను తన ఎస్‌యూవీ పైనుంచే రాహుల్ కట్ చేశారు. గోధ్రాకు వస్తూ శివాలయంలో ఆయన పూజలు చేశారు. గోధ్రా నుంచి సాయంత్రం పావగఢ్‌కు చేరుకుని మా కొడియార్ ఆలయంలో పూజలు చేశారు. పంచ్‌మహల్ జిల్లా జంబుఘోడా గ్రామంలో రాత్రి బస చేశారు.

బీజేపీకి 333 పైమాటే

- టౌమ్స్ నౌ సర్వే వెల్లడి • ఎన్డీయే కూటమికి 378 సీట్లు
- ఇండియా కూటమికి 120, ఇతరులకు 45 స్థానాలు
- కాంగ్రెస్‌కు 28 నుంచి 48 సీట్లకు మించకపోవచ్చు

న్యూఢిల్లీ: ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే బీజేపీ ఘనవిజయం ఖాయమని టైమ్స్ నౌ చానల్–ఈటీజీ సర్వే శుక్రవారం పేర్కొంది. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు గాను ఆ పార్టీ ఒంటరిగా ఏకంగా 333 నుంచి 363 లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకుంటుందని అంచనా వేసింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి 378 స్థానాలదాకా సాధించవచ్చని వివరించింది. విపక్ష ఇండియా కూటమికి కేవలం 120, ఇతరులకు 45 స్థానాలు రావచ్చని పేర్కొంది. ఇండియా కూటమిలోని ప్రధాన పక్షమైన కాంగ్రెస్‌కు 28 నుంచి గరిష్ఠంగా 48 సీట్లొస్తాయని వివరించింది. తమిళనాట డీఎంకేకు 24 నుంచి 28 సీట్లు, ఒడిశాలో బిజూ జనతాదళ్‌కు 10 నుంచి 11 సీట్లు వస్తాయని వెల్లడించింది. 42 లోక్‌సభ స్థానాలున్న పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ సారథ్యంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈసారి 17 నుంచి 21 స్థానాలతో సరిపెట్టుకుంటుందని పేర్కొంది. అక్కడ బీజేపీకి 20 నుంచి 24 సీట్లు రావచ్చని పేర్కొంది. ఏడు సీట్లున్న ఢిల్లీలో ఆప్ 5 నుంచి మొత్తం 7 స్థానాలూ కొల్లగొట్టవచ్చని సర్వే వెల్లడించడం విశేషం.

యూపీలో బీజేపీ క్లీన్‌స్వీప్

అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ క్లీన్‌స్వీప్ ఖాయమని సర్వే పేర్కొంది. రాష్ట్రంలో 80 స్థానాలకు ఎన్డీఏ కూటమికి 72 నుంచి 78 వస్తాయని, కాంగ్రెస్, సమాజ్‌వాదీలతో కూడిన 'ఇండియా' కూటమి 2 నుంచి 6 సీట్లకు పరిమితమవుతుందని తెలిపింది. ఇక బీఎస్పీ కేవలం 1 స్థానంతో సరిపెట్టుకోవాల్సి రావచ్చని అభిప్రాయపడింది. గుజరాత్‌లోనైతే మొత్తం 26 సీట్లనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని పేర్కొంది. బిహార్‌లో 42 సీట్లకు గాను బీజేపీ, జేడీ(యూ)తో కూడిన ఎన్డీఏ కూటమికి 31 నుంచి ఏకంగా 36 స్థానాలు రావచ్చని సర్వే అభిప్రాయపడింది. కాంగ్రెస్, ఆర్జేడీ తదితరులతో కూడిన ఇండియా కూటమి 2 నుంచి 4 సీట్లకు పరిమితమవుతుందని పేర్కొంది. ఇక 48 సీట్లున్న మహారాష్ట్రలో బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్)లతో కూడిన ఎన్డీఏ కూటమికి 34 నుంచి 38, కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్)లతో కూడిన ఇండియా కూటమికి 9 నుంచి 13 స్థానాలు రావచ్చని వివరించింది. కర్ణాటకలో ఎన్డీఏకు 22 నుంచి 24, కాంగ్రెస్‌కు కేవలం 4 నుంచి 6 సీట్లు రావచ్చని పేర్కొంది.

ఎన్డీయేకు 400 సీట్లు.. ఇది ప్రజల గ్యారంటీ

- ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ
- డిజిటల్ కంటెంట్ క్రియేటర్లకు నేషనల్ క్రియేటర్స్ అవార్డుల ప్రదానం



న్యూఢిల్లీ: భారతదేశ ఘనమైన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రపంచానికి చాటాలని డిజిటల్ కంటెంట్ క్రియేటర్లకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశ విశిష్టతను ప్రస్ఫుటంగా తెలియజేసే సమాచారాన్ని రూపొందించాలని సూచించారు. 'క్రియేట్ ఆన్ ఇండియా' ఉద్యమంలో పాలుపంచుకోవాలని కోరారు. ప్రపంచం తెలుసుకోవడం కోసం భారతదేశంపై అద్భుతమైన కథనాలు తయారు చేయాలని పేర్కొన్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా నేషనల్ క్రియేటర్స్ అవార్డులను ప్రధాని మోదీ శుక్రవారం ఢిల్లీలో భారత్ మండపంలో విజేతలకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'అబ్ కీ బార్ 400 పార్' అని జనం బిగ్గరగా నినాదాలు చేయగా, ప్రధానమంత్రి స్పందించారు. ఈసారి కూడా 2014, 2019 లోక్‌సభ ఎన్నికల నాటి ఫలితాలే పునరావృతం అవుతాయని తేల్చిచెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 400 సీట్లు గెలుచుకోవడం తథ్యమని పునరుద్ఘాటించారు. ఇది మోదీ గ్యారంటీ కాదని, 140 కోట్ల మంది ప్రజలు ఇస్తున్న గ్యారంటీ అని స్పష్టం చేశారు. కంటెంట్ సృష్టికర్తలు ఇండియాకు డిజిటల్ అంబాసిడర్లు, 'వోకల్ ఫర్ లోకల్'కు బ్రాండ్ అంబాసిడర్లు అని మోదీ అభివర్ణించారు.

షాజహాన్ షేక్ ఇంట్లో సీబీఐ సోదాలు

కోల్‌కతా: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులపై దాడి కేసులో బహిష్కృత టీఎంసీ నేత షాజహాన్ షేక్ ఇల్లు, ఆఫీసుల్లో సీబీఐ అధికారులు శుక్రవారం సోదాలు జరిపారు. దాడికి సంబంధించిన ఆధారాల కోసం ఉత్తర 24 పరగణాల జిల్లా సందేశ్‌ఖాలిలోని షాజహాన్ షేక్ నివాసం సమీప ప్రాంతాలను కూడా పరిశీలించారు. రేషన్ పంపిణీ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా జనవరి 5వ తేదీన షాజహాన్ షేక్ ఇంట్లో సోదాలకు వెళ్లిన 14 మంది అధికారుల బృందంపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడిలో సీబీకి చెందిన ఆరుగురు, సెంట్రల్ ఫోరెన్సిక్ నిపుణులు ఆరుగురు, ఈడీ అధికారులు ఇద్దరు గాయపడ్డారు. ఘటనతో సంబంధముందన్న ఆరోపణలపై టీఎంసీ నుంచి షాజహాన్ షేక్ సస్పెండయ్యాడు. హైకోర్టు క్లియరెన్స్ ఇవ్వడంతో గురువారం షాజహాన్ షేక్‌ను అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు, సందేశ్‌ఖాలిలోని అతడి నివాసం, కార్యాలయాలకు సీల్ వేశారు.

అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ తమ పార్టీకి సంబంధించిన రూ.210 కోట్ల నిధులను స్తంభింపజేయడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను ట్రిబ్యునల్ కొట్టివేసింది. కిందటి సంవత్సరాలకు సంబంధించి కాంగ్రెస్ సమర్పించిన ఐటీ రిటర్నుల్లో లోపాలు ఉన్నాయంటూ ఐటీ శాఖ ఆ పార్టీకి రూ.210 కోట్ల జరిమానా విధించించిన సంగతి తెలిసిందే. ఈ జరిమానా మొత్తాన్ని చెల్లించాలంటూ కాంగ్రెస్ ఖాతాలున్న బ్యాంకులను ఐటీ శాఖ ఆదేశించింది. వేర్వేరు బ్యాంకుల్లోని తమ ఖాతాల నుంచి తమకు తెలియకుండా రూ.65 కోట్లను ఐటీ శాఖ విత్‌డ్రా చేసుకుందని కాంగ్రెస్ ఆరోపించింది. రూ.205 కోట్లను స్తంభింపజేసిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో తమ బ్యాంకు ఖాతాలపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది.పిటిషన్‌ను కొట్టివేస్తూ ట్రిబ్యునల్ శుక్రవారం తీర్పు వెలువరించింది.

నైజీరియాలో 287 మంది విద్యార్థుల కిడ్నాప్

అబూజా: ఆఫ్రికా దేశం నైజీరియాలో సాయుధ దుండగులు 287 మంది విద్యార్థులను అపహరించుకుపోయారు. కడునా రాష్ట్రం కురిగా పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలను గురువారం ఉదయం దుండగులు చుట్టుముట్టారు. అప్పుడప్పుడే స్కూలుకు చేరుకుంటున్న విద్యార్థులను వారు బలవంతంగా తమ వెంట సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. మొత్తం 287 మంది విద్యార్థులు కనిపించడం లేదని ప్రధానోపాధ్యాయుడు చెప్పారు. ఈ ఘటనకు కారణమంటూ ఇప్పటి వరకు ఎవరూ ప్రకటించుకోలేదని అధికారులు చెప్పారు. సాయుధ ముఠాలు విద్యార్థులను కిడ్నాప్ చేయడం, పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడం నైజీరియాలో 2014 తర్వాత పెరిగిపోయింది. 2014లో బోర్నో రాష్ట్రంలోని చిబోక్ గ్రామంలోని స్కూలు నుంచి 200 మందికి పైగా బాలికలను ఇస్లామిక్ తీవ్రవాదులు ఎత్తుకుపోవడం అంతర్జాతీయంగా కలకలం రేపడం తెలిసిందే.

క్రియాశీల రాజకీయాలకు థెరెసా మే గుడ్‌బై

లండన్: బ్రిటన్ మాజీ ప్రధాన మంత్రి థెరెసా మే(67) క్రియాశీల రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని శుక్రవారం ప్రకటించారు. అయితే, ప్రస్తుత ప్రధాని రిషి సునాక్‌కు తన మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. 2016–2019 కాలంలో బ్రిటన్ ప్రధానిగా ఉన్న థెరెసా మే హౌస్ ఆఫ్ కామన్స్‌లో 27 ఏళ్లపాటు ఎంపీగా కొనసాగారు. అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎంపీగా 1997 నుంచి ఏడు పర్యాయాలు ఆమె ఎన్నికయ్యారు. మార్గరెట్ థాచర్ తర్వాత బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రెండో మహిళ థెరెసా మే 'న్యూ ఐరన్ లేడీ'గా పేరు తెచ్చుకున్నారు. 2016 జూన్‌లో రెఫరెండం నేపథ్యంలో కుదిరిన బ్రెగ్జిట్ ఒప్పందం పార్లమెంట్ తిరస్కరించడంతో ఆమె ప్రధాని పదవి నుంచి వైదొలిగారు.

ఐదోసారీ పెళ్లికి సిద్ధమైన మర్డోక్

కాలిఫోర్నియా: మీడియా రంగ దిగ్గజం రూపర్ట్ మర్డోక్‌కు 92 ఏళ్ల వయస్సులో మళ్లీ పెళ్లి కుదిరింది. రష్యాకు చెందిన మాజీ మాలిక్యులర్ బయాలజిస్ట్ ఎలెనా ఝుకోవా(67)ను త్వరలో ఆయన పెళ్లి చేసుకోనున్నారు. జూన్‌లో వీరిద్దరు ఒక్కటవుతారని, ఇప్పటికే ఆహ్వాన పత్రాలు కూడా పంపారని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. ఆస్ట్రేలియాలో జన్మించిన మర్డోక్‌కు గతేడాది అన్ లెస్లీతో ఎంగేజ్‌మెంట్ అయింది. అనంతరం ఇద్దరూ విడిపోయారు. అప్పటి నుంచి మర్డోక్ ఎలెనాతో డేటింగ్ చేస్తున్నారు. మర్డోక్‌కు ఇది ఆరో ఎంగేజ్‌మెంట్ కాగా, అయిదో పెళ్లి.

సాక్షి హైదరాబాద్

శనివారం, 9, మార్చి, 2024



కీసరలో శివలింగానికి మొక్కుతున్న యువతులు

ఫొటో: నోముల రాజేష్ రెడ్డి

శివోహం





శివ నామస్మరణతో కీసరగుట్ట మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినాన..శుక్రవారం భక్తులు, సాధువులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి. ఆలయ ప్రాంగణలోని శివలింగాలకు భక్తులు అభిషేకాలు చేశారు. స్వామివారి దర్శనం కోసం భారీగా క్యూకట్టారు.



చోరీ ఫోన్లకు రెక్కలు!

బంగ్లాదేశ్‌కు అత్యధికంగా అక్రమ రవాణా

- నదీ మార్గంలో 'డబ్బా స్మగ్లింగ్'
- స్మగ్లర్ల పరోక్షంలోనూ నడుస్తున్న దందా
- సహకరిస్తున్న సరిహద్దు గ్రామాల ప్రజలు
- వ్యవస్థీకృతంగా సాగుతున్న ఈ వ్యవహారం
- అప్రమత్తమైన బీఎస్ఎఫ్, నిఘా వర్గాలు



ఆయిల్ క్యాన్లలో ఫోన్లు నింపిన దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాల ఆధీనంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ఏర్పాటు సహా ఎన్ని చర్యలు తీసుకున్నా దేశవ్యాప్తంగా చోరీ అవుతున్న సెల్‌ఫోన్లలో గరిష్ఠంగా 40 శాతం మాత్రమే రికవరీ అవుతున్నాయి. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా మిగిలిన వాటి ఆచూకీ మాత్రం లభించట్లేదు. దీనిపై లోతుగా ఆరా తీసిన నిఘా వర్గాలు బంగ్లాదేశ్‌లో జరుగుతున్న క్లోనింగ్ కోణాన్ని గుర్తించాయి. నదీ మార్గంలో సాగుతున్న ఈ స్మగ్లింగ్‌పై అప్రమత్తంగా ఉండాలంటూ సరిహద్దు భద్రతా దళాన్ని (బీఎస్ఎఫ్) అప్రమత్తం చేశాయి. ఏటా హైదరాబాద్‌లో చోరీ అవుతున్న ఫోన్లూ పొరుగు దేశానికి అక్రమ రవాణా అవుతునట్లు పోలీసులు గుర్తించారు.

ఎక్కడికక్కడే ముఠాలు...

హైదరాబాద్‌తో పాటు ఇతర మెట్రో నగరాలకు చెందిన పిక్ పాకెటింగ్ గ్యాంగ్‌లు ఒకప్పుడు కేవలం పర్సులను మాత్రమే తస్కరించేవి. ప్లాస్టిక్ కరెన్సీగా పిలిచే క్రెడిట్, డెబిట్ కార్డుల వినియోగం పెరిగిన తరవాత వీరికి పర్సుల్లో ఏమంత పెద్ద మొత్తం లభించట్లేదు. దీంతో పంథా మార్చిన ఈ ముఠాలు సెల్‌ఫోన్లపై పడ్డాయి. ప్రతి నగరంలోనూ ప్రాంతాల వారీగా పని చేసే వ్యవస్థీకృత సెల్‌ఫోన్ స్నాచింగ్, దోపిడీ ముఠాలు అనేకం ఉన్నాయి. వీరి నుంచి ఈ ఫోన్లు తొలుత ఆయా నగరాల్లో ఉన్న కొందరు సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్ వ్యాపారుల వద్దకు చేరుకుంటాయి. ఈ వ్యాపారుల నుంచి చోరీ ఫోన్లు ఖరీదు చేయడానికి ఉత్తరాదిలోని నగరాల్లో కొందరు బడా వ్యాపారులు ముఠాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరి చేతికి వచ్చిన ఫోన్లకు సంబంధించి కవర్లు, స్క్రీన్ గార్డుల్ని మార్చేస్తూ కొత్త లుక్ ఇస్తుంటారు.

అప్పట్లో చైనా, నేపాల్ దేశాలకే ఎక్కువ...

ఉత్తరాదిలోని అనేక ప్రాంతాలకు చెందిన చోరీ మాల్ వ్యాపారులు సిండికేట్‌గా ఉంటూ గతంలో చైనా, నేపాల్‌లకు ఈ సెల్‌ఫోన్లు పంపేవారు. చైనా నుంచి వివిధ రకాలైన వస్తువులు దిగుమతి అవుతుంటాయి. వీటిలో కొన్ని అనేక కారణాల నేపథ్యంలో రిటర్న్ అవుతుంటాయి. వీటితో కలిపి చోరీ సెల్ఫోన్లను చైనాకు పంపేవారు. మరోపక్క నేపాల్ సరిహద్దుల ద్వారా ఆ దేశానికీ పంపేవాళ్లు. ఉత్తరప్రదేశ్‌లోని కృష్ణానగర్, సోనాలి, బీహార్లోని రక్సోల్, పశ్చిమ బెంగాల్‌లోని కాకర్బత్తీ ప్రాంతాల నుంచి ఇవి నేపాల్‌కు చేరేవి. అయితే ఇటీవలి కాలంలో చైనా వాణిజ్యంపై ఆంక్షలు అమలులోకి రావడంతో పాటు నేపాల్ సరిహద్దులపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఈ రెండు మార్గాలు మూసుకుపోయాయి. దీంతో వ్యవస్థీకృతంగా చోరీ సెల్‌ఫోన్లు స్మగ్లింగ్ చేసే ముఠాలు ప్రత్యామ్నాయ మార్గంగా బంగ్లాదేశ్‌ను ఎంచుకున్నాయి.

సహకరిస్తున్న లోకల్ గ్యాంగ్స్...

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్న పద్మా, మహానంద నదుల కేంద్రంగా ఈ సెల్‌ఫోన్‌ల స్మగ్లింగ్ నడుస్తోంది. తొలుత చోరీ సెల్‌ఫోన్లు వివిధ నగరాల నుంచి కోల్‌కతా, మాల్డా, ముర్షీదాబాద్‌లో ఉంటున్న ముఠాలకు ఈ సెల్‌ఫోన్లు చేరుతున్నాయి. ఒక్కో దాంట్లో 40 చొప్పున థర్మకోల్ బాక్సుల్లో జాగ్రత్తగా ప్యాక్ చేసి వివిధ పేర్లతో వీరి వద్దకు చేరుస్తున్నారు. ఆ మూడు ప్రాంతాల నుంచి ఈ ఫోన్లు భారత సరిహద్దుల్లో ఉన్న బోలాహాల్, జలంగి ప్రాంతానికి వెళ్తున్నాయి. ఆయా గ్రామాల్లో ఉన్న వ్యక్తులు ఈ స్మగ్లర్లకు సహకరిస్తూ ఫోన్లను ప్లాస్టిక్ క్యాన్లలో వేసి మూతలు పెట్టి ప్యాక్ చేస్తున్నారు. నీటిలో మునగని విధంగా ప్యాక్ అవుతున్న ఈ డబ్బాలను గ్రామస్తులు మహానంద, పద్మ నదుల్లో పడేస్తున్నారు. ఆ సమయం, సందర్భం తెలిసి ఉండే బంగ్లాదేశ్లోని బోలాహాల్, మోతీహార్, రాజ్షాహీ ప్రాంతాల్లోని ముఠాలు వీటిని రిసీవ్ చేసుకుంటాయి. ఈ దందాలో సమాచార మార్పిడి, సంప్రదింపులు మొత్తం వాట్సాప్ గ్రూపుల ద్వారా జరిగిపోతోంది.

ట్యాంపరింగ్ చేసి ఎవరికీ చిక్కకుండా...

ఆయా గ్రామస్తుల నుంచి చోరీ ఫోన్లు బంగ్లాదేశ్‌లో ఉన్న ముఠాలకు చేరుతున్నాయి. నిఘాకు చిక్కకుండా ఈ ఫోన్ల ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్ (ఐఎంఈఐ) నెంబర్లు ట్యాంపర్ చేస్తున్నాయి. ప్రపంచంలో తయారయ్యే ప్రతి మొబైల్ ఫోన్‌కు ఓ ఐఎంఈఐ నెంబర్ ఉంటుంది. మనిషి వేలిముద్రల మాదిరి ప్రపంచంలోని ఏ రెండు సెల్‌ఫోన్లకు ఒకే నెంబర్ ఉండదు. సదరు ఫోన్లో ఏ నెంబర్ వినియోగిస్తున్నది తెలుసుకోవడానికి ఇది ఉపకరిస్తుంది. దీని ద్వారానే పోలీసులు చోరీ ఫోన్లను గుర్తిస్తారు. బంగ్లాదేశ్‌లోని ముఠాలు ఈ ఐఎంఈఐ నెంబర్ ట్యాంపర్ చేస్తున్నాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విక్రయం..

ఐఎంఈఐ నెంబర్ ట్యాంపరింగ్ ద్వారా బంగ్లాదేశ్‌లో కొత్తగా తయారైన సెల్‌ఫోన్లు కొరియర్ ద్వారా వివిధ దేశాలకు వెళ్తున్నాయి. కొరియర్ ద్వారా 'సక్రమంగానే' రవాణా అయిపోతున్నాయి. అక్కడి సెల్‌ఫోన్ వ్యాపారుల్లో కొందరు ఈ విషయం తెలిసి, మరికొందరు తెలియక వీటిని ఖరీదు చేస్తున్నారు. ఆయా దేశాల్లోని సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్ మార్కెట్ల ద్వారా ఈ ఫోన్లను అమ్మేస్తున్నారు. ప్రధానంగా భారత్ సహా అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఈ ఫోన్లకు భారీ డిమాండ్ ఉంటోంది. ఏటా రూ.వందల కోట్ల మేర సాగుతున్న ఈ వ్యాపారం వెనుక డ్రగ్స్, ఉగ్రవాదం కోణాలు కూడా ఉండవచ్చునని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులపై నిఘా ముమ్మరం చేయాలని, పద్మా, మహానంద నదుల పైనా కన్నేసి ఉంచాలని బీఎస్ఎఫ్ బలగాలను అప్రమత్తం చేశాయి. నదీ మార్గంలో జరుగుతున్న 'డబ్బా స్మగ్లింగ్' కట్టడి కోసం మార్గాలు అన్వేషిస్తున్నాయి.

కండ్లకోయకు నేడు సీఎం

మేడ్చల్ జిల్లా నుంచి కాంగ్రెస్ శంఖారావం

- మహిళలతో రేవంత్‌రెడ్డి ముఖాముఖి, పలు శంకుస్థాపనలు
- అధికార కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు





కండ్లకోయలో మహిళలతో ముఖాముఖికి సిద్ధమవుతున్న వేదిక

సాక్షి, మేడ్చల్ జిల్లా/మేడ్చల్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్‌రెడ్డి మొదటిసారిగా మేడ్చల్ జిల్లాలో శనివారం పర్యటిస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేస్తారు. పొదుపు సంఘాల మహిళలతో ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు. కండ్లకోయ(గుండ్లపోచంపల్లి హనుమాన్ గడ్డ) వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం రేవంత్ ప్రసంగించనున్నారు.

పర్యటన ఇలా.. సాయంత్రం ఐదు గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కండ్లకోయ ఐటీ కారిడార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరుకానున్నారు. 44వ జాతీయ రహదారిపై నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ పనులకు శంకుస్థాపన చేస్తారు. పొదుపు సంఘాల మహిళతో అక్కడే సమావేశమై 20 నిమిషాల పాటు మాట్లాడతారు. సంఘాల నిర్వహణ, లాభ నష్టాలు వంటి అంశాలపై వారితో చర్చిస్తారు. ఈ కార్యక్రమంలో 600 మహిళా సంఘాలు సభ్యులు పాల్గొనేలా అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ పరిశీలించారు.

కాంగ్రెస్ శంఖారావం సభ..

గుండ్లపోచంపల్లి (కండ్లకోయ)హనుమాన్ గడ్డ వద్ద కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల శంఖారావం బహిరంగసభ ఏర్పాటు చేసింది. ఈ సభలో 6 గంటల నుండి 8 గంటల వరకు సీఎం రేవంత్‌రెడ్డి ఉంటారు. అక్కడే ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల చేరికలు, ప్రసంగాలు ఉంటాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

అధికారిక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి...

కండ్లకోయ వద్ద శంకుస్థాపనలకు, ముఖ్యమంత్రి మహిళలతో చర్చలకు కావాల్సిన ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ దగ్గరుండి పూర్తి చేయించారు. మహిళలు కూర్చునేందుకు భారీ వేదిక ఏర్పాటు చేశారు.

సభ విజయవంతంపై నేతల దృష్టి

గుండ్లపోచంపల్లి(కండ్లకోయ) వద్ద బహిరంగసభ విజయవంతంపై శుక్రవారం కాంగ్రెస్ నాయకులు తోటకూరి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. 50 వేల మంది కూర్చొనే విధంగా సభా వేదికను తీర్చిదిద్దారు. సభకు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 50 వేల మంది ప్రజలను తరలించాలని కాంగ్రెస్ పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

సీఎం పర్యటన 3 గంటలే...

సీఎం రేవంత్‌రెడ్డి మేడ్చల్ మండలంలో శుక్రవారం సాయంత్రం 5నుండి రాత్రి 8వరకు పర్యటిస్తారు. దీనికి ముందు ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని నల్లచెరువు వద్ద నిర్మించిన మురుగు నీటి శుద్ధి కేంద్రం(ఎస్‌టీపీ)ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ అధికారులు దానకిశోర్, జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొంటారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గాన ఓఆర్ఆర్ మీదుగా కండ్లకోయకు సాయంత్రం 5 గంటలకు చేరుకుని అక్కడ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరు గంటలకు బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం హైదరాబాద్ నగరానికి రోడ్డు మార్గంలో వెళ్తారు.

బైరామల్‌గూడ రెండో ఫ్లైఓవర్ ప్రారంభం నేడు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీనగర్ పరిధిలోని బైరామల్‌గూడ జంక్షన్ వద్ద రెండో లెవెల్ ఫ్లైఓవర్ శనివారం ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఈ ఫ్లై ఓవర్‌ను పొడవు 1.78 కి.మీ.లు. దీని నిర్మాణానికై న ఖర్చు రూ.140.05 కోట్లు. మూడు లేన్లుగా ఉన్న ఫ్లై ఓవర్‌ను వెడల్పు 12 మీటర్లు. ఈ ఫ్లైఓవర్ వినియోగంతో శంషాబాద్, ఒవైసీ హాస్పిటల్స్ వైపు నుంచి విజయవాడ, నాగార్జున సాగర్‌ల వైపు వెళ్లే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొంటారు.

నాలాల పూడికతీత.. పూర్తయ్యేదెప్పటికి?

ఈ సంవత్సరం రూ.56.38 కోట్ల పనులు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రతియేటా నాలాల్లో పూడికతీత పూర్తి కాకపోవడం..దీనివల్ల వర్షాకాలంలో భారీ వరదల సమయాల్లో కాలనీలు, బస్తీలు నీట మునగడం పరిపాటిగా మారింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకయినా ఈ పరిస్థితి మారుతుందేమో అనుకుంటే..అలాంటి అవకాశాలు కనిపించడం లేదు. నాలాల్లో పూడికతీత పనులు ఇప్పటికే సగం పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా చాలా ప్రాంతాల్లో పనులు ప్రారంభమే కాలేదు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా టెండర్ల ప్రక్రియ సైతం పూర్తికాలేదు. వరదల వల్ల ముంపునకు గురయ్యే ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన నదీం కాలనీ వంటి ప్రాంతాల్లోనూ ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపునే నాలాల్లో పూడికతీత పనులు పూర్తిచేయాలనేది లక్ష్యం. అందుకుగాను వర్షాకాలం ముగియగానే టెండర్లు పిలిచి జనవరి నుంచి పనులు మొదలు పెడితే వేసవిలోగా పూర్తిచేయాలనేది లక్ష్యం. కానీ చాలా ప్రాంతాల్లో టెండర్లు గత నెలాఖరు వరకు కూడా పూర్తి కాలేదు. పూర్తి కావాల్సిన ప్రాంతాలు ఇంకా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి కూడా వర్షాకాలంలోగా, వేసవిలోనే పూడికతీత పనులు పూర్తయ్యే అవకాశాలు కనపడటం లేదు. జనవరిలో పనులు ప్రారంభిస్తేనే పనులు మొత్తం పూర్తయ్యేందుకు నాలుగైదు నెలలు అవసరమవుతుంది. కానీ ఇటీవలి వరకు టెండర్లే పూర్తికాకపోవడంతో పనులు మొదలు కావడానికే సమయం పట్టనుంది. వేసవి లోపు అవి పూర్తయ్యే అవకాశాలు మృగ్యమే.

రూ.56.38 కోట్లతో పనులు

గత సంవత్సరం 63 పనులు చేసేందుకు రూ.53.60 కోట్ల మేర పనులు చేపట్టినా ఎన్ని పూర్తయ్యాయో తెలియదు. ఈ సంవత్సరం ఏకంగా 201 పనులు చేసేందుకు రూ.56.38 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. వీటిల్లో ఎన్నింటికి టెండర్లు పూర్తయ్యాయో, ఎన్నింటికి అసలు టెండర్లు రాలేదో తెలియదు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు..

జీహెచ్ఎంసీలో నిధుల లేమితో పనులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యమవుతోంది. దీంతో కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. నాలాల్లో పూడికతీత పనులు చేసే కాంట్రాక్టర్లు కొందరే ఉన్నారు. సకాలంలో బిల్లులు అందడం లేదని కాంట్రాక్టర్లు వెనకడుగు వేయడం టెండర్లు పూర్తికాకపోవడానికి ప్రధాన కారణం. గతంలో పూడికతీ పనుల్లో జరిగిన అక్రమాలతో పోలీసు కేసులు నమోదు కావడం వల్ల కూడా ఈ పనులంటే వెనుకాడుతున్నారు. గత సంవత్సరం సైతం పూడికను డంపింగ్ యార్డు వరకు తరలించనందున బిల్లులు నిలిపివేసిన ఘటనలున్నాయి. ఇలా వివిధ కారణాలతో ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. వారిని ఒప్పించేందుకు అధికారులు తిప్పలు పడాల్సి వస్తోంది. టెండర్లు పూర్తయినా పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఉంది.



ఎన్నాళ్లో వేచిన ఉదయం

పాతబస్తీ వాసుల మెట్రో రైలు కల నెరవేరబోతోంది. ఈ రూట్లో మెట్రో రైలు నిర్మాణ పనులకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ఫలక్‌నుమాలోని ఫారూక్‌నగర్ వద్ద శంకుస్థాపన చేశారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మైనార్టీ శాఖ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, మజ్లిస్ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.

90 రోజులు.. 10 కోట్ల మంది మహిళలు

'మహాలక్ష్మి పథకం' అమలులో గ్రేటర్ ఆర్టీసీ టాప్‌గేర్

- రోజుకు 10 లక్షల మందికి పైగా మహిళా ప్రయాణికులు
- వంద శాతం ఆక్యుపెన్సీతో పరుగులు తీస్తున్న సిటీ బస్సులు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో మహాలక్ష్మి పథకం టాప్ గేర్‌లో పరుగులు తీస్తోంది. సిటీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 10 కోట్ల మందికి పైగా మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవడం విశేషం. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గతేడాది డిసెంబర్ 9వ తేదీన మహాలక్ష్మి ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. మహాలక్ష్మి పథకం అమలుకు ముందు ప్రయాణికులు లేక సిటీ బస్సులు వెలవెలపోయాయి. ఈ పథకం అమల్లోకి వచ్చిన మొదటి రోజు నుంచే నగరంలోని అన్ని రూట్‌లలో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరిగింది.

గతంలో 4 లక్షల మందే..

ప్రతి రోజు సుమారు 10 లక్షల మందికి పైగా మహిళలు సిటీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. గతంలో కేవలం 4 లక్షల మంది సిటీ బస్సుల సేవలను వినియోగించుకొనేవారు. వారిలో విద్యార్థినులే ఎక్కువ. ఆ తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనే మహిళలు ఎక్కువగా ఉండేవారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల మహిళలకు సిటీ బస్సు చేరువైంది. మెట్రో లగ్జరీ వంటి బస్సుల్లో ప్రయాణం చేసే మహిళలు సైతం ఉచిత ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల వైపు మళ్లారు. దీంతో ఈ రెండు కేటగిరీలకు చెందిన బస్సుల్లో ఒక్కసారిగా ఆక్యుపెన్సీ వంద శాతం దాటింది. సాధారణంగా ఉదయం, సాయంత్రం మాత్రమే కనిపించే ప్రయాణికుల రద్దీ కొంతకాలంగా అన్ని వేళల్లోనూ ఉంది. 'ఆటోలు, క్యాబ్‌లు వంటి వాహనాలను వినియోగించే మహిళలు కూడా సిటీ బస్సుల్లోకి మారారు. ఇప్పుడు బస్సుల సంఖ్య పెరిగితే తప్ప ప్రయాణికుల డిమాండ్‌ను చేరుకోలేని పరిస్థితి నెలకొంది' అని ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు. ప్రతి రోజు 10 లక్షల మంది ప్రయాణికుల చొప్పున మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు 90 రోజుల్లో సుమారు 10 కోట్ల మందికి పైగా మహిళలు ప్రయాణం చేసినట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో గతంలో రోజుకు సుమారు 15 లక్షలు మాత్రమే ఉన్న ప్రయాణికుల సంఖ్య ఇప్పుడు 25 లక్షలు దాటింది. అందులో 10 లక్షల మంది మహిళలే కావడం గమనార్హం. ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరగడంతో సిటీ బస్సుల్లో సీట్ల కొరత పెద్దసవాల్‌గా మారింది. మహిళల కోసం కేటాయించిన సీట్లతో పాటు, ఇతర సీట్లను కూడా మహిళలే ఆక్రమించుకోవడంతో పురుషులు, వయోధికులకు 'స్టాండింగ్ జర్నీ' భారంగా మారింది. మరోవైపు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పురుషుల కోసం ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ సన్నాహాలు చేసింది. ఒకటి, రెండు రూట్లలో నాలుగైదు ట్రిప్పులు ప్రయోగాత్మకంగా నడిపారు. కానీ అంతగా స్పందన లేకపోవడంతో 'జెంట్స్ స్పెషల్' బస్సుల ప్రతిపాదనను విరమించుకొన్నారు.

అరకొర బస్సులే...

గతంలో రోజుకు రూ.కోటి నష్టంతో నడిచిన బస్సులు ఇప్పుడు లాభాల బాట పట్టాయి. మహిళా ప్రయాణికుల చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తున్న దృష్ట్యా నష్టాలను అధిగమించేందుకు ఆర్టీసీకి అవకాశం లభించింది. కానీ ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. హైదరాబాద్ మహానగరం విస్తరణకు అనుగుణంగా సిటీ బస్సుల సేవలు విస్తరించుకోవడం లేదు. ట్రిప్పుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాధారణంగా నగర శివార్ల నుంచే వివిధ రకాల పనులపైన మహిళలు, అన్ని వర్గాల ప్రయాణికులు నగరంలోకి రాకపోకలు సాగిస్తారు. కానీ నగర శివార్ల నుంచి తగినన్ని బస్సులు అందుబాటులో లేవు. సుమారు 2500 బస్సులు మాత్రమే సిటీలో తిరుగుతున్నాయి. మెట్రోలగ్జరీ, మెట్రో డీలక్స్ వంటి బస్సులను మినహాయిస్తే కనీసం 2000 బస్సులు కూడా అందుబాటులో లేవు. మరోవైపు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకుంటున్న మహిళల్లో 70 శాతం మంది నగర శివార్ల నుంచే ప్రయాణం చేస్తున్నారు. బెంగళూర్ వంటి మెట్రో నగరాల్లో 6 వేలకు పైగా సిటీ బస్సులు నడుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిని విస్తరించేందుకు ప్రభుత్వం తాజాగా ప్రతిపాదనలు చేసింది. ఈ క్రమంలో గ్రేటర్ ఆర్టీసీ కూడా కనీసం రెండు రెట్లు విస్తరించవలసి ఉంది.

ఇద్దరు దొంగలు ఎస్కేప్?

ప్రభుత్వ కార్యాలయాల్లో వరుస నేరాలు

- అదుపులోకి తీసుకున్న శివారు పోలీసులు
- రికవరీ కోసం నగరంలోని ఓ ప్రాంతానికి తరలింపు
- అదును చూసుకుని పారిపోయిన ద్వయం



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ కార్యాలయాల్లో వరుస నేరాలు చేసి ఇద్దరు దొంగలు పోలీసులకు చిక్కినట్లే చిక్కి ఎస్కేప్ అయ్యారు. వీరిని పట్టుకున్న స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక విభాగాలకు చెందిన బృందాలు సైతం రంగంలోకి దిగి గాలిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం... నగర శివార్లలో ఉన్న ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఈ ఏడాది జనవరిలో చోరీ యత్నం చోటు చేసుకుంది. ఈ కేసు కొలిక్కిరాకుండానే గత నెల మరో కార్యాలయంలో చోరీ జరిగింది. దీంతో ఈ వ్యవహారాలను సీరియస్‌గా తీసుకున్న స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపాయి. రెండో నేరం చోటు చేసుకున్న కార్యాలయంలో సీసీ కెమెరాలు సైతం సరిగ్గా పని చేయకపోవడంతో ఆధారాల సేకరణ కష్టసాధ్యమైంది. ఈ కార్యాలయానికి సమీపంలో, చుట్టుపక్కల మార్గాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్ పరిశీలించిన అధికారులు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. వీటితో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లిన అధికారులు చోరీ కేసుకు సంబంధించి కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. దీంతో ఈ నేరానికి ఒడిగట్టిన వాళ్లు చిక్కారు. పోలీసుల విచారణలో చోరీ సొత్తులో కొంత నగరంలోని గోషామహల్ ప్రాంతంలో విక్రయించినట్లు వీళ్లు బయటపెట్టారు. దీంతో ఇద్దరు నిందితులను తీసుకుని స్థానిక పోలీసులు మంగళవారం గోషామహల్‌కు వచ్చారు. తాము చోరీ సొత్తు విక్రయించిన దుకాణం చూపిస్తున్నట్లు నటించిన ఇద్దరు నిందితులు పోలీసు కళ్లుగప్పి ఎస్కేప్ అయ్యారు. వీరిని పట్టుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పోలీసు సిబ్బంది ఈ విషయాన్ని ఠాణా అధికారులకు తెలిపారు. ఆ నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు రికార్డుల్లోకి ఎక్కడపోవడంతో విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అదే జరిగితే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని భావించారు. ఆ డివిజన్, జోన్‌లతో పాటు కమిషనరేట్‌కు చెందిన ఉన్నతాధికారులకు మాత్రం ఠాణా సిబ్బంది ఈ ఎస్కేప్‌పై సమాచారం ఇచ్చారు. ఆ అధికారుల ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ప్రత్యేక విభాగం అధికారులు సైతం ఈ నిందితుల కోసం మూడు రోజులుగా ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఉస్మానియా ఆసుపత్రిలో సీఎంఓ అధికారుల పర్యటన


ఉస్మానియా ఆసుపత్రిని పరిశీలిస్తున్న సీఎంఓ అధికారులు ఆమ్రపాలి, దానకిశోర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆసుపత్రిని శుక్రవారం ముఖ్యమంత్రి కార్యాలయ ప్రతినిధులు సందర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.త్రివేణి, ఆర్ఎంఓ-1 డాక్టర్ శేషాద్రిల తో కలిసి ఉస్మానియా ఆసుపత్రిలోని పాతభవనం, కులీకుతుబ్ షాహి భవనం తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆసుపత్రి నూతన భవనానికి సంబంధించి సమస్యలు, పరిష్కారాలపై డాక్టర్ నాగేందర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేందర్ కోర్టు, తదితర సమస్యలపై వారికి వివరించారు. ఆసుపత్రికి కొత్త భవనం ఆవశ్యకత, రోగుల అవసరాలు , అధునాతన చికిత్స అవసరాల నిమిత్తం ప్రభుత్వం అందించే సహాయం తదితర అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

రామంతాపూర్ ఎస్‌బీఐలో భారీ కుంభకోణం

- బ్యాంక్ మేనేజరే సూత్రధారి
- రూ.2.84 కోట్లు కొల్లగొట్టిన వైనం

ఉప్పల్: కంచే చేను మేసిన చందంగా ఓ బ్యాంక్ మేనేజర్ అక్రమార్కులతో చేతులు కలిపి బ్యాంకు సొమ్ము కాజేశాడు. రామంతాపూర్ ఎస్‌బీఐలో చోటు చేసుకున్న భారీ కుంభకోణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామంతాపూర్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో మేనేజర్‌గా పని చేసిన భగీరథ గంగా మల్లయ్య, నల్లగొండ జిల్లా సూర్యాపేట ప్రాంతానికి చెందిన షేక్ సైదులు మలక్ పేటలో నివాసముంటున్నారు. సైదులు ఇదే బ్యాంక్ సీజీజీ బ్రాంచ్ గతేడాది జూలై వరకు పని చేశాడు. వీరిద్దరు కలిసి దాదాపుగా 19 మంది పేరుతో రుణాలు మంజూరు చేసి రూ.2,84,80,000 దారి మళ్లించారు. ఈ బ్యాంక్‌లో రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను వీరు సేకరించే వారు. అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలు చూపి, అవసరమైన అదనపు పత్రాలు లేవంటూ రుణ దరఖాస్తును తిరస్కరించే వారు. ఆపై అదే అప్లికేషన్ ఆధారంగా, దరఖాస్తు దారుడి పేరు, వివరాలతో నకిలీ పత్రాలు సృష్టించే వారు. వీటి ఆధారంగా వారి పేర్లతో మరోసారి రుణం కోసం ఈ ద్వయమే దరఖాస్తు చేసేది. దీనికి రుణం మంజూరు చేసినట్లు బ్యాంకు రికార్డుల్లో పొందుపరిచారు. ఒక్కో దరఖాస్తుదారుడి పేరుతో కనిష్టంగా రూ.15 లక్షలు కాజేశారు. ఈ మొత్తాన్ని షేక్ సైదులు భార్య షేక్ సుష్మ, షేక్ పీరయ్యల పేరిట ఉన్న ఖాతాల్లోకి మళ్లించారు. లూసియస్ ప్రైవేట్ లిమిటెడ్, 5 పైసా క్యాపిటల్ లిమిటెడ్ సంస్థల్లో ఈ మొత్తాన్ని పెట్టుబడులుగా పెట్టారు. లోన్ కోసం దరఖాస్తు చేసిన అసలు వ్యక్తులు తమకు రుణం మంజూరు కావడానికి అవసరమైన అదనపు పత్రాలతో మరోసారి బ్యాంకును సంప్రదించారు. దీంతో అప్పటికే వారి పేరుతో రుణం ఉన్నట్లు, నెలవారీ చెల్లింపులు కూడా లేకపోవడంతో డిఫాల్టర్లుగా మారినట్లు తెలిసింది. ఇలా అసలు విషయం తెలుసుకున్న బాధితులు బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న బ్యాంక్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బ్యాంక్ మేనేజర్ భగీరథ గంగా మల్లయ్యను సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో వచ్చిన బేలగంటి వీర వసంత ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ స్కామ్‌లో నిందితులుగా ఉన్న వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

శాశ్వత నమోదుకు ఆమోదమెప్పుడు?

షోరూమ్‌లలోనే వాహనాల రిజిస్ట్రేషన్ ఏమైనట్లు...
- 2016లోనే సిద్ధం చేసిన ఆర్టీఏ
- సాంకేతిక పరిజ్ఞానం కూడా అభివృద్ధి
- అప్పటి నుంచి ఇప్పటి వరకు పెండింగ్
- ఏపీలో విజయవంతంగా అమలవుతున్న షోరూమ్ రిజిస్ట్రేషన్‌లు

సాక్షి, సిటీబ్యూరో: షోరూమ్‌లలోనే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ చేయాలనే ప్రతిపాదన పెండింగ్ జాబితాలో పడిపోయింది. కొనుగోలు చేసిన చోటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్‌తో సహా వాహనాన్ని కొనుగోలుదారుడికి అప్పగించాలని 8 ఏళ్ల క్రితం ప్రతిపాదించారు. ఈ మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం రూపొందించారు. మరి కొద్ది రోజుల్లో అమల్లోకి రావాల్సిన ఈ సదుపాయాన్ని అప్పట్లో అకస్మాత్తుగా నిలిపివేశారు. ఇదే సమయంలో ఏపీలో ఇది విజయవంతంగా అమలు కావడం విశేషం. అక్కడ వాహనం కొనుగోలు చేసిన వ్యక్తికి శాశ్వత రిజిస్ట్రేషన్ పత్రాలు (ఆర్సీ)తో పాటు , వాహనాన్ని నంబర్ ప్లేట్‌ను కూడా ఏర్పాటు చేసి ఇస్తారు. దీంతో వాహనదారుడు బండి రిజిస్ట్రేషన్ కోసం మరోసారి ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఏపీతో పాటు పలు ఇతర రాష్ట్రాల్లోనూ షోరూమ్ రిజిస్ట్రేషన్లు విజయవంతంగా అమలు జరుగుతుండగా, ఇక్కడ మాత్రం ఈ ప్రతిపాదనను అటకెక్కించడం గమనార్హం. వాహనదారులకు ఎంతో ఊరటనిచ్చే ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు అప్పట్లో రవాణా కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సందీప్‌కుమార్ సుల్తానియా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కమిషనర్ కార్యాలయం నుంచి షోరూమ్ లలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగించే విధంగా సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేశారు. కానీ ఆయన రూపొందించిన ప్రణాళికలకు అప్పట్లో ఒకరిద్దరు వ్యక్తులు మోకాలడ్డంతో అమల్లోకి రాకుండా నిలిచి పోయింది. దీంతో వాహనదారులు తమ వాహనాలను నమోదు చేసుకునేందుకు ఆర్టీఏ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

కొత్త వాహనాల నమోదులో జాప్యం...

ప్రస్తుతం వాహనం కొనుగోలు చేసిన వెంటనే షోరూమ్‌లలో తాత్కాలిక రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తారు. సుమారు 6 నెలల పాటు ఈ పత్రాలకు చెల్లుబాటు ఉంటుంది. వాహనదారుడు ఈ గడువులోపు సమీపంలోని ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి శాశ్వత రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం షోరూమ్‌లలోనే ఫీజు చెల్లించాలి. రిజిస్ట్రేషన్‌ల కోసం మాత్రం ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అంటే కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేయవలసి వస్తుంది.గడువులోపు రిజిస్ట్రేషన్ చేసుకోలేని వాహనాలకు కొంత జరిమానాతో రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు అవకాశం ఉంది. కానీ చాలా మంది ఇలా ఒకటికి, రెండు సార్లు రిజిస్ట్రేషన్‌ల కోసం తిరగలేక వాయిదా వేసుకుంటున్నారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్‌లపైనే ఏళ్లతరబడి తిరుగుతున్నాయి. మోటారు వాహన చట్టాలకు ఇది విరుద్ధమే కాకుండా, రహదారి భద్రతకు కూడా ఇలాంటి వాహనాలు ముప్పుగా మారుతున్నాయి. తాత్కాలిక రిజిస్ట్రేషన్‌లపైన తిరుగుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదాలకు పాల్పడే వాహనాలను గుర్తించడం కష్టంగా మారుతోంది. మరోవైపు ఏళ్ల తరబడి వాహనాలను నమోదు చేయకపోవడం వల్ల ఏ బండి ఎవరి పేరిట ఉందో తెలుసుకోవడం కష్టం. పైగా కొందరు వాహనదారులు శాశ్వత రిజిస్ట్రేషన్‌లు చేసుకోకుండానే ఒకరి నుంచి మరొకరికి విక్రయిస్తున్నారు. ఇలాంటి వాహనాలను నమోదు చేయడం ఆర్టీఏ అధికారులకు సైతం కష్టమవుతోంది. ఈ క్రమంలో షోరూమ్ రిజిస్ట్రేషన్‌లను అన్ని సమస్యలకు పరిష్కారంగా భావించారు. కానీ 2016లో చేసిన ఈ ప్రతిపాదనలు ఇప్పటికీ అమలుకు నోచుకో లేదు. నిబంధనల ఉల్లంఘనలో కార్లు, ఇతర మోటారు వాహనాల కంటే ద్విచక్ర వాహనాలే ఎక్కువగా ఉన్నాయి.

ఏజెంట్‌లకు వరంగా మారుతున్న వైనం...

గ్రేటర్ హైదరాబాద్‌లోని పది ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో ప్రతి రోజు సుమారు 2000 కొత్త వాహనాలు నమోదవుతాయి. వాహనాల కొనుగోలు సమయంలోనే శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం కూడా ఫీజు చెల్లించినప్పటికీ శాశ్వత రిజిస్ట్రేషన్‌ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకుని వాహనం తనిఖీ కోసం ఆర్టీఏ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. నిజానికి కొత్త వాహనంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయవలసిందేమీ ఉండదు. బండి ఇంజిన్ నెంబర్, చాసిస్ నెంబర్ నమోదు చేస్తారు. కానీ స్లాట్ నమోదు చేయడం నుంచి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీల వరకు వాహనదారులు ఆర్టీఏ ఏజెంట్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాహనాల రిజిస్ట్రేషన్‌ల రూపంలో పెద్ద మొత్తంలో ఏజెంట్‌లకు ముట్టజెప్పవలసి వస్తుంది. అంటే నిబంధనల మేరకు ఫీజులు చెల్లించినప్పటికీ కేవలం ఎంవీఐల తనిఖీల కోసమే సమర్పించుకోవలసి రావడం గమనార్హం. దీంతో ఆర్టీఏ ఆన్‌లైన్ సేవల్లో పారదర్శకత లోపిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పర్మనెంట్ చేయండి సారూ..

మంత్రికి నిమ్స్ డయాలసిస్ టెక్నీషియన్స్ వినతి

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న 49 మంది డయాలసిస్ టెక్నీషియన్లు శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. 2016 నుంచి పని చేస్తున్న తమను పర్మనెంట్ చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. డయాలసిస్ విభాగంలో తాము డిగ్రీలు, పీజీలు, డిప్లమోలు చేశామని, అయినా తమను ఇప్పటికీ టెక్నీషియన్ ఆన్ కాంట్రాక్ట్‌గానే గుర్తిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికీ తమకు నెలకు రూ.32,500 జీతం వస్తోందని, ఇప్పటి వరు ఎలాంటి ఇంక్రిమెంట్స్ లేవని మంత్రికి విన్నవించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


హేమంత్ (ఫైల్)

పోచారం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బి.రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన అడెప్పు హేమంత్(24) కూరగాయల వ్యాపారి. కూరగాయలు అమ్మి గురువారం రాత్రి ఇంటికి వచ్చి అప్పులైనట్లు భార్య శృతితో చెప్పి నిద్రకు ఉపక్రమించాడు. శుక్రవారం ఉదయం మార్కెట్‌కు బయలుదేరిన హేమంత్ ఐదు నిమిషాల్లోనే ఇంటికి తిరిగి వచ్చి గదిలోకెళ్లి గొళ్లెం పెట్టుకున్నాడు. తలుపు తెరిచేందుకు శృతి విఫలయత్నం చేసి ఇతరుల సాయంతో తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా హేమంత్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు అతడిని ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే హేమంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు 4 నెలల కొడుకు నాని ఉన్నాడు. భువనగిరిలోని శివాజీనగర్ వీరి స్వస్థలమని తెలిసింది.

హైదరాబాద్ టూ గుజరాత్

- రేషన్ బియ్యం అక్రమ రవాణా
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- 31.7 టన్నుల బియ్యం స్వాధీనం



నాగోలు: నగరం నుంచి గుజరాత్‌కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ వారి నుంచి 31.7 టన్నుల రేషన్ బియ్యం, లారీ, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి చెందిన సంజీవరెడ్డి లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కర్ణాటక బీదర్‌కు చెందిన పరమేశ్వర్ సంజీవ రెడ్డికి అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇద్దరు కలిసి శుక్రవారం మలక్‌పేట్ తదితర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి లారీలో గుజరాత్‌కు తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ఎల్బీనగర్ పోలీసులు లారీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గుజరాత్ కు చెందిన హంస్ సరమణ్ భూపత్ ఆదేశాల మేరకు నగరానికి చెందిన రిజ్వాన్ వద్ద తక్కువ ధర బియ్యం కొనుగోలు చేసి గుజరాత్ కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కాచిగూడ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. తన భర్త మృతికి రెండో భార్య ఆమె కుటుంబ సభ్యులే కారణమంటూ మొదటి భార్య కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై రవికుమార్ కథనం మేరకు.. కాచిగూడకు చెందిన దీపా జైస్వాల్ న్యాయవాదిగా పని చేస్తోంది. శాలివాహన నగర్‌కు చెదిన సంజయ్ బాబు జైస్వాల్ (50) ఆమెకు వివాహం జరిగింది. అయితే కుటుంబ కలహాల కారణంగా దీపా జైస్వాల్ పుట్టింటికి వచ్చేసింది. అయితే సంజయ్ బాబు మరొక మహిళతో కలిసి రామోజీ ఫిలిం సిటీ సమీపంలోని దేశ్‌ముఖ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం అతను గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని కాచిగూడకు తీసుకువచ్చారు. భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ దీప జైస్వాల్ కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

స్పెషల్ డ్రైవ్ అంతంతే..

- నామమాత్రంగా ధరణి దరఖాస్తుల పరిష్కారం
- ఇప్పటి వరకు 3,622 మాత్రమే క్లియర్
- ఆశించిన స్థాయిలో ముందుకు సాగని ప్రక్రియ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ నెల 1 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్ జిల్లాలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. మండలాల వారీగా తహసీల్దార్, డిప్యూటీ తహసిల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. మెజార్టీ దరఖాస్తులు నిషేధిత జాబితా, కోర్టు కేసులకు సంబంధించినవే కావడంతో అధికారులు వాటిని ముట్టుకునేందుకు సాహసించడం లేదు. దీంతో ఆయా దరఖాస్తులన్నీ పరిష్కారానికి నోచుకోలేక పోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ధరణి పోర్టల్‌లో మొత్తం 39,076 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 3,622 మాత్రమే క్లియర్ చేశారు. మరో 35,454 దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు శనివారంతో ముగియనుంది. జిల్లా రెవెన్యూ అధికారులు వారం రోజులుగా ఇదే పనిగా దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. రికార్డుల్లోని భూములకు.. క్షేత్రస్థాయిలోని పరిస్థితులకు భిన్నంగా ఉండటంతో వీటిని ముట్టుకునేందుకు వెనుకాడుతున్నట్లు తెలిసింది. ఇక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 9,419 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 676 మాత్రమే పరిష్కరించారు. వికారాబాద్ జిల్లాలో 14,501 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 4,324 దరఖాస్తులు పరిష్కరించారు. మెజార్టీ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

గొంతు పిసికి..లుంగీతో ఉరివేసి

- తండ్రిని చంపిన తనయుడు
- నిందితుడి అరెస్ట్
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

వనస్థలిపురం: తాగివచ్చి తిడుతున్నాడని, అతడి పేరున ఉన్న భూమిని తన పేరున రిజిస్టర్ చేయడం లేదని కోపం పెంచుకుని తండ్రిని హత్య చేసిన కేసులో నిందితుడిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో రుద్రపల్లి మైసయ్య (67) అనే వ్యక్తి లాండ్రీ షాపు నిర్వహించేవాడు. ఫిబ్రవరి 15న అతను ఉరివేసుకుని చనిపోయాడని ఆయన కుమారుడు శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా పోస్టుమార్టం రిపోర్ట్‌లో మైసయ్య ఉరి వేసుకుని చనిపోలేదని, చంపి ఉరి వేసినట్లు తేలడంతో పోలీసులు శేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. తన తండ్రి రోజు తాగి వచ్చి కాలనీలో న్యూసెన్స్ చేస్తూ, తనను బూతులు తిట్టేవాడని, అలాగే తమ స్వగ్రామం మాదాపురంలో ఉన్న భూమిని ఇతరులకు తక్కువ ధరకు అమ్మాడని, అది లావణి పట్టా కావడంతో కొన్నవారి పేరున రిజిస్ట్రేషన్ కాలేదని, వారు కోర్టులో కేసు వేసి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తన తండ్రిని హత్య చేస్తే సదరు భూమి తన పరమవుతుందనే ఆలోచనతో అతడి గొంతు పిసికి హత్య చేసినట్లు తెలిపాడు. అనంతరం లుంగీతో ఉరి వేసినట్లు వెల్లడించాడు. శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రజాభవన్ పోలీస్ ఔట్ పోస్ట్ అద్దాలు ధ్వంసం

పంజగుట్ట: మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ఎదుట ఉన్న పోలీస్ ఔట్ పోస్ట్‌లో ఓ స్క్రాప్ ఎత్తుకెళ్లేందుకు వచ్చిన ఓ వ్యక్తి ఔట్ పోస్ట్ అద్దాలు ధ్వంసం చేసిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది అతడిని పట్టుకుని పంజగుట్ట పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. లైఫ్ స్టైల్ బిల్డింగ్ వద్ద ఫుత్‌పాత్‌పై ఉండే మధు గురువారం రాత్రి ప్రజాభవన్ గేటు ముందు ఉన్న పోలీస్ ఔట్‌పోస్టు వద్దకు వచ్చాడు. ఔట్‌పోస్టు వద్ద ఉన్న రేకులు, ఇతర స్క్రాప్ ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అవి బయటకు తీసే క్రమంలో ఔట్ పోస్ట్ అద్దాలకు తాకి అద్దాలు పగిలిపోయాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు మధును అదుపులోకి తీసుకున్నారు. సమీపంలోనే ఒక ఆటోడ్రైవర్ కూడా ఉండడం గమనించి అతన్ని కూడా పోలీసులకు అప్పగించగా ఆటోడ్రైవర్ పాత్ర ఏమీ లేదని పోలీసులు తెలిపారు. నిందితుడిపై మధుపై గతంలోనూ స్క్రాప్ చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


పోలీస్ ఔట్‌పోస్టు అద్దాలు ధ్వంసమైన దృశ్యం ..

రాష్ట్రపతి నిలయంలో మహిళా దినోత్సవ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న నిఖత్ జహాన్


ర్యాంప్ వాక్ చేస్తున్న మహిళలు

రసూల్‌పురా: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సాంప్రదాయ దుస్తుల్లో ర్యాంప్ వాక్, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మిలిటరీ హాస్పిటల్ కమాండెంట్ డాక్టర్ నిఖత్ జహాన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో బహుముఖ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. క్రమశిక్షణ, పెద్దలను గౌరవిండం యువత బాధ్యత అన్నారు. 1టీ బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు, ఫ్యాషన్ టెక్నాలజీ విద్యాసంస్థల విద్యార్థులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, అల్వాల్ అంగన్‌వాడీ కేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్‌లో భారీ లాభాలంటూ..

రూ. 89.35 లక్షలు టోకరా

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్‌లో ఐపీఓలలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు సంపాదించవచ్చునని నమ్మించి ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు భారీగా టోకరా వేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన వ్యక్తికి వాట్సాప్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు పంపిన ప్రకటనలకు ఆకర్శితుడైన అతను వారు పంపిన లింక్ ఓపెన్ చేసి రిజిస్టర్ అయ్యాడు. అందులో స్టాక్ మార్కెట్ టిప్స్‌తో పాటు ప్రారంభ ఐపీఓలలో పెట్టుబడులు పెట్టాలని నమ్మించారు. పథకం ప్రకారం బాధితుడి పేరుతో ఆన్‌లైన్‌లో నకిలీ ట్రేడింగ్ అకౌంట్‌ను ఓపెన్ చేసిన వారు మొదట కొంత పెట్టుబడి పెట్టించి అధిక లాభాలు చూపించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు విడతల వారీగా మొత్తం రూ. 89,35,100 పెట్టుబడి పెట్టాడు. ఇటీవల డబ్బు అవసరం కావడంతో విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. దీంతో వారిని సంప్రదించగా సెక్యూరిటీ డిపాజిట్, వివిధ ట్యాక్స్‌ల పేరుతో మరింత డబ్బులు డిపాజిట్ చేయాలన్నారు. దీంతో వారిని నిలదీయగా తాము సృష్టించిన వాట్సాప్ గ్రూపును రద్దు చేసి, బాధితుడి పేరుతో ఉన్న నకిలీ ట్రేడింగ్ అకౌంట్‌ను బ్లాక్ చేశారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి..

ఆన్‌లైన్ సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. ప్రధానంగా ట్రేడింగ్‌లో అధిక లాభాలకు ఆశపడి కొందరు బాధితులు రూ. లక్షలు పోగొట్టుకుంటున్నారని, ఈ తరహా మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బాధితులు వెంటనే 1930ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని ఏసీపీ సూచించారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ బాధితురాలికి అప్పగింత


ప్రియాంకకు ల్యాప్‌టాప్ అందిస్తున్న డీఐ భూపాల్‌గౌడ్

రహమత్‌నగర్: పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను కొద్ది గంటల్లోనే గుర్తించి బాధితురాలికి అప్పగించారు. బోరబండ పోలీసులు. డీఐ భూపాల్‌గౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చెంగిచర్లకు చెందిన ప్రియాంక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. గురువారం ఆమె వినాయకనగర్‌లో ఉంటున్న తన తల్లిని కలిసేందుకు ఆటోలో వచ్చిన ఆమె మోతీనగర్ వద్ద ఆటో దిగింది. హడావిడిలో తన ల్యాప్‌టాప్ ఆటోలోనే మరిచి పోయింది. దీనిపై బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన డీఐ సిబ్బందితో కలిసి మోతీనగర్ పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా సదరు ఆటో మహేష్‌నాయక్ చెందినదిగా గుర్తించారు. తుక్కుగూడలో ఉన్న అతడిని పిలిపించి ప్రియాంకకు ల్యాబ్ టాప్‌ను అప్పగించారు. తక్షణమే స్పందించిన డీఐ భూపాల్ గౌడ్, హెచ్‌పీ కృష్ణ, కానిస్టేబుల్ రవిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

శివ శివ.. హరహర..

- అంగరంగ వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- శివన్నామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- ప్రత్యేక పూజలు, అభిషేకాల నిర్వహణ
- రాత్రంతా జాగరణతో వెల్లువెత్తిన భక్తిభావం


శ్రీనగర్‌కాలనీ శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో...

బంజారాహిల్స్: మహా శివరాత్రి పర్వదినాన్ని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు శివాలయాల్లో శివ శివా... హర హరా.. అంటూ భక్తులు శివనామ స్మరణతో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. పాలు, తేనె, చెక్కెర, పండ్ల రసాలతో శివలింగాలకు విశేష అభిషేకాలు నిర్వహించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద్, శ్రీనగర్‌కాలనీ, చింతల్‌బస్తీ, పంజగుట్ట ప్రాంతాల్లో కొలువుదీరిన శివుడికి శివరాత్రి పూజలు వేడుకగా జరిగాయి. ఉదయం లఘున్యాసపూర్వక ఏకరుద్రాభిషేకాలు, సామూహిక ఏకరుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. రాత్రి ఆలయాల్లో శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి శాంతి కళ్యాణాలు కన్నులపండువగా నిర్వహించారు. రాత్రి 10 నుంచి 12.30 గంటల వరకు లింగోద్భవ సమయంలో మహాన్యాసపూర్వక ఏకరుద్రాభిషేకాలు జరిగాయి. ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులకు పోటెత్తారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని జగన్నాథ టెంపుల్ భక్తులతో కిటకిటలాడింది. శ్రీనగర్‌కాలనీలో కొలువుదీరిన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి ఆలయ ఈఓ ఎస్.లావణ్య పూజలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని శివాలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ప్రధాన రోడ్డు మొత్తం ట్రాఫిక్ జామ్ అయింది. ఫిలింనగర్ దైవసన్నిధానంలో కొలువుదీరిని మహాశివుడి అభిషేకంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామి కల్యాణం, లింగోద్భవ వేడుకలు వైభవంగా జరిగాయి.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో...

వెంగళరావునగర్: మహా శివరాత్రి పర్వదిన వేడుకలు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని దేవాలయాల్లో కనుల పండువగా నిర్వహించారు. వెంగళరావునగర్ డివిజన్‌లోని పలు దేవాలయాల్లో కార్పొరేటర్ దేదీప్య విజయ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌ఆర్‌నగర్‌శాఖ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ద్వాదశి జ్యోతిర్లింగాలను దర్శించుకుని పూజలు చేశారు. శ్రీనగర్‌కాలనీ డివిజన్ పరిధిలోని హనుమాన్, నల్ల పోచమ్మ దేవాలయం, శాలివాహననగర్ శివాలయాలను సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


శ్రీనగర్‌కాలనీలో పూజలు చేస్తున్న సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్


ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్ దంపతులు



రహమత్‌నగర్ డివిజన్‌లో...

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ పరిధిలో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి డివిజన్‌లోని గోరఖ్‌నాథ్ పశుపతి శివాలయం, బ్రహ్మశంకర్ ఆలయం, ఇందిరానగర్ ఫేజ్–2 శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ రహమత్‌నగర్‌లోని మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో నేపాలీయుల సందడి

గోరఖ్‌నాథ్ పశుపతి శివాలయ ఆవరణలో నేపాలీయులు సందడి చేశారు. వారి సంప్రదాయ వేషధారణతో భజనలు చేస్తూ స్వామి వారిని కొలిచారు. నగరంలోని నేపాలీయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఒకే చోట చేరడంతో ఈ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ కమిటీ చైర్మన్ రాజన్ సాహు భక్తులకు తగు వసతులు కల్పించారు.


బంజారాహిల్స్ రోడ్ నెం.14 శ్రీవిజయగణపతి ఆలయంలో...


బంజారాహిల్స్ రోడ్ నెం. 1 శివాలయంలో...


ఫిలింనగర్ దైవసన్నిధానంలో...

క్లుప్తంగా...

నిమ్స్‌లో... నేడు ఓపీ సేవలకు సెలవు

లక్డీకాపూల్: మహాశివరాత్రి పర్వదినానికి సంబంధిత నిమ్స్ ఆస్పత్రికి శనివారం సెలవు ప్రకటించింది. దీంతో ఓపీ సేవలు ఉండవు. కేవలం ఎమర్జెనీ వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈ మేరకు నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతారామ్ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి ప్రభుత్వం శుక్రవారమే సెలవు ప్రకటించినా ఆ రోజు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆస్పత్రిని తొలిసారిగా సందర్శించిన సందర్భాన్ని పురస్కరించుని ఆ సెలవును మరుసటి రోజుకు పొడిగించడం గమనార్హం.

నేత్రపర్వం.. శ్రీవారి బ్రహ్మోత్సవం


బ్రహ్మోత్సవ పూజలను నిర్వహిస్తున్న పండితులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు ధ్వజారోహణ మహోత్సవాన్ని తిరుమల నుంచి ప్రత్యేకంగా వచ్చిన అర్చకులు వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామివారికి సుప్రభాత, అర్చన, కొలువు, పూరాభిషేకం, తిరుమంజనం, విశేష సమర్పణ పూజాదికాలు నిర్వహించారు. టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడు వై.రవిప్రసాద్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారిని పెద్దశేష వాహనంపై కనుల పండువగా ఊరేగించారు. ఈ పూజాదికాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమాజంలో వివక్షతపై మహిళలు పోరాడాలి

హిమాయత్‌నగర్: సమాజంలో మహిళలపై రోజురోజుకూ వివక్ష పెరుగుతున్నదని, ఆ వివక్షతను రూపుమాపేందుకు మహిళలు పోరాడాల్సిన అవసరం ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళ జేఏసీ చైర్‌పర్సన్ మట్ట జయింతి గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలు అన్ని రంగంలో రాణించాలని ఆకాంక్షిస్తున్నాన్నారు. నేడు మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పోటీ పడుతూ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఎక్కడో ఒక చోట మహిళలకు వివక్ష మాత్రం ఎదురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిని గౌరవించే వారే, స్త్రీలను గౌరవిస్తారన్నారు. దేశంలో మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ మహిళలపై అత్యాచారాలు, దారుణాలు చోటుచేసుకోవడం బాధాకారమన్నారు. కేవలం ఒక్క రోజుకే మహిళా దినోత్సవం పరిమితం కాకూడదని, మహిళలు అన్ని విధాలుగా అండగా ఉంటూ వారికి పూర్తి రక్షణ కల్పించినపుడే నిజమైన మహిళా దినోత్సవం అవుతుందన్నారు.

ఆకట్టుకున్న శివలింగాల ప్రదర్శన


బ్రహ్మకుమారీస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన శివలింగాల ప్రదర్శన

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని బ్రహ్మకుమారీస్ భవనంలో మహా శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగాల ప్రదర్శన ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున స్థానికులు, భక్తులు ఈ కేంద్రానికి చేరుకొని జ్యోతిర్లింగాలను దర్శనం చేసుకున్నారు. కేంద్రానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు శివతత్వం గురించి మెడిటేషన్ గురించి వివరించారు.

నిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

లక్డీకాపూల్: నిమ్స్‌లో దశాబ్దాల తరబడి సేవలందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు కోరారు. శుక్రవారం ఆస్పత్రిని సందర్శించిన మంత్రికి నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. 306 డ్రాఫ్ట్ జీవోను గెజిట్ చేసిన తమ వేతనాలు పెంచడమే కాకుండా ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సీనియార్టీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు పర్మనెంట్ కార్మికులకు ఇస్తున్న వేతనాన్ని కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం


కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి...


మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్


రహమత్‌నగర్‌లో పారిశ్యుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత భవానీశంకర్

బంజారాహిల్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ వేడుకల్లో పాల్గొని మహిళా దినోత్సవ కేక్‌ను కట్ చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా గ్రూపు సభ్యులు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సాధిస్తున్న విజయాలు, రాజకీయాల్లో మహిళలు రాణిస్తున్న వైనంపై ఆయన తమ ఆనందాన్ని పంచుకున్నారు.

వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఘనంగా నిర్వహించారు.

మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. మహిళ దినోత్సవ శుభాకాంక్షలు ఒకరికొకరు తెలుపుకొని సంతోషాన్ని పంచుకున్నారు.

నిమ్స్ వెల్‌నెస్ సెంటర్‌లో...

లక్డీకాపూల్: నిమ్స్‌లోని ఆయుష్ వెల్‌నెస్ సెంటర్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెంటర్ ఇంచార్జి డాక్టర్ నాగలక్ష్మి, నిమ్స్ మీడియా ఇంచార్జీ సత్యా గౌడ్, డాక్టర్ టి.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో...

లిబర్టీ: ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ మహిళా శక్తి విభాగం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఆప్ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమజిల్లోజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నర్సింగ్ యమునగౌడ అర్శియఖాన్, దేవిక, మౌనిక, విశాలి, అప్షా సలాం, డాక్టర్ లాక్షానాయుడు, డాక్టర్ దిడ్డి సుధాకర్, రాములుగౌడ్, దర్శనం రమేష్, శ్రీనివాస్, రాకేష్‌సింగ్ తదితరులు హాజరయ్యారు.

తెలుగు ఫిల్మ్ చాంబర్ ప్రివ్యూ థియేటర్‌లో మహిళా దినోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: నేస్తం ఫౌండేషన్, తెలుగు సినిమా వేదిక, డిజిక్వెస్ట్ అకాడమీ అధ్వర్యంలో జె.వి.మోహన్ గౌడ్, పి.వి జయ వర్మ, పి.ఎల్.కె.రెడ్డి నిర్వహణలో తెలుగు ఫిల్మ్ చాంబర్ ప్రివ్యూ థియేటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక ఘనంగా ముగిసింది. అతిథులుగా పాల్గొన్న తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు కె.ఎల్.దామోదర ప్రసాద్, డైరెక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీర శంకర్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ అనుపమ్ రెడ్డి, చాంబర్ కౌన్సిల్ ఈసీ మెంబర్ నాగులపల్లి పద్మిని, రైటర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రవీంద్ర గోపాల, నటుడు నిర్మాత కె.సురేష్ బాబు మహిళల గొప్పతనాన్ని గురించి కొనియాడారు. సన్మాన గ్రహీతలలో సినీ అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అనితా చౌదరి, ఇందు ఆనంద్, కీర్తి భట్, హైకోర్టు న్యాయవాది కుల్లపరెడ్డి శ్వేత, ఉమెన్స్ సెల్ఫ్ డిఫెన్స్ కోచ్ లక్ష్మి సామ్రాజ్యం, జర్నలిస్ట్ దేవినేని గంగా భవాని, సెన్సార్ బోర్డ్ మెంబర్ దేశబత్తుల సుధా రవి, నిమ్స్ హాస్పిటల్ ఐసియూ వార్డ్ నర్సు సుశీల్ కుమారి ఉన్నారు.


మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి...


ఆయుష్: నిమ్స్ వెల్‌నెస్ సెంటర్‌లో...


ఆప్ కార్యాలయంలో...

మహిళలకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ముఖ్యం

బంజారాహిల్స్: ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుతం మహిళలను కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహిస్తున్నారని ఇది మహిళలు మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడుతుందని ఐఏఎస్ అధికారిణి, ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ రేఖారాణి అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీలో వివిధ విభాగాల మహిళా అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఒకప్పుడు చేసే ప్రతి పనిలో మగా, ఆడ తేడా చూసేవారని కానీ ఇప్పుడు అవేవి అడ్డురావడం లేదన్నారు. అన్ని రంగాల్లో మహిళలు పోటీ పడి రాణిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రతి మహిళా తమ తమ శక్తి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, లా కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరి, డాక్టర్ లక్ష్మి, ఫాతిమా, విభా ఆస్థానా, ఎన్‌బీవీ లక్ష్మీకుమారి, డాక్టర్ ఇష్రత్ ఎం మీర్జానా తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ రేఖారాణి

కమనీయం అనన్య సూరపనేని నృత్యం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా అనన్య సూరపనేని ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ కట్టుకుంది. జేం జేం తనన, నారాయణీయం, దశావతారాలు, ముద్దుగారే యశోద, శివాష్టకాన్ని ఎంతో చక్కగా ప్రదర్శించింది. ఈ అవకాశం కల్పించిన జూబ్లీహిల్స్ టీటీడీ కార్యవర్గానికిఆమె ధన్యవాదాలు తెలిపారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

బంజారాహిల్స్: ఎస్‌బీటీ నగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదిదంపతుల కల్యాణోత్సవంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు, జాయింట్ కమిషనర్ వి.సత్యనారాయణ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.


శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి

పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

పంజగుట్ట: జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల సమయం మార్పు, వేతనం పెంపు విషయమై రాబోయే రెండు రోజుల్లో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత రాములు నాయక్ హామీ ఇచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జీహెచ్ఎంసీ మహిళా కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు రాములు నాయక్, బీసీ సంఘం నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, కార్పొరేటర్లు వీరికి పనులు చెప్పడమే కానీ మహిళా దినోత్సవం రోజు కనీసం గౌరవించాలని తెలియకపోవడం బాధాకరమన్నారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులు అనూరాధ, లక్ష్మమ్మ మాట్లాడుతూ... తెల్లవారు జామున 4 గంటలకు డ్యూటీ ఎక్కినట్లు ఫింగర్ ప్రింట్ ఇవ్వాలని అంత ఉదయం బస్సులు ఉండవు, కొద్దిగా లేటైతే డ్యూటీకి రానట్లు చూపుతున్నారని సమయం వేలలు మార్చాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులతో రాములు నాయక్, చిన్న శ్రీశైలం యాదవ్

'సంస్కార్ కిడ్స్'లో జోష్

వెంగళరావునగర్: ఎర్రగడ్డలోని సంస్కార్ కిడ్స్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. టీచర్లకు, చిన్నారుల తల్లులకు వివిధ రకాల పోటీలను ఏర్పాటు చేశారు. మహిళలు డ్రాయింగ్, వ్యాసరచన, తంబోలా, ఫ్యాషన్ షో తదితర పోటీలను నిర్వహించారు. మహిళలు ఆసక్తిగా ఆయా పోటీల్లో పాల్గొన్నారు. ఆయా పోటీలను సీఈఓ మోహన వంశీ, డైరెక్టర్ మధుమతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ ప్రత్యేకతను వారు వివరించారు.



మహిళా దినోత్సవంలో ప్రముఖుల సందడి


పీఎంజే జ్యువెల్స్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

బంజారాహిల్స్: పీఎంజే జ్యువెల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా. ఈ సందర్భంగా హీరోయిన్స్ ఆఫ్ రియల్ లైఫ్.. పీఎంజే జ్యువెల్స్ బ్లిస్ కలెక్షన్‌ను ఆవిష్కరించారు. వేడుకల్లో యాంకర్ స్వప్న, సేల్స్‌ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీలక్ష్మీ, ఫైనాన్షియల్ కన్సల్టెంట్ స్వాతి, లూసిడ్ డయాగ్నస్టిక్స్‌కు చెందిన డాక్టర్ సునీత తదితరులు పాల్గొని ప్రసంగించారు. పీఎంజే డైరెక్టర్ సిమా మాట్లాడుతూ... మహిళల అవిశ్రాంత కృషి, అంకిత భావాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. కార్యక్రమానికి పీఎంజే బ్రాండింగ్ కన్సల్టెంట్ నివేదిత సొతేకల్ అధ్యక్షత వహించారు.

వేగశ్రీ డైమండ్స్‌లో...

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని వేగశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్‌లో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని పాల్గొని నూతన కలెక్షన్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం పలువురు మోడల్స్‌తో కలిసి కేక్ కట్ చేశారు. నిర్వాహకులు వనమా నవీన్ కుమార్, మణిదీప్ ఏచూరి, కళ్యాణ్ కుమార్‌లు మాట్లాడుతూ... మహిళా దినోత్సవం సందర్భంగా తమ వద్ద జ్యువెలరీలో మహిళలకు పలు రాయితీ పథకాలు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు.


వేడుకల్లో పాల్గొన్న పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని

సాగునీటికి రైతుల తిప్పలు

- సొంత ఖర్చులతో కట్టకు మట్టి



అశ్వరావుపల్లి ప్రధాన కాలువ నీరు నెల్లుట్ల చెరువులోకి వెళ్లకుండా సైఫన్ వద్ద మట్టిని పోస్తున్న రైతులు

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండల పరిధిలోని నాగారం, లింగాల ఘణపురం రైతులు ఎండుతున్న యాసంగి పంటలను కాపాడుకునేందుకు తిప్పలు పడుతున్నారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ ప్రధాన కాలువ పూర్తి కావడంతో అధికారులు నీటిని వదిలారు. అయితే నెల్లుట్ల చెరువు వద్ద సైఫన్ నుంచి నీరు వచ్చే చోట సంబంధిత కాంట్రాక్టర్ మట్టిని సరిగా పోయలేదు. దీంతో కట్ట తెగిపోవడంతో అధికారులు నీటిని ఆపేశారు. బిల్లులు రాలేదంటూ కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. దీంతో రైతులే స్వయంగా ట్రాక్టర్లతో మట్టి తీసుకొచ్చి పోస్తూ.. కట్టను మరమ్మతు చేసుకుంటున్నారు. ఈ కాల్వకు నీరు వస్తే లింగాలఘణపురం, నాగారం, కళ్లెం, సిరిపురం, మాణిక్యాపురం, జీడికల్ గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది.

ఎస్సీ వర్గీకరణే మా అంతిమ లక్ష్యం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



కరీంనగర్: ఎస్సీ వర్గీకరణే ఎమ్మార్పీఎస్ అంతిమ లక్ష్యమని, 29 ఏళ్లుగా సాగుతున్న తమ పోరాటం చివరి దశకు చేరుకుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశానికి మద్దతు ఇస్తున్న పార్టీని ఎమ్మార్పీఎస్ గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందని, ఉద్యమ లక్ష్యం త్వరలో సాకారం కానుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉండటమే కాకుండా చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారని వివరించారు.

వైఎస్ విజన్ వల్లే హైదరాబాద్ అభివృద్ధి

- అంతర్జాతీయ విమానాశ్రయం, ఓఆర్ఆర్, పీవీ ఎక్స్‌ప్రెస్ వే వంటి ప్రాజెక్టులతో నగర రూపురేఖలు మార్చారు
- అప్పుడు పుంజుకున్న స్థిరాస్తి మార్కెట్ ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉంది
- క్రెడాయ్ 13వ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి



క్రెడాయ్ ప్రాపర్టీ షోలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విజన్, విధానాల వల్లే హైదరాబాద్ అభివృద్ధి సాధ్యమైందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ అధికారంలోకి రాక ముందు హైదరాబాద్‌లో స్థిరాస్తి మార్కెట్ పూర్తిగా క్షీణ దశలో ఉండేదని, ఆయన సీఎం పదవి చేపట్టాక దూరదృష్టితో నగరాభివృద్ధి కోసం చేపట్టిన అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, పీవీ ఎక్స్‌ప్రెస్ వే వంటి విప్లవాత్మక ప్రాజెక్టులతో హైదరాబాద్ రూపురేఖలే పూర్తిగా మారిపోయాయని గుర్తుచేశారు. దీంతో అప్పుడు పుంజుకున్న స్థిరాస్తి మార్కెట్ ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉందని చెప్పారు. భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ 13వ ప్రాపర్టీ షో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో బిల్డర్లు కూడా భాగస్వాములేనన్నారు. బిల్డర్లు ఎంత వ్యాపారం చేస్తే రాష్ట్రం అంత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బిల్డర్లను వ్యాపారస్తులుగా చూసే విధానాలకు స్వస్తిచెప్పి పరిశ్రమ అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసుకుంటామని పొంగులేటి హామీ ఇచ్చారు. శివారు ప్రాంతాల్లోని రిజర్వాయర్ల సామర్థ్యాన్ని మరింత పెంచి హైదరాబాద్ దాహార్తిని తీరుస్తామని, నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. నిర్మాణ అనుమతులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ నలువైపులా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుందని పేర్కొన్నారు.

ధరణిలో 8.5 లక్షల దరఖాస్తులు పెండింగ్..

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వం ఎన్నో విధ్వంసాలకు పాల్పడిందని, సామాన్యులకు కలిగిన ఇబ్బందులను కళ్లారా చూస్తున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రస్తుతం ధరణిలో 8.5–9 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిలో 5.8 లక్షల దరఖాస్తులను సహేతుక కారణాల్లేకుండానే తిరస్కరించారని విమర్శించారు. స్పెషల్ డ్రైవ్‌లతో గత వారం రోజులలో 80 వేల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామని పొంగులేటి చెప్పారు. రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేసి బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఉన్న లొసుగులను గుర్తించి సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తామన్నారు. పారదర్శక రెవెన్యూ వ్యవస్థను సామాన్యుల చెంతకు తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వైఎస్సార్ లాగా ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లతో ప్రధాన నగరంలో కూడా అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ జాతీయ మాజీ అధ్యక్షుడు సి.శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి. రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి



సాహిత్య (ఫైల్)

హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తల్లిదండ్రుల ఆరోపణ

- కళాశాల ఎదుట బంధువుల ఆందోళన
- మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభ్యం
- హనుమకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఘటన

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పరిధి భీమారంలోని ఓ ప్రైవేట్ కాలేజీకి చెందిన హాస్టల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అయితే తమ కూతురును హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, బంధువులు కాలేజీ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్ల కనపర్తికి చెందిన వలుగుల ప్రభాకర్, కవిత దంపతుల పెద్దకూతురు సాహిత్య (17) భీమారంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఆమె అదే కళాశాల హాస్టల్‌లోనే ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో గత సబ్జెక్టుల్లో సాహిత్య అనుకున్నంత మేరకు పరీక్షలు రాయలేదు. దీంతో సాహిత్య మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె వద్ద లభ్యమైన సూసైడ్ నోట్ ద్వారా తెలుస్తోంది.

భవనంపై నుంచి దూకి..?

సాహిత్య, కళాశాల హాస్టల్ భవనం పైనుంచి శుక్రవారం తెల్లవారు జామున దూకి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సాహిత్య కింద పడి ఉండటం గమనించిన కళాశాల యాజమాన్యం హుటాహుటిన ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. అక్కడినుంచి ఎంజీఎంకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు.

సూసైడ్ నోట్ లభ్యం..

ఇదిలా ఉండగా సాహిత్య రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'జువాలజీ పరీక్ష రోజు చనిపోతున్నా'అని అందులో పేర్కొంది. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆ సూసైడ్ నోట్ తన కూతురిది కాదని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కూతురును హత్య చేసి.. ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాసి పెట్టారని తెలిపారు. భవనంపై నుంచి దూకితే చేతిపై బ్లేడ్‌తో కోసిన గాయాలు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. తమ కూతురు మృతదేహాన్ని గోప్యంగా ఎందుకు ఎంజీఎంకు తరలించారన్నారు.

కళాశాల ఎదుట ఆందోళన

తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. సుమారు నాలుగు గంటల పాటు ఈ ఆందోళన కొనసాగింది. వారి ఆందోళనకు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ, ఎస్సైలు రాజ్‌కుమార్, సురేశ్‌లు ఆందోళనకారులను శాంతింపజేశారు. సాహిత్య మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు. కళాశాలలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే సూసైడ్ నోట్‌ను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించనున్నట్లు చెప్పారు.

నేత్ర దానం

సాహిత్య నేత్రాలు దానం చేశారు. తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రాంతీయ నేత్ర వైద్యశాల, వరంగల్ సిబ్బంది నేత్రాలు సేకరించారు.

పుణ్య స్నానానికి వచ్చి అనంతలోకాలకు..

ఎస్సారెస్పీలో మునిగి ముగ్గురు యువకుల మృతి



సాయికిరణ్ (ఫైల్)



సాయినాథ్ (ఫైల్)



లోకేశ్ (ఫైల్)

బాల్కొండ: శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్య స్నానాల కోసం వచ్చిన ముగ్గురు యువకులు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిలో మునిగి మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం గన్యా తండాకు చెందిన అజ్మీరా సాయి కిరణ్ అలియాస్ మున్నా (17), అజ్మీరా సాయినాథ్ (16), బానవత్ లోకేశ్ (16)లతో పాటు వంశీ, సందీప్, అభిరాం శుక్రవారం ఉదయం ప్రాజెక్టుకు వచ్చారు. తొలుత మిత్రులందరూ రిజర్వాయర్‌లో స్నానం చేసి ఒడ్డుకు చేరారు. అయితే మట్టి అంటుకుందని మళ్లీ స్నానం చేసేందుకు సాయి కిరణ్, సాయినాథ్, లోకేశ్‌లు లక్ష్మీ కాలువ హెడ్‌రెగ్యులేటర్ సమీపంలో గల నీటిలో దిగారు. అయితే అక్కడ లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి పోయారు. ఒడ్డున ఉన్న వంశీ వాళ్లను కాపాడేందుకు నీటిలోకి దిగినప్పటికీ అతను కూడ మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్రమత్తమై అక్కడ ఉన్న సిమెంట్ కట్టడాన్ని పట్టుకుని బయట పడ్డాడు. ఆందోళనతో మిగతా మిత్రులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ విషయం తెలియగానే ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలు రిజర్వాయర్ నుంచి కాలువలోకి కొట్టుకుపోకుండా ఉండేందుకు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి లక్ష్మీ కాలువకు నీటిని నిలిపివేయించారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికి తీశారు. సాయినాథ్, లోకేశ్‌లు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా సాయి కిరణ్ లారీపై దినసరి కూలీగా ఉన్నాడు. ఘటనా స్థలానికి గన్యా తండా వాసులు భారీగా చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనా స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యాదాద్రికి అఖండ జ్యోతి యాత్ర



బర్కత్‌పురలో ప్రారంభమైన అఖండ జ్యోతి యాత్రలో ప్రభుత్వ విప్ ఐలయ్య, ఈవో, అనువంశిక ధర్మకర్త, ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బర్కత్‌పురలోగల యాదగిరి భవన్ నుంచి యాదాద్రికి అఖండ జ్యోతి యాత్ర ప్రారంభమైంది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి శుక్రవారం ఈ యాత్రను ప్రారంభించారు. శ్రీస్వామి అమ్మవార్ల విగ్రహం ముందు ఆచార్యులు భారీ అఖండ దీపాన్ని వెలిగించారు. అఖండ జ్యోతి యాత్ర ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి మీదుగా యాదగిరిగుట్ట పట్టణానికి ఈ నెల 11న చేరుకుంటుంది.

భర్త వేధింపుల నుంచి రక్షించండి

మంత్రి కాళ్లు మొక్కిన మహిళ



రోదిస్తూ న్యాయం చేయాలని మంత్రిని వేడుకుంటున్న వివాహిత

ఎంజీఎం (వరంగల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళలంతా సంబరాల్లో మునిగిన వేళ...ఓ మహిళ మాత్రం తన భర్త వేధింపుల నుంచి రక్షించాలంటూ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కాళ్లపై పడి వేడుకుంది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన ఓ వివాహిత తన భర్త చేసిన దాడితో రెండు చేతులకు తీవ్ర గాయాలపాలై వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రిలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సురేఖ పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో సదరు మహిళ మంత్రి కాళ్లపై పడి వేడుకుంది. తన భర్త తీవ్రంగా హింసిస్తున్నాడని, పోలీస్‌స్టేషన్‌కు ఎన్నిసార్లు వెళ్లినా తనకు న్యాయం జరగడం లేదని వాపోయింది. రెండు చేతులపై గాయాలతో ఉన్న ఆమెను చూసి మంత్రి సురేఖ చలించిపోయారు. మహిళ పూర్తి వివరాలు తెలుసుకుని పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆమెకు న్యాయం చేయాలని ఆదేశించారు.

నగర వార్తలు

12,13 తేదీల్లో సకల కళల సమ్మేళనం



కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపింది జానపదమే అని, ఒక్క పాట వంద ఉపన్యాసాలతో సమానమని సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి అన్నారు. నటరాజ్ అకాడమీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నటరాజ్ అకాడమీ ఆధ్వర్యంలో, మనం ఫౌండేషన్ సహకారంతో ఏప్రిల్ 12, 13వ తేదీల్లో తెలంగాణ సకల కళ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ కనకరాజు, నటరాజ్ అకాడమీ డైరెక్టర్ గిరితో కలిసి ఆవిష్కరించారు.

ఫోన్ ట్యాంపరింగ్‌పై సమగ్ర విచారణ జరిపించాలి

పంజగుట్ట: గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాంపరింగ్‌లపై సమగ్ర విచారణ జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది అరుణ్ కుమార్ శుక్రవారం రాత్రి పంజగుట్ట ఇనిస్పెక్టర్ శోభన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ .. కేసీఆర్ రాజ్యాంగ ద్రోహం చేసి లక్షలాది ఫోన్‌లు ట్యాంపరింగ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కేంద్ర హోంశాఖ అనుమతితో చేయాల్సిన ఫోన్ ట్యాంపరింగ్‌ను ప్రవీణ్ రావు అక్రమపద్ధతిలో పదోన్నతి పొందిన డిఎస్పీ సహకారంతో ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రత్యర్థులు, జ్యుడీషియల్ అధికారులు, జర్నలిస్టుల ఫోన్లు, ఆఖరుకు గవర్నర్ ఫోన్ కూడా ట్యాంపరింగ్ చేయించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫిర్యాదును న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి న్యాయస్థానం ఆదేశాలమేరకు వ్యవహరిస్తామని పంజగుట్ట పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

గ్యాస్ 'ఛాన్స్' కొందరికే..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 14.01 లక్షలు

- తెల్ల రేషన్ కార్డులున్న లబ్ధిదారులు 5.23 లక్షలు
- రూ.500 గ్యాస్ కోసం ఎదురుచూపులు
- పెండింగ్‌లో 22,354 రేషన్ కార్డుల



సాక్షి, మేడ్చల్ జిల్లా : ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా పేదలకు రూ.500కు రాయితీ గ్యాస్ సిలిండర్లను అందించాలని నిర్ణయించింది. ఈ రాయితీ గ్యాస్ పొందడానికి రేషన్‌కార్డును తప్పనిసరి చేయడంతో అర్హులైన చాలా మంది అనర్హులుగా మిగిలిపోతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు 14,00,125 ఉండగా, ఆహార భద్రతా కార్డులు (రేషన్ కార్డులు) మాత్రం 5,23,938 ఉన్నాయి.

ఆందోళనలో లబ్ధిదారులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో రేషన్‌కార్డులు జారీ అయ్యాయి. అప్పటి నుంచి దరఖాస్తు చేసుకున్న వారందరికీ కొత్త రేషన్ కార్డులను జారీ చేయకుండా.. ..కొందరికి మొక్కుబడిగా అందజేసి 95 వేల దరఖాస్తులను అనర్హతగా గుర్తించి, తిరస్కరించింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం 32,108 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు కొత్తగా వివాహమైనవారు. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు కనీసం దరఖాస్తులు చేసుకోవడానికి కూడా నోచుకోలేదు. అలాగే, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులను నమోదు చేయించడం కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వీటికి సంబంధించిన మ్యుటేషన్ దరఖాస్తులు 17 వేలకు పైన్నే ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇదిలా ఉండగా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారవర్గాలు మాత్రం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయిన వెంటనే గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తామని పేర్కొంటున్నారు.

రేషన్ కార్డులు ఇలా:

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 619 రేషన్ దుకాణాల పరిధిలో 5,23,938 కార్డులున్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 5,06,163, అంత్యోదయ ఆహార భద్రతా కార్డులు 17,676, అన్నపూర్ణ కార్డులు 99 ఉన్నాయి.వీరికి మాత్రమే ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అందించే రూ.500 గ్యాస్ పంపిణీ రాయితీ వర్తించనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

డీఎస్సీతో పాటు టెట్ నిర్వహించాలి

- ఈ నెల 11న చలో హైదరాబాద్
- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: డీఎస్సీతో పాటు టెట్ కూడా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీతో పాటు టెట్ నిర్వహించడం సాంప్రదాయం అని గతంలో రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీతో పాటు టెట్ నిర్వహించేదని పక్క రాష్ట్రాలైన కర్ణాటక, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా డీఎస్సీతో పాటు టెట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. డీఎస్సీ, టెట్ నోటిఫికేషన్ ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి అభ్యంతరాలు ఏమిటని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. టెట్ పాస్ కాకపోతే డీఎస్సీకి అర్హత లేదని టెట్ నిర్వహించి ఆరు నెలలు గడిచినా టెట్ పరీక్షల్లో కేవలం పది శాతం మాత్రమే పాసయ్యారని బీఈడీ, డీఈడీ పాసైన వారు ఏడు లక్షల మందికి పైగా ఉన్నారన్నారు. వారిలో టెట్ పాసైన వారు కేవలం మూడు లక్షల మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. గత నోటిఫికేషన్‌లో తక్కువ పోస్టులు ఉన్న కారణంగా చాలా మంది టెట్ రాయలేదని గత టెట్‌లో సిలబస్ మారినందున అభ్యర్థులు అర్హత సాధించలేరని తెలిపారు. బీఈడీ, డీఈడీ పాసైన నిరుద్యోగులు టెట్ వేయనందున తీవ్ర ఆగ్రహంతో, అసంతృప్తితో ఉన్నారని ఒక అవకాశం కోల్పోతామనే ఆందోళన వారిలో కనిపిస్తుందని తెలిపారు. 24 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ కేవలం 11 వేల పోస్టులకు మాత్రమే డీఎస్సీ ప్రకటించారని వాటిని 24 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా 11న ఇందిరాపార్కు వద్ద భారీ ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, సి.రాజేందర్, నందగోపాల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రియల్‌మీ-12 5జీ సిరీస్ ఆవిష్కరణ



రియల్‌మీ12 స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరిస్తున్న నటి చాందిని చౌదరి

మాదాపూర్: మాదాపూర్‌లోని మల్టీబ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ బీన్యూ మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ స్టోర్‌లో శుక్రవారం నటి చాందిని చౌదరి రియల్‌మీ-12 5జీసిరీస్ స్మార్ట్‌ఫోన్‌ను సంస్థ ప్రతినిధులతో కలసి ప్రారంభించారు. రియల్‌మీ ఫోన్‌లు ఎంతో ఆకర్షణగా, సాంకేతిక పరిజ్ఞానంతో కూడినవని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా స్టోర్‌లో అన్ని రకాల మొబైల్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. రియల్‌మీ12,5జీ ట్రిపుల్ కెమెరాను కలిగివుందన్నారు. అత్యాధునిక బ్యాటరీ ఉండడంతో కేవలం 19 నిమిషాలలో 50శాతం చార్జ్ చేస్తుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న స్టోర్‌లలో మొబైల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో సంస్థ సీఎండి వై బాలాజీ చౌదరి, సీఈఓ సాయినిఖిలేష్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సాయినితేష్, రియల్‌మీ సేల్స్ డైరెక్టర్ తరిని ప్రసాద్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో నెంబర్ వన్‌గా నిలిపింది

వనస్థలిపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపిందని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఈటెల రాజేందర్ ఆరోపించారు.హస్తినాపురం ఈస్ట్ కాలనీలో పలు కాలనీల సంక్షేమ సంఘాలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో శుక్రవారం ఈటెల రాజేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాలలో నెంబర్‌వన్ అని చెబుతూ రాష్ట్రాన్ని అధోగతి పట్టించారని అన్నారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఇక ఆ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని అన్నారు. నరేంద్ర మోదీ అధికారంలో వచ్చాక దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకపోతుందని అన్నారు. దేశంలో అన్ని ప్రాంతాల ప్రజలు నివాసించే ప్రాంతం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అని, రాబోయే ఎన్నికల్లో ఇక్కడ డబ్బుకు ధర్మానికి మధ్య యుద్ధం జరగబోతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, వనస్థలిపురం కార్పొరేటర్ రాగు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


తయారీ రంగంలో వృద్ధిని సాధించాలి

వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్



సదస్సులో మాట్లాడుతున్న వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, హాజరైన ప్రతినిధులు

కుషాయిగూడ: ప్రపంచ దేశాలతో పోటీపడేలా అన్ని రంగాల్లో పరిశోధనలు చేస్తున్నాం..విజయవంతంగా అంతరిక్షంతో పాటుగా పలు రంగాల్లో ప్రయోగాలు చేయగలుగుతున్నాం కాని వాటికి కావాల్సిన ముడి సరుకుల కోసం ఇతర దేశాలపై ఆధారాపడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) డైరెక్టర్ ఉన్నికృష్ణణ్ నాయర్ అన్నారు. దీనిని అధిగమించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. తయారీ రంగాన్ని విస్తృతం చేయాలనే లక్ష్యంగా కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ కార్యచరణ చేపట్టిందన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సెంటర్ ఫర్ మెటీరియల్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సిమెట్) ఫౌండేషన్ డే సందర్భంగ శుక్రవారం సిమెట్‌లో ఎమర్జింగ్ సెమీకండక్టర్ మెటీరియల్స్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 2025 డిసెంబరు కల్లా సెమీకండక్టర్‌తో పాటుగా ఇతర ముడిసరుకులు, లోహాలను భారత్‌లో పూర్తిస్థాయిలో తయారీ చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా ఇండస్ట్రీస్, యూనివర్సిటీస్, ఆర్ అండ్ డీ ల్యాబ్స్ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యానికి చేరువ కావాలన్నారు. అనంతరం అంతరిక్ష పరిశోధనలు, సాధించిన విజయాలు, ఒడిదుడులను ఆయన వివరించారు. సిమెట్ డైరెక్టర్ రతీష్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలతో ఎలాంటి అద్భుతాలు సృష్టించ వచ్చో వివరించారు. రీసైక్లింగ్‌తో విలువైన బంగారం, వెండితో పాటుగా అనేక రకాల లోహాలను కనుగొనే విధానాలను వివరించారు. స్వీడన్ శాస్త్రవేత్త డాక్టర్ మైఖేల్, ఫౌండింగ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ జీ పాటిల్ సదస్సులో ప్రసంగించగా సిమెట్ డైరెక్టర్ జనరల్ ఈ. మగేష్, కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వశాఖ గ్రూప్ కోఆర్డినేటర్ సునీతవర్మ, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి ఎస్ మూర్తి ఆన్‌లైన్లో మాట్లాడారు. ఇదే వేదికగా విక్రమ్ సారాబాయ్ స్పేస్‌సెంటర్, ఇస్రో పలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.



అవార్డులు అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

మన దేశంలో మహిళలకు ఎంతో గౌరవం

బంజారాహిల్స్: ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో మహిళలకు ఎంతో గౌరవం ఉంటుందని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో ఎస్ఎస్ఐ గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళాభివృద్ధికి కృషి చేస్తుందని మహిళా పారిశ్రామికవేత్తలకు సహకారం ఇస్తామని అన్నారు. రాచకొండ సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ తన జీవితంలో తన తల్లి పాత్ర ఎంతో గొప్పదని అన్ని రంగాల్లో మహిళలు దూసుకెళ్తున్నారని అన్నారు. పోలీసు విభాగంలో కూడా మహిళల సంఖ్య పెరుగుతున్నదని ఈ సందర్భంగా మహిళలను ఉత్తేజపరిచేలా పాట పాడి ఆయన ఆకట్టుకున్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ఎంపిక చేసిన 55 మంది మహిళలకు వారు అవార్డులు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 9-3-2024



సుధామూర్తి

సాటి మనుషుల కోసం పని చేయడం
సామాజిక సేవ ద్వారా పరిస్థితులను మెరుగుపరచడం
యువతకు స్ఫూర్తిగా నిలవడం..
రచయితగా ఎదగడం
ఇన్ఫోసిస్ దిగ్గజంగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందడం
సుధామూర్తిని నేడు రాజ్యసభకు చేర్చాయి.
ఉమెన్స్ డే రోజు ఆమెను రాష్ట్రపతి ముర్ము
రాజ్యసభకు నామినేట్ చేశారు.
సుధామూర్తి జీవన విశేషాలు.

రాజ్య సుధ

తొలి పాఠాలు

సుధామూర్తి బాల్యం హుబ్లీలో గడిచింది. తండ్రి కులకర్ణి డాక్టర్. ఆయన రోజూ టీ సేవించేవాడు. ఒకరోజు పాలు రాలేదు. తండ్రి టీ తాగక వేరే ఏ పనీ మొదలుపెట్టలేక కూచుని ఉన్నాడు. 'ఏంటి నాన్నా?' అని అడిగింది సుధామూర్తి. 'ఉదయాన్నే టీకి నేను అలవాటు పడ్డానమ్మా. ఇవాళ టీ తాగక తలనొప్పి వచ్చింది. నువ్వు మాత్రం దేనికీ అతిగా అలవాటు పడకు.. కాఫీ, టీలకైనా సరే' అన్నాడు. సుధామూర్తి ఆ పాఠాన్ని గుర్తు పెట్టుకుంది. ఇవాళ ఆమెకు డెబ్బై నాలుగు ఏళ్లు. నేటికీ ఉదయాన్నే లేచి టీగానీ కాఫీ గాని తాగి ఎరగదు. సుధామూర్తి హుబ్లీకి 50 కిలోమీటర్ల దూరంలో ఉండే షిగావ్‌లో పుట్టింది. అక్కడ ఆమె అమ్మమ్మ, తాతయ్య ఉండేవారు. తాతయ్య స్కూల్ టీచర్. ఆయన తనకంటే వయసులో ఎంత చిన్నవారినైనా 'మీరు' అని బహువచనం వాడేవారు. 'నీ కంటే చిన్న కదా తాతయ్య' అని సుధామూర్తి అంటే 'లోపలి ఆత్మ పెద్దదే కదమ్మా' అనేవారు. ఎదుటివారిని గౌరవించడం అలా నేర్చుకుందామె. తాతయ్య ఆమెకు మూడు జీవన పాఠాలు నేర్పారు. 1.సింపుల్‌గా జీవించు 2.జ్ఞానాన్ని సముపార్జిస్తూనే ఉండు 3. పుస్తకాలు చదువు. ఇవి సుధామూర్తి నేటికీ పాటిస్తూనే ఉంది. అమ్మమ్మ 'ఆకలితో ఉన్నవారిని గమనించు' అని చెప్పింది. వాళ్ల ఇంటికి రోజూ ఒక భిక్షకుడు వస్తే ఇంట్లో మంచి బియ్యం నిండుకుని ముతకబియ్యం ఉన్నా అమ్మమ్మ మంచి బియ్యమే భిక్షకుడికి వేసేది. 'ముతక బియ్యం మనం తినొచ్చులే' అనేది. ఇదీ సుధామూర్తికి తొలి పాఠమే.

ఇక అమ్మ విమల నేర్పిన పాఠం– 'ఎంతో అవసరమైతే తప్ప డబ్బు ఖర్చు పెట్టకు' అని. అంతే కాదు నీకు బాల్యంలో మంచి అలవాట్లు ఉంటే అవే కాపాడతాయి అని కూడా ఆమె అనేది. ఉదయాన్నే లేచి కాగితం మీద 10 సార్లు 'దేవుడికి నమస్కారం' అని రాయించేదామె. నేటికీ సుధా మూర్తి ఆ అలవాటును మానలేదు. ఇక స్కూల్ టీచరు రాఘవేంద్రయ్య... 'నీకు లెక్కలు భలే వస్తున్నాయి. లెక్కల్ని వదలకు. పైకొస్తావ్' అన్నాడు. ఆమె ఆనాటి నుంచి లెక్కల్నే రెక్కలుగా చేసుకుంది.

ఇల్లాలే శక్తి

నారాయణ మూర్తితో వివాహం అయ్యాక ఇన్ఫోసిస్ సంస్థను ఆయన స్థాపించాలనుకున్నప్పుడు 10 వేల రూపాయలు పెట్టుబడి తనే ఇచ్చింది సుధామూర్తి. అయితే ఆమెను ఇన్ఫోసిస్‌కు బయటి వ్యక్తిగానే ఉండటం మంచిదని సూచించాడు నారాయణమూర్తి. ఆమె కొంచెం బాధపడింది. ఎప్పటికైనా ఇన్ఫోసిస్ సంస్థలో చేరతాననే భావించింది. అదే సమయంలో చాలా కాలం పాటు పిల్లల కోసం గృహిణిగా ఉండిపోయింది. 'సంవత్సరంలో 200 రోజులు ప్రయాణాల్లో ఉండేవాడు నారాయణమూర్తి. ఆ రోజుల్లో ఫోన్ లేదు. కారు లేదు. పిల్లలకు ఆరోగ్యం బాగలేకపోతే ఒక్కదాన్నే వెళ్లాలి. సంస్థ ఆర్థిక కష్టాలు.. ఇంటి కష్టాలు.. అన్నీ తట్టుకుని నారాయణమూర్తికి వెన్నుదన్ను అందించాను. ఆ తర్వాత ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌కు చైర్మన్ అయ్యాను. ఆ ఫౌండేషన్‌తో వేలాది మంది జీవితాల్లో వెలుగు తెచ్చే వీలు నాకు కలిగింది. ఈ సంతృప్తి ఇన్ఫోసిస్ డైరెక్టర్‌గా పని చేసి ఉంటే నాకు దక్కేది కాదు' అంటుందామె.

కుతూహలమే గురువు

చిన్నప్పుడు సుధామూర్తికి ప్రతిదీ కుతూహలమే. వీధుల్లో కొట్లాటలు అవుతుంటే అక్కడకు పరిగెత్తి వెళ్లి నిలబడేది. వినోదం కోసం కాదు. కారణం ఏమై ఉంటుందా అని. చిన్న ఊళ్లో ప్రతి ఇల్లూ అందరికీ పరిచయమే. అందరి జీవితాలనూ ఆమె పరిశీలిస్తూ ఉండేది. ఇక పెళ్లిళ్లు, శుభకార్యాలు జరిగితే ఆమె తప్పని సరిగా ఒక స్టీలు క్యారేజీ తీసుకుని బయలుదేరేది. విందులో ఏ పదార్థాలు బాగున్నాయో ఏ పదార్థాలు బాగలేవో మొత్తం రుచి చూసి వస్తూ వస్తూ బాగున్న వాటిని క్యారేజీలో అడిగి తెచ్చుకునేది. కాలేజీ రోజుల వరకూ కూడా పెళ్ళిళ్లకు క్యారేజీ తీసుకోకుండా సుధామూర్తి వెళ్లేది కాదు. 'ఎందుకో నాకు గిన్నెల క్యారేజీ అంటే నేటికీ ఇష్టం' అంటుందామె.

మసాలా దోసె పార్టీ

లెక్కలు బాగా నేర్చుకున్న సుధా హుబ్లీలోని బి.వి.బి. కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో చేరింది. ఇక ఆ రోజు నుంచి ఊళ్లోని పెద్ద మనుషులంతా ఆమె తండ్రి దగ్గరకు వచ్చి వాపోవడమే. 'అమ్మాయిని ఇంజనీరింగ్ చదివిస్తున్నావ్. పెళ్లెవరు చేసుకుంటారు' అని బెంగపడటమే. తండ్రి కూడా ఒక దశలో తప్పు చేశానా అనుకున్నాడు. కాని సుధామూర్తి మొదటి సంవత్సరానికి ఫస్ట్ క్లాస్‌లో పాసైంది. తండ్రికి సంతోషం కలిగింది. 'ఫస్ట్ క్లాస్ తెచ్చుకున్నావ్ కదా... పద మసాలా దోసె పార్టీ చేసుకుందాం' అని తీసుకెళ్లాడు. ప్రతి సంవత్సరం ఆమె ఫస్ట్‌క్లాస్ తెచ్చుకోవడం.. తండ్రి తీసుకెళ్లి మసాలా దోసె తినిపించడం. ఆ తండ్రీ కూతుళ్ల జీవితంలో పార్టీ చేసుకోవడం అంటే అదే. అది కూడా సంవత్సరానికి ఒకసారి మాత్రమే. 'కాని ఆ పార్టీ ఎంతో సంతోషాన్ని ఇచ్చేది. అపురూపం అనిపించేది' అంటుందామె.

చరిత్ర మార్చిన కార్డు ముక్క

1974లో టాటా వారి 'టెల్కో' సంస్థలో ఇంజనీరింగ్ ఉద్యోగాలు పడ్డాయి. పేపర్‌లో ఆ యాడ్ చూసింది సుధామూర్తి. అర్హతలు అన్నీ ఆమెకు ఉన్నాయి. కాని యాడ్ కింద 'స్త్రీలు అప్లై చేయాల్సిన పని లేదు' అని ఉంది. అప్పుడు సుధామూర్తికి ఆగ్రహం వచ్చింది. రోషం కలిగింది. జె.ఆర్.డి.టాటాకు ఒక కార్డు గీకి పడేసింది. 'దేశంలో ఉన్న ఇంతమంది స్త్రీలకు పని చేసే హక్కు లేకపోతే వారు ఎలా అభివృద్ధిలోకి వస్తారు?' అని ప్రశ్న. ఆ కార్డు జె.ఆర్.డి. టాటాకు చేరింది. ఆ వెంటనే ఆమెకు ఇంటర్వ్యూకు పిలుపు, ఆపై ఉద్యోగం వచ్చాయి. పూణెలో సుధామూర్తి తొలి ఉద్యోగం చేసింది. ఆమె రాసిన లేఖను టాటా సంస్థ నేటికీ భద్రపరిచి ఉంచింది. 1974లో టెల్కోలో సుధామూర్తి ఒక్కతే మహిళా ఉద్యోగి. దాదాపు 50 ఏళ్ల తర్వాత సుధామూర్తి పూణెలో ఆ సంస్థను సందర్శిస్తే (ఇప్పుడు టాటా మోటార్స్) 900 మంది మహిళా ఉద్యోగులు ఉన్నారు. 'నేను అక్కడ నిలబడి మా తండ్రిని తలుచుకుని ఉద్వేగంతో కన్నీరు కార్చాను. ఎవరు భయపెట్టినా నన్ను ఆయన చదివించాడు. నా వల్ల ఇవాళ ఇంతమంది మహిళలు ఉద్యోగాల్లో ఉన్నారు అని' అందామె.

జీవితం అంతులేని పోరాటం

'జీవితం అంటే అంతులేని పోరాటం. ఎవరికీ ఏ వయసులో ఉన్నా కన్సెషన్ ఉండదు. పోరాటం చేయాలి. ఓడిపోయినా పోరాట అనుభవం మిగులుతుంది. జీవితంలో ఎన్నో సంఘటనలు ఎదురవుతాయి. క్షమిస్తే మంచిది. మర్చిపోతే ఇంకా మేలు. కాని ముందుకు సాగడమే అన్నింటికన్నా ఉత్తమమైనది. చిన్న చిన్న ఆనందాలు జీవితాన్ని మెరిపిస్తాయి. ప్యాషన్‌తో పని చేయడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేదు. ఒక మనిషిని పైకి తెచ్చేది డబ్బు కాదు ప్యాషన్. నమ్మిన పనిని విలువలతో ఆచరిస్తే ఎవరైనా పైకి రావాల్సిందే' అంటుందామె.

రాజ్యసభ సభ్యురాలు

'ఇది ఊహించలేదు. రాష్ట్రపతి నన్ను రాజ్యసభకు నామినేట్ చేశారు. దీని గురించి నేను కూచుని ఆలోచించాలి. అర్థం చేసుకోవాలి. ఏం చేయగలనో అంతా చేయాలి. ఇప్పుడు నేను భారత ప్రభుత్వ 'సేవకురాలిని' అని కొత్త బాధ్యతకు సిద్ధమవుతోంది సుధామూర్తి.

ఆత్మబలం

'చీకటిని చూసి విచారించవద్దు. అదిగో చిరుదీపం' అంటుంది ఆశావాదం.
'ఏమీ లేదని బాధ పడవద్దు. నేనే నీ ఆయుధం, బలం' అంటుంది ఆత్మవిశ్వాసం.
ఆశావాదం వెల్లివిరిసే చోట ఆత్మవిశ్వాసం ఉంటుంది.
జయంతి బురడ, రాణిమా దాస్, మలీషా ఖర్వాలకు ఘనమైన కుటుంబ నేపథ్యం లేదు.
'జీరో' నుంచి ప్రయాణం ప్రారంభించిన వీరు తమను తాము తీర్చిదిద్దుకుంటూ 'హీరో'లుగా పేరు తెచ్చుకున్నారు.
ఫోర్బ్స్ ఇండియా టాప్ సెల్ఫ్-మేడ్ ఉమెన్ 2024 (డబ్ల్యూ-పవర్ లిస్ట్)లో చోటు సాధించారు...

శ్రామికలోక శక్తిమంతులు

గిరిజన గొంతుక



జయంతి బురుడ

గిరిజన మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసు రావడానికి జర్నలిస్ట్ కావాలనుకుంది అడవి బిడ్డ జయంతి బురుడ. అయితే ఇంట్లో మాత్రం 'చదివింది చాలు' అనే మాట ఎప్పుడూ వినిపించేది. దీంతో ఇంటిని విడిచిపెట్టి స్నేహితుల సహాయంతో ఒడిషా సెంట్రల్ యూనివర్శిటీలో జర్నలిజంలో డిగ్రీ చేసింది. ఒడిషాలోని మల్కన్‌గిరి జిల్లాలోని సెర్పల్లి ఆమె స్వగ్రామం.

2015లో భువనేశ్వర్‌లోని కళింగ టీవీ న్యూస్ చానల్ రిపోర్టర్‌గా చేరిన జయంతి బురుడ జర్నలిస్ట్‌గా పెద్ద పేరు తెచ్చుకుంది. తన రిపోర్టింగ్ టూర్‌లలో గిరిజనులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, మౌలిక సదుపాయాల లేమిపై దృష్టి పెట్టడమే కాదు వాటి పరిష్కారానికి కూడా కృషి చేసింది. ఆడపిల్లల చదువు, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 2018లో 'బడా దీదీ యూనియన్' అనే స్వచ్ఛంద సంస్థను మొదలుపెట్టింది. 'బడా దీదీ యూనియన్' ద్వారా గిరిజన మహిళల కోసం ఎన్నో అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించింది.

తమను వేధిస్తున్న సమస్యలపై గిరిజన మహిళలు ధైర్యంగా గొంతు విప్పలేకపోవడాన్ని జయంతి గ్రహించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి, ధైర్యంగా గొంతు విప్పడానికి 2022లో 'జంగిల్ రాణి' పేరుతో వేదిక ప్రారంభించింది. 'మన కథ- మన కోసం' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇది.

మల్కన్‌గిరిలోని ఏడు బ్లాక్‌లకు చెందిన యాభై మంది గిరిజన మహిళలు ఈ ప్లాట్‌ఫామ్‌ను నిర్వహిస్తున్నారు. స్క్రిప్ట్‌లు రాయడం, వీడియోలు చిత్రీకరించడం, ఎడిటింగ్....మొదలైవాటిని వీరికి నేర్పించింది బురుడ.

సంస్కృతి నుంచి తాము ఎదుర్కొంటున్న సమస్యల వరకు చేతిలోని సెల్‌ఫోన్‌తో వీడియో స్టోరీలు చేస్తున్నారు గిరిజన మహిళలు. ఈ స్టోరీలను 'జంగిల్ రాణి' ఫేస్‌బుక్ పేజీలో అప్‌లోడ్ చేస్తారు. గిరిజన సమాజానికి, అడవులు, జీవవైవిధ్యానికి ఉన్న సంబంధానికి అద్దం పట్టే సహజ కథనాలు ఇవి.

ఎంతోమంది సాధారణ మహిళలలో అసాధారణ ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో ఎంతో కృషి చేసింది జయంతి బురుడ.

ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్



మలీషా ఖర్వా

'ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్'గా పేరు సంపాదించిన మలీషా ఖర్వా ఫోర్బ్స్ ఇండియా ఉమెన్-పవర్ 2024 జాబితాలో చోటు సాధించిన అత్యంత పిన్న వయస్కురాలిగా నిలిచింది. హాలీవుడ్ యాక్టర్ రాబర్ట్ హాఫ్‌మన్‌తో కలిసి నటించిన తరువాత మలీషా జీవితం మారిపోయింది. ముంబైలోని ధారవి మురికివాడలో ఒక గుడిసెలో నివసిస్తున్న మలీషా రాబర్ట్ హాఫ్‌మన్ దృష్టిలో పడింది.

ఆ అమ్మాయిలోని వెలుగేదో రాబర్ట్‌ను ఆకట్టుకుంది. 'ఈ మట్టిలో మాణిక్యాన్ని వెలుగులోకి తీసుకురావాలి' అనుకున్నాడు. మోడల్, డ్యాన్సర్ కావాలన్న మలీషా కలను సాకారం చేసేందుకు తన వంతు సాయం అందించాడు. మలీషాకు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో 4,50,000 మంది ఫాలోవర్‌లు, 88,700 మంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. పీకాక్ మ్యాగజైన్ కవర్ పేజీపై మెరిసిన మలీషా లగ్జరీ ఇండియన్ కాస్మోటిక్స్ బ్రాండ్ ఫారెస్ట్ ఎసెన్షియల్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తోంది. పదహారు సంవత్సరాల మలీషా ఖర్వా మోడల్, కంటెట్ క్రియేటర్‌గా మంచి పేరు తెచ్చుకుంది.

'కల నిజం చేసుకోవడానికి పేదరికం ఎంతమాత్రం అడ్డు కాదు' అని నిరూపించిన మలీషా ఎంతో మంది అమ్మాయిలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

అంగన్‌వాడీ అక్క




రాణిమా దాస్

దేశంలోని 23 లక్షల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌ల ప్రతినిధిగా రాణిమా దాస్‌ను ఫోర్బ్స్ ఇండియా 'ఉమెన్ పవర్ లిస్ట్ 2024'లో చోటు కోసం ఆల్ ఇండియా అంగన్ వాడీ వర్కర్ ఫెడరేషన్ నామినేట్ చేసింది. అస్సాంలో పరభోవా గ్రామానికి చెందిన రాణిమా దాస్ ఎవరికి ఏ సమస్య వచ్చినా 'నేను ఉన్నాను' అంటూ ముందుకు వచ్చేది. సమస్యల పరిష్కారంతో పాటు మహిళలకు ఆరోగ్యానికి సంబంధించిన సలహాలు ఇవ్వడంలో మంచి పేరు తెచ్చుకుంది. అంకితభావం, నిబద్ధతతో వ్యవహరించే రాణిమాను 'అక్కా' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకుంటారు. గత పదిహేడేళ్లుగా పిల్లలను బడిలో చేర్పించడం, గర్భిణి స్త్రీలకు సూచనలు...మొదలైన ఎన్నో విషయాల్లో కృషి చేస్తోంది రాణిమా దాస్. సలహాలు, సహాయం విషయంలో ముందు ఉన్నట్లే పోరాట విషయంలో ముందుంటుంది. అస్సాం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెండ్ అయిన రాణిమా దాస్ అంగన్‌వాడీ వర్కర్‌ల వేతన పెంపుదల కోసం పోరాటం చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేటు పరం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. 'ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎప్పుడూ పోరాడతాం' అంటున్న రాణిమా దాస్‌కు పోరాటం కొత్త కాదు.

సమాజాన్ని అద్దంలో చూపించాను

'దేర్ ఐ వజ్, మీడియా మ్యూజింగ్స్' పేరుతో తన జర్నలిస్ట్ జీవితాన్ని పాఠకుల ముందు ఆవిష్కరించారు అరుణా రవికుమార్. ముప్పై ఎనిమిదేళ్ల కిందట 'అరుణా అశోకవర్ధన్' పేరుతో తొలిసారి బైలైన్ చూసుకోవడం నుంచి నేటి వరకు సాగిన అక్షరయానాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.





అరుణా రవికుమార్

''నేను మీడియా రంగంలోకి రావడమే ఒక ఆశ్చర్యం. నా చదువు ఇంగ్లిష్ మీడియంలో, గ్రాడ్యుయేషన్ సైన్స్‌లో సాగింది. అమ్మ రచయిత కావడంతో తెలుగు సాహిత్యం మీద అభిరుచి మెండుగా ఉండేది. నా లక్ష్యం సివిల్స్. ప్రిలిమ్స్ క్లియర్ అయింది. మెయిన్స్ పరీక్షల నాటికి తాతగారు పోవడంతో రాయలేకపోయాను. ఆ తర్వాత అనుకోకుండా ఓ ఇంగ్లిష్ పత్రికలో జర్నలిస్టుగా చేరాను. నా తొలి రిపోర్టింగ్ జస్టిస్ చల్లా కొండయ్య కమిషన్ రిపోర్ట్ మీద. బై లైన్‌తో వచ్చింది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినట్లు, ప్రపంచ విజేతనైన భావన. అలా మొదలైన నా జర్నీ ఎలక్ట్రానిక్ మీడియాకు మారింది. తెలుగులో ప్రైవేట్ టీవీ రంగంలో రిపోర్టర్ బాధ్యతలు నిర్వర్తించిన తొలి మహిళను. పెళ్లి చేసుకున్న తర్వాత విజయవాడకు బదిలీ కావడం కూడా చాలా కీలకమైన అనుభవాన్నిచ్చింది. అది 1988, మార్చి నెల పదవ తేదీ. విజయవాడ వెళ్లిన తొలి రోజు, దేవినేని మురళి హత్య. సూపర్ మార్కెట్‌లో ఉన్నాను. ఓ కుర్రాడు పరుగున లోపలికి వచ్చి షట్టర్ వేసేశాడు. భయం కలిగినప్పటికీ నిబ్బరంగా ఉండిపోయాను. ఓ అరగంట తర్వాత షట్టర్ తీశారు. రోడ్డు మీదకు వస్తే... అంతకు ముందు ఏమీ జరగనట్లు తుపాను తర్వాత ప్రశాంతతలా ఉంది వాతావరణం. జర్నలిస్టుగా కొత్త ప్రపంచాన్ని చూశాను. చీరాలలో చేనేతకారుల ఆకలి చావులను రిపోర్ట్ చేయగలిగాను. సమాజంలో వేళ్లూనికొని ఉన్న ఆవేదనలు, ఆందోళనలకు అద్దం పట్టాను. ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టు సాంబశివుడి ఇంటర్వ్యూ చేశాను. ఎలిమినేటి మాధవరెడ్డి గారి హత్యకు కొద్దిగా ముందు ఆయనతోపాటు వారి వాహనంలోనే ప్రయాణించాను. అప్పటికే రెక్కీ నిర్వహించి హత్యకు ప్రణాళిక సిద్ధంగా ఉందని ఆ తర్వాత నాకు తెలిసింది. బళ్లారిలో ఎన్నికలను కవర్ చేశాను. భ్రూణహత్యల మీద పరిశోధనాత్మక కథనాలకు యూనిసెఫ్ అవార్డు వచ్చింది. స్టూడియో లో ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల ఇంటర్వ్యూలు ఎన్ని చేసినప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలనా కథనాలు ఎక్కువ సంతోషాన్నిస్తాయి. ఫ్లోరోసిస్ బాధితుల కథనాలకు స్పందనగా ప్రభుత్వాలు నీటి సౌకర్యాన్ని కల్పించడం రిపోర్టర్‌గా నాకు అత్యంత సంతోషాన్నిచ్చిన సందర్భం. లంబాడా తండాల్లో ఆడపిల్లలను పుట్టగానే చంపేయడం, కుటుంబాన్ని పోషించడానికి ఓ మహిళ మూడుసార్లు సరోగసీ ద్వారా బిడ్డను కని అనారోగ్యం పాలు కావడం వంటి కథనాలెన్నింటికో నేను అక్షరసాక్షిని కావడం ద్వారా నాకు ఈ రంగం ఎంతో సంతృప్తినిచ్చింది. మా వారి బదిలీల రీత్యా, పిల్లలు పుట్టినప్పుడు, వాళ్ల చదువులు కీలక దశల్లో ఉన్నప్పుడు కెరీర్‌లో విరామాలు తీసుకుంటూ నా వృత్తిని కొనసాగిస్తున్నాను. మల్టీ లెవెల్ మార్కెటింగ్ మీద 'మరాడర్స్ ఆఫ్ హోప్' నా తొలి రచన. 'దేర్ ఐ వజ్, మీడియా మ్యూజింగ్స్' నా రెండవ రచన. ఇండిపెండెంట్ జర్నలిస్టుగా హైదరాబాద్‌లో ప్రశాంతంగా జీవిస్తున్నాను. ఇప్పటికీ రోజూ చదువుతాను, రాస్తుంటాను. మహిళ ఎన్ని సాధించినప్పటికీ సమాజంలో సమానత్వం మాత్రం పూర్తిస్థాయిలో రాలేదనే చెప్పాలి. అయితే నా చిన్నప్పటికీ ఇప్పటికీ చాలా తేడా ఉంది. అప్పట్లో సమాజంలో స్త్రీ–పురుషుల మధ్య అసమానత్వం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు అంత తీవ్రంగా లేదు. కానీ సమానత్వం మాత్రం ఇంకా రాలేదు'' అంటూ తన అక్షరయానం గురించి వివరించారు అరుణ.

– ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి; ఫొటో: అనిల్‌కుమార్ మోర్ల



డ్రైవర్ గంగవ్వ!



నచ్చిన పనిని ఎంచుకున్నా!

ఇంటర్మీడియెట్ పూర్తవుతూనే పెళ్లి చేసి అత్తారింటికి పంపించారు. అక్కడ వాతావరణం ఎందుకో నాకు సరిపడదు అనిపించింది. వారం రోజులు కూడా గడవకముందే ఇంటికి వచ్చేశాను. అమ్మనాన్నలకు భారం కాకూడదని నిర్ణయించుకున్నా. నాకు బాగా నచ్చిన పని మీద దృష్టి పెట్టాను. డ్రైవింగ్ సొంతంగానే నేర్చుకున్నాను. రైస్‌మిల్ ఆపరేటర్‌గా పనిచేస్తూనే ట్రాక్టర్, లారీ, కారు.. డ్రైవింగ్ నేర్చుకున్నాను. కొందరు విచిత్రంగా చూసేవారు. కొందరు మగరాయుడు అనేవారు. ఎవరు ఏమనుకున్నా నా కష్టం మీద నేను బతకాలనుకుని నచ్చిన పనిచేసుకుంటూ వెళుతున్నాను.

– గంగవ్వ, సజ్జన్‌పల్లి, లింగంపేట మండలం, కామారెడ్డి జిల్లా

పంచాయతీ ట్రాక్టర్‌ను నడుపుతుంది.
లారీ మీద, బైక్ మీద సవారీ చేస్తుంది.
పంటల సాగులోనూ అందెవేసిన చేయి
కష్టాలను ఎదిరించి సొంత కాళ్ల మీద నిలబడింది.
కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం సజ్జన్‌పల్లి గ్రామంలో గంగవ్వ గురించి అడిగితే 'ఎవరు?' అంటారేమో గానీ...
డ్రైవర్ గంగవ్వ.. అంటే అందరికీ తెలుసు.

ప్రతిరోజూ పంచాయతీ ట్రాక్టర్‌ను తీసుకుని గల్లీల్లో చెత్త సేకరణ తో పొద్దున్నే అందరినీ పలకరిస్తూ వెళుతుంది గంగవ్వ. ట్రాక్టర్ ఒక్కటే కాదు లారీ, ఆటో, కారు ఏదైనా నడపగలదు. బైక్ మీద సవారీ చేయగలదు. సొంత కాళ్ల మీద నిలబడిన గంగవ్వ ఎందరికో ఆదర్శంగా నిలిచింది.

చదువుకుంటూనే డ్రైవర్‌గా!

సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన పుట్టి నాగయ్య, సాలవ్వల కూతురు గంగవ్వ. శెట్పల్లి సంగారెడ్డిలో పదో తరగతి వరకు చదువుకుంది. లింగంపేట మండల కేంద్రానికి వెళ్లి ఇంటర్ చదివింది. దూరభారాలు అని చూడకుండా సైకిల్ మీద సవారీ చేస్తూ వేరే ఊళ్లలో చదువుకుంది. పేద కుటుంబం కావడంతో సెలవు దినాల్లో కూలి పనులకు వెళ్లేది. అమ్మానాన్నలకు చేదోడువాదోడుగా ఉండేది. ఈ క్రమంలోనే బైకు నేర్చుకుంది. తరువాత ట్రాక్టర్ నడపడం నేర్చుకుంది. లారీ డ్రైవర్‌గానూ పనిచేసింది.





గ్రామ పంచాయితీ పనుల్లో...

గంగవ్వకు తల్లిదండ్రులు పెళ్లి చేశారు. వారం రోజులు తిరక్కుండానే వెనుదిరిగి వచ్చేసి, తల్లిగారింట్లోనే ఉండిపోయింది. అప్పటి నుంచి ఇంటి దగ్గరే ఉంటూ వ్యవసాయ పనులకు వెళ్లేది. అలాగే ట్రాక్టర్, కారు, లారీ డ్రైవర్‌గా వెళ్లి వచ్చేది. నాలుగేళ్ల పాటు రైస్‌మిల్‌లో ఆపరేటర్‌గా కూడా పనిచేసింది. ఐదేళ్ల కిందట పంచాయతీలకు ప్రభుత్వం ట్రాక్టర్లు, ట్యాంకర్లు సరఫరా చేయడంతో గ్రామంలో డ్రైవింగ్ లైసెన్సు ఉన్న వాళ్లు దొరకలేదు. అప్పటికే భారీ వాహనాలు నడిపే సామర్థ్యంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉండడంతో పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా నియమించారు. అప్పటి నుంచి పంచాయతీలో పనిచేస్తోంది.

రోజూ చెత్త సేకరణ నుంచి రకరకాల పంచాయితీ పనుల్లో చురుగ్గా పాల్గొంటుంది. నిచ్చెన సాయంతో స్తంభం ఎక్కి విద్యుత్తు దీపాలను సరిచేస్తుంది. పంచాయతీలో ఏ పని ఉన్నా ఇట్టే చేసిపెడుతుంది. మొదట్లో ఆమెకు పంచాయతీ నుంచి రూ.2,500 వేతనం ఇచ్చేవారు. క్రమంగా పెరుగుతూ వచ్చి ఇప్పుడు రూ.8,500 వేతనం ఇస్తున్నారు. ట్రాక్టర్ అవసరం ఎప్పుడు ఏర్పడినా సరే గంగవ్వ పరుగున వెళ్లి ట్రాక్టర్ తీస్తుంది. నాలుగేళ్ల కిందట తండ్రి నాగయ్య చనిపోయాడు. తల్లి సాలమ్మతో కలిసి ఉంటుంది. అన్న కొడుకుని చదివించింది. అతను ఇప్పుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు.

వ్యవసాయ పనులు

గంగవ్వ డ్రైవర్‌గా పనిచేస్తూనే వ్యవసాయ పనులు చేస్తోంది. తనకు సొంత భూమి లేకపోవడంతో వేరేవాళ్ల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తోంది. వెళ్లి దున్నడం, నాటు వేయడం, కలుపుతీయడం వంటి పనులన్నీ సొంతంగా చేసుకుంటుంది. లింగంపేట మండల కేంద్రానికి వెళ్లాలన్నా, ఎల్లారెడ్డి పట్టణానికి వెళ్లాలన్నా గంగవ్వ బైకు మీదనే ప్రయాణం చేస్తుంది. 'ఎవరిపైనా ఆధారపడకుండా బతకడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేద'నే గంగవ్వ మాటలు నేటి తరానికి స్ఫూర్తి కలిగిస్తాయి.

– ఎస్.వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి

● మహిళల ఆరోగ్యం

లైఫ్@360

మిమ్మల్ని మీరు పట్టించుకోండి!

కుటుంబ సభ్యులందరికీ కావలసిన వాటిని అమర్చడంలో పడి మహిళలు తమ ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించరు. దీనివల్ల అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ప్రయోజనం ఉండదని అందరికీ తెలిసిందే. అందువల్ల ముందే మేలుకొనడం అవసరం.




నిన్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలు జరుపుకునే ఉంటారు. అయితే అంత కన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే మహిళలు తమ ఆరోగ్యంపై కాస్త శ్రద్ధ పెట్టి సమయం కేటాయించడం. తమ వయసుకు తగ్గ పోషకాహారం తీసుకోవడం. అనారోగ్య సమస్యలను దాచిపెట్టకుండా తగిన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. మీరు ఆరోగ్యంగా ఉంటేనే...మీ కుటుంబం ఆరోగ్యంగా ఆనందంగా ఉంటుందని గుర్తు పెట్టుకోండి..



ఐరన్ ఉండే ఆహారం

మహిళలు తీసుకోవాల్సిన ముఖ్యమైన దానిలో ఐరన్ మొదటి స్థానంలో ఉంది. గర్భధారణ సమయంలో స్త్రీలకు ఐరన్ చాలా అవసరం. శరీరంలో ఐరన్ పరిమాణం తగ్గిపోవడం వల్ల రక్తహీనత ఏర్పడుతుంది. దీని వల్ల నీరసం, అలసట, ఊపిరి అందకపోవడం వంటి సమస్యలు వస్తాయి. అందువల్ల మీ ఆహారంలో మాంసకృత్తులు, చికెన్, సీఫుడ్, బీన్స్, కాయధాన్యాలు, బచ్చలి కూర, బ్రోకలీ, బీట్‌రూట్, దానిమ్మ, ఖర్జూరం, తృణధాన్యాలు వంటి ఐరన్ అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోవడం అలవాటు చేసుకోవాలి.



విటమిన్ ఎ తప్పనిసరి

మహిళలకు అవసరమైన విటమిన్ల జాబితాలో విటమిన్ ఎ ద్వితీయ స్థానంలో ఉంది. ఇది మహిళల పునరుత్పత్తి ఆరోగ్యానికి ముఖ్యమైన విటమిన్. ఆహారంలో విటమిన్ ఎ అధికంగా ఉండే ఆకుకూరలు, అరటి పండ్లు వంటివి తీసుకోవాలి.

విటమిన్ బి 12


విటమిన్ బి 12 అనేది జీవక్రియ కార్యకలాపాలను పెంచుతుంది. రక్తహీనతను నివారిస్తుంది, మహిళల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అందువల్ల బీ 12 సమృద్ధిగా ఉండే మాంసం, చేపలు, గుడ్లు తీసుకోవాలి. శాకాహారులు పొట్టు తియ్యని వేరుసెనగపప్పు, సెనగలు, దంపుడు బియ్యం, వెన్న తియ్యని పాలు (జంతువుల నుంచి వచ్చిన పాలు) వంటివి తీసుకోవాలి.






కాల్షియం

మహిళలు వయస్సు పెరిగేకొద్దీ, ఎముక సంబంధిత ఆరోగ్య సమస్యలను తరచు ఎదుర్కొంటారు. అందువల్ల, ఎముకల ఆరోగ్యానికి మహిళలు కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ముఖ్యం. ఇందుకోసం పాలు, గుడ్లు, నువ్వులు వంటివి తీసుకోవాలి.



విటమిన్ డి

ఈ జాబితాలో విటమిన్ డి తర్వాతి స్థానంలో ఉంది. విటమిన్ డి మన శరీరం కాల్షియాన్ని గ్రహించడంలో సహాయపడుతుంది. ఇది ఎముకలు, దంతాల పెరుగుదలకు సహాయపడుతుంది.



మెగ్నీషియం

మెగ్నీషియం కూడా స్త్రీలకు కావలసిన అతి ముఖ్యమైన పోషకం. కండరాల బలం ఎముకల ఆరోగ్యానికి మెగ్నీషియం అవసరం. మహిళలు మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం.



ఈ పరీక్షలు అవసరం

భారతదేశంలో మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు.. ఎన్నో గణాంకాలు స్త్రీలల్లో ఐరన్ లోపం ఉంది అని చెబుతున్నాయి. కనీసం 10 శాతం కూడా హిమోగ్లోబిన్ ఉండటం లేదు. ఈ పరిస్థితిని ఇలానే నిర్లక్ష్యం చేయడం వల్ల తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.. ముఖ్యంగా ఇది బ్లడ్ క్యాన్సర్‌కు కూడా దారితీస్తుంది. అందువల్ల అత్యవసరమైన సీబీపీ అంటే కంప్లీట్ బ్లడ్ పిక్చర్, థైరాయిడ్, విటమిన్ పరీక్షలు, కాల్షియం, కొలెస్ట్రాల్, ఐరన్ వంటి పరీక్షలను చేయించుకోవడం అవసరం.

హెల్త్ టిప్స్

- దంత సమస్యలు ఉన్నవారు.. నోటి దుర్వాసనతో బాధపడుతున్న వారు.. అల్లాన్ని ఎండబెట్టి పొడి చేసి దాంట్లో కాస్త నీరు కలిపి పేస్ట్‌లా చేసి దానితో పళ్లు తోముకుంటే చిగుళ్లు, దంతాలు దృఢంగా, ఆరోగ్యంగా మారుతాయి. నోటి దుర్వాసన తగ్గుతుంది.



- కొన్ని ఎండు ద్రాక్ష కొన్ని ధనియాలు నీరు పోసి మరిగించి చల్లార్చి ఆ కషాయాన్ని ఉదయం, సాయంకాలం తాగాలి. కీళ్ల వాపులు తగ్గి పోతాయి.
- సీజనల్ వ్యాధులను తగ్గించడంలో అల్లం బాగా పనిచేస్తుంది. కాస్త అల్లం ముక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీటిని పూటకు ఒక కప్పు మోతాదులో తాగుతుంటే దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యలు తగ్గుతాయి



- అల్లం రసం + కీర దోసకాయ రసం + నిమ్మకాయ రసం కలిపిన మిశ్రమాన్ని ప్రతి రోజు ఉదయం పూట తాగాలి. నొప్పులు, వాపులు తగ్గిపోతాయి.



- గచ్చకాయను పగలగొట్టి లోపలి పప్పును తీసుకుని నానబెట్టిన కొన్ని మెంతులను కలిపి కొన్ని చుక్కల నీరు కలిపి మెత్తగా నూరాలి. ఆ మిశ్రమాన్ని పడుకునేముందు కీళ్ల నొప్పులు, వాపు ఉన్న చోట రాసుకొని పడుకోవాలి. తెల్లవారేసరికి నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

పండంటి ఆరోగ్యం



నేటి కాలంలో 30 ఏళ్లు దాటితే చాలు కీళ్ల నొప్పులు ప్రారంభమవుతున్నాయి. ఈ పరిస్థితిలో వాటిని ఎదుర్కోవటానికి చాలామంది చాలా చిట్కాలు పాటిస్తున్నారు. కానీ ఎటువంటి ఫలితాలు ఉండటం లేదు. కానీ ఆహారంలో ఈ మూడు పండ్లను చేర్చుకుంటే మంచి ఉపశమనం ఉంటుంది. ఆ పండ్లేమిటంటే...



నారింజ: రోజూ నారింజను తినడం వల్ల శరీరంలో నీటి కొరత తీరుతుంది. ఇందులో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది కీళ్లనొప్పులని తగ్గించడంలో సహాయపడుతుంది.

ద్రాక్ష: వీలయినంత వరకు ద్రాక్షపండ్లను తీసుకోవడం ద్వారా అనేకరకాల వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. ముఖ్యంగా కీళ్ల నొప్పుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. చిన్నప్పటినుంచి పిల్లలకి ద్రాక్షపండ్లను తినిపించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి.



పుచ్చకాయ: వేసవి కాలంలో పుచ్చకాయ తినడం అన్ని విధాల శ్రేయస్కరం. దీనివల్ల శరీరంలో నీటి కొరత ఉండదు. తక్షణ శక్తి లభిస్తుంది. దీనిని తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి. ఎండాకాలం బయటికి వెళ్లే ముందు లేదా బయటి నుంచి వచ్చిన తర్వాత పుచ్చకాయ తీసుకుంటే మంచి ఉపశమనం ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు కీళ్లనొప్పులని తగ్గిస్తాయి.

ఉల్లి తీసుకోండి మళ్లీ మళ్లీ!

ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదని చిన్నప్పటి నుంచి విన్నదే. అయితే, దానివల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుంటే మాత్రం మనమే మరొకరికి చెబుతాం ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదని... ఇంతకీ ఉల్లి ఏం మేలు చేస్తుందో, ఎలా చేస్తుందో తెలుసుకుందాం.

- మజ్జిగ లేదా పెరుగుతో కలిసిన ఉల్లి శరీరానికి మంచిచేసే ఎన్నో పోషకాలనిస్తుందని పరిశోధనలలో వెల్లడైంది.
- పచ్చిఉల్లిని ప్రతిరోజూ 50 గ్రాముల మోతాదులో తింటే షుగర్ అదుపులో ఉంటుందని పరిశోధనల్లో తెలిసింది. అంతేకాదు, ఉల్లిని తినడం వల్ల ఎలాంటి దుష్ఫలితాలూ ఉండవు. దీనిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ సమస్య తగ్గి, హార్ట్‌స్ట్రోక్ ప్రమాదాలు తగ్గుతాయి.
- ఉల్లిగడ్డను సన్నని ముక్కలుగా కట్ చేసి ఆ ముక్కలను నీటిలో మరిగించి తాగుతుంటే మూత్రంలో మంట తగ్గుతుంది. ఉల్లిపాయను గుజ్జుగా చేసి 3 టేబుల్ స్పూన్ల వెనిగర్‌తో కలిపి తింటూ ఉంటే జీర్ణసంబంధిత సమస్యలు తగ్గి జీర్ణ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది.
- వచ్చి ఉల్లిపాయను రోజూ ఏదో ఒక రూపంలో తింటూ ఉంటే మహిళల్లో వచ్చే రుతుక్రమ సమస్య తగ్గిపోతుంది. పచ్చి ఉల్లిగడ్డ తినడం వల్ల బిపి, హార్ట్ అటాక్, ఆస్తమా, అలర్జీలు, ఇన్ఫెక్షన్లు, దగ్గు, నిద్రలేమి, స్థూలకాయం వంటి సమస్యలు రావు.



- రాత్రి పడుకునే ముందు పచ్చి ఉల్లిపాయ తింటే, వేసవిలో వడదెబ్బ ముప్పు తప్పుతుంది. దీనితోపాటు, పచ్చి ఉల్లిపాయలో వేసవి వేడి నుండి రక్షించే గుణాలు ఉన్నాయి.
- ఉల్లిపాయ రక్తాన్ని శుద్ధి చేస్తుంది. శరీరంలో ఉన్న విషాన్ని తొలగిస్తుంది. నిద్రకు ముందు పచ్చి ఉల్లిపాయ తినడం నిద్రలేమిని దూరం చేస్తుంది.
- జలుబు, కఫంలో ఉల్లిపాయ చాలా మేలు చేస్తుంది. ఉల్లి రసం, తేనె కలిపి తీసుకుంటే జ్వరం, జలుబు, దగ్గు, గొంతు నొప్పి త్వరగా తగ్గుతాయి. ఉల్లిపాయల్లో ఉండే విటమిన్ సి, కాల్షియం నోటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఉల్లి అనేకరకాల క్యాన్సర్ల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. దీనితోపాటు, ఉల్లిపాయ తినడం వల్ల కడుపు, పెద్దప్రేగు, రొమ్ము, ఊపిరితిత్తులు ప్రోస్టేట్ క్యాన్సర్ మొదలైనవి తగ్గుతాయి.
- ఉల్లి కీళ్లకు, గుండెకు మేలు చేస్తుంది. ఉల్లిగడ్డలు రక్తపోటు ను అదుపులో ఉంచుతాయి.
- బ్యాక్టీరియాల వల్ల కలిగే ఇన్ఫెక్షన్లు, డయేరియాల నుంచి కాపాడే ఆహారంలో ఉల్లిదే అగ్రస్థానం.. ఉల్లిలోని యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు అనేక వ్యాధుల నుంచి కాపాడతాయి. పచ్చిఉల్లిపాయను రోజు తింటే ఎముకల బలహీనతను అధిగమించవచ్చు. ఉల్లిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు జుట్టు సంబంధ సమస్యల్ని దూరం చేస్తాయి. ఉల్లి రసాన్ని మాడుకు పట్టించడం వల్ల జుట్టు రాలడంతోపాటు చుండ్రు సమస్యలు తగ్గుతాయి. జుట్టు పట్టు కుచ్చులా మెరుస్తుంది. జుట్టు పెరుగుతుంది.
- మూత్రపిండాలు, మూత్రాశయంలో రాళ్ల సమస్యతో బాధపడేవారికి ఉల్లి మంచి ఔషధం. ఉల్లిపాయలను సన్నగా తరిగి పెరుగులో కలిపి రోజూ ఉదయం తీసుకుంటే కిడ్నీలోని రాళ్లు కరిగిపోతాయి. తేనెటీగలు లేదా తేలు కుట్టినప్పుడుఉల్లి రసాన్ని రాస్తే సత్వర ఉపశమనం ఉంటుంది.

సినిమా



కుబేర ఫిక్స్

నాగార్జున, ధనుష్ హీరోలుగా ఓ మల్టీస్టారర్ మూవీ రూపొందుతోన్న విషయం తెలిసిందే. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్ యూనిట్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. కాగా మహా శివరాత్రి సందర్భంగా ఈ చిత్రానికి 'కుబేర' టైటిల్‌ని ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేసింది చిత్రబృందం. అయితే ధనుష్ లుక్ టైటిల్‌కి భిన్నంగా ఉంది. ధనుష్‌ని చూస్తే పొడవాటి గెడ్డం.. చిరిగిన పాత దుస్తుల్లో సాదా సీదా వ్యక్తిలా కనిపిస్తున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటివరకూ నాగార్జున పాత్ర తాలూకు అప్‌డేట్ ఇవ్వలేదు మేకర్స్. దీంతో ఆయన పాత్ర ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే ఆసక్తి అక్కినేని అభిమానుల్లో ఉంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలీ నారంగ్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: నికేత్ బొమ్మి.


● విష్ణు మంచు


కన్నప్ప గురి

విష్ణు మంచు హీరోగా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ మూవీలో మోహన్‌బాబు, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా శుక్రవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 'కన్నప్ప' ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. విల్లు గురిపెట్టిన కన్నప్పగా విష్ణు మంచు లుక్ విడుదలైంది. ''ఒక ధైర్యవంతుడైన యోధుడు, శివుని భక్తుడైన కన్నప్ప కథను 'కన్నప్ప'గా తెరపైకి తీసుకొస్తున్నాం. ఇంత గొప్ప పాత్రను అంతే గొప్పగా పోషిస్తున్నారు విష్ణు మంచు. ఫస్ట్ లుక్ పోస్టర్ కన్నప్ప క్యారెక్టర్‌లోని డెప్త్, ఇంటెన్సిటీ చూపిస్తోంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ మూవీ రూపొందుతుండగా అన్ని భాషల్లో రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వస్తోంది. 'కన్నప్ప' చిత్రం రెండో షెడ్యూల్ ప్రస్తుతం న్యూజిల్యాండ్‌లో జరుగుతోంది. అద్భుతమైన దృశ్య కావ్యంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● ప్రభాస్

పేరు భైరవ

మహా శివరాత్రి కానుకగా ప్రభాస్ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది 'కల్కి 2898 ఏడీ' చిత్ర యూనిట్. ఈ చిత్రంలో ప్రభాస్ పాత్ర పేరు భైరవి అని పేర్కొని, ఆయన లేటెస్ట్ లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీ కీలక పాత్రధారులు. వైజయంతీ మూవీస్‌పై అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. మహా శివరాత్రి సందర్భంగా భైరవ పాత్రని పరిచయం చేసి, కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా 'కల్కి 2898 ఏడీ' రూపొందుతోంది. మహాభారత పురాణ ఘటనల నుండి మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యే కథ ఇది. గతం, భవిష్యత్తుతో ముడిపడిన ఆరు వేల ఏళ్ల వ్యవధిలో ఈ చిత్రకథ నడుస్తుంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోంది. అక్కడి అందమైన ప్రదేశాల్లో ప్రభాస్, దిశా పటానీలపై ఒక పాటను చిత్రీకరిస్తున్నాం'' అన్నారు మేకర్స్.


● తమన్నా

దుష్టశక్తుల నుండి ఎలా కాపాడారు?

తమన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'ఓదెల 2'. హీరోయిన్ హెబ్బా పటేల్ లీడ్ రోల్‌లో నటించిన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకి సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. అశోక్ తేజ దర్శకత్వంలో డైరెక్టర్ సంపత్ నంది క్రియేటర్‌గా ఈ మూవీ రూపొందుతోంది. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్‌లపై డి. మధు నిర్మిస్తున్నారు. శివరాత్రి కానుకగా 'ఓదెల 2' నుంచి శివ శక్తిగా తమన్నా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఒక చేతిలో దండకం, మరో చేతిలో డమరుకంతో నాగ సాధువు వేషంలో కనిపించారు తమన్నా. ''ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా కాపాడారు? అనే అంశంతో 'ఓదెల 2' తెరకెక్కుతోంది. అత్యధిక బడ్జెట్‌తో బహు భాషల్లో ఈ మూవీ రూపొందుతోంది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం కాశీలో జరుగుతోంది. శివ శక్తి పాత్ర కోసం తమన్నా పూర్తిగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. యూనివర్సల్ అప్పీల్ ఉండే ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్. సింహ, యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్. ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

నాకు నేనే కొత్తగా అనిపించాను - సుహాస్

''ప్రసన్న వదనం' సినిమా చాలా బావుంటుంది. ఈ మూవీలో నాకు నేనే కొత్తగా అనిపించాను. డైరెక్టర్ సుకుమార్‌గారి అసోసియేట్ అయిన అర్జున్‌గారు సినిమా చెప్పే విధానం సుకుమార్‌గారిలానే ఉంటుంది. 'ప్రసన్న వదనం' పక్కాగా బ్లాక్ బస్టర్ అయ్యే సినిమా.. అందులో ఎలాంటి అనుమానం లేదు'' అని సుహాస్ అన్నారు. అర్జున్ వైకె దర్శకత్వంలో సుహాస్ హీరోగా, పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రసన్న వదనం'. జేఎస్ మణికంఠ, టీఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా టీజర్ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ సాయి రాజేశ్ మాట్లాడుతూ– ''టీజర్ అద్భుతంగా ఉంది. కథలోని పాయింట్ అదిరిపోయింది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ''మా గురువు సుకుమార్‌గారి వద్ద నేర్చుకున్న జ్ఞానం నాకు చాలా సహాయపడింది. 'ప్రసన్న వదనం' చాలా సూపర్‌గా వచ్చింది'' అన్నారు అర్జున్ వైకె. ''త్వరలోనే ఈ మూవీని విడుదల చేస్తాం'' అన్నారు జేఎస్ మణికంఠ, టీఆర్ ప్రసాద్ రెడ్డి.


● రాశీ సింగ్, సుహాస్, పాయల్

తెలుగులోనూ అంతే హిట్! - 'దిల్' రాజు

''ప్రేమలు' సినిమా మలయాళంలో ఫిబ్రవరి 9న విడుదలై సెన్సేషనల్ హిట్ అయ్యింది. ఇది మలయాళ సినిమా అయినప్పటికీ 90 శాతం చిత్రీకరణ హైదరాబాద్‌లోనే జరిగింది. శుక్రవారం తెలుగులో విడుదలైన ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ స్పందన చూస్తుంటే మలయాళంలో ఎంత పెద్ద హిట్ అయ్యిందో తెలుగులోనూ అంతే హిట్ అవుతుందనిపిస్తోంది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. నస్లేన్ కె. గఫూర్, మాథ్యూ థామస్, మమిత బైజు, శ్యామ్ మోహన్ కీలక పాత్రల్లో గిరీష్ ఏడీ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమలు'. ఫాహద్ ఫాజిల్, దిలీష్ పోతన్, శ్యామ్ పుష్కరన్ నిర్మించిన ఈ మూవీ మలయాళంలో హిట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తనయుడు ఎస్ఎస్ కార్తికేయ తెలుగు ప్రేక్షకులకు అందించారు. శుక్రవారం ఈ మూవీ రిలీజైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కార్తికేయ మాట్లాడుతూ– ''కుటుంబమంతా కలిసి చూసే చిత్రమిది. ఈమూవీ డైలాగ్స్‌ను ఏడెనిమిది రోజుల్లో రాసి డబ్బింగ్ కూడా పూర్తి చేసిన ఆదిత్యకి ధన్యవాదాలు'' అన్నారు.


● కార్తికేయ, 'దిల్' రాజు


● రుహానీ శర్మ

మనసుని హత్తుకునేలా...

రుహానీ శర్మ, సుహాస్, కార్తీక్ రత్నం, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శ్రీరంగ నీతులు'. వెంకటేశ్వర రావు బల్మూరి నిర్మించిన ఈ సినిమాని ఏప్రిల్ 12న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'శ్రీరంగ నీతులు'. యువతరం భావోద్వేగాలు, సహజంగా సాగే మాటలు, మనసుని హత్తుకునే సన్నివేశాలు ఉంటాయి. కొత్తదనంతో పాటు వాణిజ్య అంశాలతో రూపొందిన మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు. ''నేటి యువత ఆలోచనలు, కుటుంబ బంధాలు, వినోదం.. ఇలా అన్ని అంశాల కలయికతో అందర్నీ అలరించేలా ఈ మూవీని తెరకెక్కించాడు దర్శకుడు'' అన్నారు వెంకటేశ్వరరావు బల్మూరి. ఈ చిత్రానికి కెమెరా: టీజో టామీ, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, అజయ్ అరసాడ.

ప్రేమికుడు సిద్ధం


● నగ్మా, ప్రభుదేవా

ప్రేక్షకుల ముందుకు మరోసారి వచ్చేందుకు ప్రేమికుడు సిద్ధం అవుతున్నాడు. ప్రభుదేవా హీరోగా, నగ్మా హీరోయిన్‌గా రూపొందిన చిత్రం 'ప్రేమికుడు' (తమిళంలో 'కాదలన్'). శంకర్ దర్శకత్వం వహించిన ఈ మూవీ 1994లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ మూవీలోని 'ముక్కాలా ముక్కాబులా', 'ఊర్వశి ఊర్వశి', 'ఓ చెలియా నా ప్రియ సఖియా', 'అందమైన ప్రేమరాణి'.. వంటి పాటలన్నీ యువతను ఉర్రూతలూగించాయి. క్లాసిక్ హిట్‌గా రూపొందిన 'ప్రేమికుడు' తెలుగులో రీ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. తెలుగు రీ రిలీజ్ హక్కులను నిర్మాతలు మురళీధర్ రెడ్డి, రమణ దక్కించుకున్నారు. సీఎల్ఎన్ మీడియా ద్వారా త్వరలో సినిమా రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. అతి త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని నిర్మాతలు పేర్కొన్నారు.

అందుబాటు గృహాలకు స్థలాలు కేటాయించండి!

ప్రభుత్వానికి క్రెడాయ్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: సామాన్య, మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను నిజం చేయాలంటే అందుబాటు గృహాలను నిర్మించాలి. చందన్‌వెల్లి, కొత్తూరు వంటి పలు ప్రాంతాలలో తయారీ రంగం అభివృద్ధి చెందింది. ఆయా ప్రాంతాలలో రూ.50 లక్షల లోపు ధర ఉండే అఫర్డబుల్ హౌసింగ్‌కు డిమాండ్ ఉంది. కానీ, స్థలాలు అందుబాటులో లేవు. ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను కల్పించడంతో పాటు స్థలాలను అందించాలని'' భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఐటీ, ఫార్మా రంగాలతో అభివృద్ధి పశ్చిమ హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైంది. దీంతో ఆయా ప్రాంతాలలో లగ్జరీ ప్రాజెక్ట్‌లు ఎక్కువగా వస్తున్నాయి. ధరలు ఎక్కువగా ఉండటంతో సామాన్యుని సొంతింటి కల మరింత భారంగా మారిందని, దీనికి పరిష్కారం అందుబాటు గృహాల నిర్మాణమేనని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఓఆర్ఆర్ చుట్టూ స్థలాలను గుర్తించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ఈ ప్రాజెక్ట్‌లను నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఆయా గృహాలను విక్రయిస్తామని పేర్కొన్నారు.



రిజిస్ట్రేషన్ ఛార్జీలను తగ్గించాలి

మహిళా గృహ కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతానికి తగ్గించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో ఈ పథకం అమలు చేశారని గుర్తు చేశారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డుల మధ్య రేడియల్ రోడ్లు, లింక్ రోడ్లను నిర్మించాలని కోరారు. ప్రస్తుతం నిర్మాణ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు మాత్రమే చేస్తున్నామని, అనుమతులు మాత్రం భౌతికంగానే జారీ అవుతున్నాయని తెలిపారు. అనుమతులను కూడా ఆన్‌లైన్‌లో జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోరుకున్నట్టు కొత్తిల్లు

- గౌడవెల్లిలో డిజైనర్ విల్లాలు
- కస్టమర్ల అభిరుచికి తగ్గట్లు నిర్మాణం



సాక్షి, హైదరాబాద్: డిజైనర్ దుస్తులు, డిజైనర్ బైక్స్ గురించి మనకు తెలిసిందే. కానీ, నిర్మాణ రంగంలోనూ డిజైనర్ విల్లాలకు శ్రీకారం చుట్టింది సాకేత్ గ్రూప్. ఇప్పటికే కాప్రాలో సాకేత్ కస్టమైజ్డ్ విల్లాలను నిర్మించి కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందించిన ఈ సంస్థ.. తాజాగా గౌడవెల్లిలో ఇదే తరహా డిజైనర్ లగ్జరీ విల్లాలను నిర్మిస్తోంది. కొనుగోలుదారుల అభిరుచులకు తగ్గట్టు విల్లాల నిర్మాణం ఉండటం వీటి ప్రత్యేకత.

6 ఎకరాలలో వేద డిజైనర్ విల్లాలు..

భూఃసత్వా ప్రాజెక్ట్‌లో ఫేజ్-3లో 6.5 ఎకరాలలో 60 విల్లాలను నిర్మిస్తుంది. ఒక్కో విల్లా 293 నుంచి 430 గజాలలో ఉంటుంది. ప్రారంభ ధర రూ.4 కోట్లు. ఒక్కో విల్లా ఒక్కో ఎలివేషన్స్‌తో ఇండిపెండెంట్ హౌజ్‌లాగా డిజైన్స్ ఉంటాయి. నివాసితులు వాళ్ల అవసరాలకు అనుగుణంగా గదుల విస్తీర్ణం పెంచడం, తగ్గించడం చేసుకోవచ్చు. ఇంటి నుంచి పని చేసుకునేందుకు ఆఫీసు స్పేస్ ఏర్పాటు చేయడం వంటి అన్ని వసతులను కల్పిస్తారు.

భూఃసత్వా ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

గౌడవల్లిలో 75 ఎకరాలలో భూఃసత్వా పేరిట ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను నిర్మిస్తుంది. దీనిలో విల్లాలు, రిటైర్మెంట్ హోమ్స్, ఓపెన్ ప్లాట్లు ప్రాజెక్ట్‌లుండటమే దీని ప్రత్యేకత.

- ఫేజ్-1లో 22.5 ఎకరాలలో 220 విల్లాలను నిర్మించారు. ఫేజ్-2లో 16.5 ఎకరాలలో 171 విల్లాలను నిర్మిస్తున్నారు. హ్యాండ్‌ఓవర్ ప్రారంభమైంది. ఫేజ్-4 లో 7 ఎకరాలలో 70 విల్లాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 50కి పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి.
- 28 వేల చ.అ.లలో కామన్ క్లబ్ హౌస్ ఉంటుంది. ఇందులో ఇండోర్ షటిల్, టెన్నిస్ కోర్టు, స్క్వాష్ కోర్టు, స్విమ్మింగ్ పూల్, గెస్ట్ రూమ్స్ వసతులుంటాయి.

పెద్దల కోసం ప్రణామమ్..

హైదరాబాద్‌లో తొలిసారిగా కాప్రాలో 'ప్రణామమ్' పేరిట రిటైర్మెంట్ హోమ్స్‌ను నిర్మించిన సాకేత్ గ్రూప్.. గౌడవెల్లిలోని భూఃసత్వా ప్రాజెక్ట్‌లోనూ 'ప్రణామమ్' పేరిట యాక్టివ్ అడల్ట్ రిటైర్మెంట్ హోమ్స్‌ను నిర్మిస్తుంది. 5.5 ఎకరాలలో జీ+10 అంతస్తులలో 4 బ్లాక్‌లలో 513 యూనిట్లుంటాయి. 850 చ.అ. నుంచి 1,850 చ.అ. విస్తీర్ణాలున్నాయి.



సొంతింటి కల తీరేలా..

అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో, అన్ని రకాల వసతులతో అందుబాటు ధరల్లోనే మధ్యతరగతి సొంతింటి కలను నెరవేర్చడమే మా లక్ష్యం. ఎటు చూసినా ఆహ్లాదకర వాతావరణం కనిపించేలా గ్రీనరీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. – రవి కుమార్, డైరెక్టర్, సాకేత్ గ్రూప్

బాబు... బిల్లీ... లక్ష కోట్లు!

20 ఏళ్ల కిందటే అత్యంత భారీ దోపిడీకి స్కెచ్

- ఐఎంజీ భారత్ పేరుతో బిల్లీరావును దింపి కథ నడిపిన చంద్రబాబు
- గచ్చిబౌలిలో విలువైన 850 ఎకరాలు.. రూ.2 కోట్లకే కేటాయింపు
- అప్పట్లోనే వాటి విలువ రూ.20వేల కోట్లు... ఇపుడు 60వేల కోట్లపైనే



(సాక్షి, అమరావతి)

చంద్రబాబు నిజంగా విజనరీయే. 20 ఏళ్ల కిందటే ఓ లక్ష కోట్లు కొట్టేయడానికి పన్నాగం పన్నారంటే... అందుకోసం ఎవ్వరి దృష్టీ పడని క్రీడా రంగాన్ని ఎంచుకున్నారంటే ఏమనుకోవాలి. 2004లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి హోదాలో తన బినామీ బిల్లీ రావు అలియాస్ అహోబిలరావు చేత 'ఐఎంజీ అకాడెమీస్ భారత'అనే కంపెనీని పెట్టించి... అది అమెరికాలో ఉన్న ఐఎంజీ అకాడెమీకి చెందిన కంపెనీ అని నమ్మించి... హడావుడిగా దానికి గచ్చిబౌలిలోని 400 ఎకరాలు కేటాయించి, సేల్‌డీడ్ కూడా చేసేశారంటే ఏమనుకోవాలి? శంషాబాద్ పక్కన మరో 450 ఎకరాలు కేటాయించటంతో పాటు... హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని అన్ని స్టేడియాలనూ ఆ కంపెనీకి 45 ఏళ్ల పాటు లీజుకిచ్చేసి... వాటి నిర్వహణ ఛార్జీలను ప్రభుత్వమే ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారంటే ఏమనుకోవాలి? క్రీడల ద్వారా, వాటి అడ్వర్టయిజ్‌మెంట్లు, స్పాన్సర్‌షిప్‌ల ద్వారా వచ్చే డబ్బులన్నీ ఐఎంజీ అకాడెమీస్‌కే చెందేలా భారీ దోపిడీకి పథకం వెయ్యగలిగారంటే ఆయన విజనరీయే కదా? ఇప్పటి విలువల ప్రకారం చూస్తే ఈ స్కామ్ విలువ లక్ష కోట్లపైనే.

స్పై కెమెరాకు పట్టుబడిన బిల్లీ...

ఈ రాష్ట్ర ప్రజల అదృష్టం బాగుంది కాబట్టే 2004 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి గెలిచారు. బాబు ఓడిపోయారు. వైఎస్సార్ ప్రభుత్వం ఐఎంజీ కేటాయింపుల్ని సమీక్షించినపుడు మొత్తం బోగస్ కంపెనీలేనని తేలటంతో ఒప్పందాన్ని రద్దు చేసి, భూమిని వెనక్కి తీసుకుంది. కానీ బాబు గారి ముఠా ఊరుకోలేదు. తమకు కోర్టుల్లో బలం ఉంది కనక... న్యాయస్థానంలో సవాల్ చేశారు. 2009 ఎన్నికల ముందు... ఈ కేసులో తీర్పు వెలువడవచ్చని బిల్లీరావు భావించారు. ఆ సమయంలో ఆయన సన్నిహితుడొకరు ఆయన్ను కలిసి.. తమ సంభాషణను స్పై కెమెరాతో రికార్డు చేశారు. వ్యవస్థ నిర్ఘాంతపోయే నిజాల్ని అప్పట్లో బిల్లీరావు వెల్లడించారు. వాటిని 'సాక్షి'ప్రచురించింది కూడా. అప్పట్లో అది సంచలనం కావటంతో... తీర్పు వాయిదా పడింది. న్యాయమూర్తులు మారటంతో సుదీర్ఘకాలం కొనసాగింది. తాజాగా గురువారం నాడు బిల్లీరావు తమకే కేటాయించిన భూముల్ని తమకు ఇవ్వాలంటూ వేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. అంతేకాదు... అది మొత్తం వ్యవస్థ నివ్వెరపోయే కుంభకోణమని తేల్చింది. చంద్రబాబు దోపిడీని బయటపెట్టింది. దీనిపై వైఎస్సార్ ప్రభుత్వం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించగా... అప్పట్లో ఇన్‌ఛార్జిగా ఉన్న సీబీఐ అధికారి లక్ష్మీనారాయణ... తమకు తగిన సిబ్బంది లేరన్న సాకుతో దాన్ని చేపట్టలేదు. తాజాగా గురువారంనాడు హైకోర్టు ఈ వ్యవహారంపై వ్యాఖ్యానిస్తూ... దీనిపై సీబీఐ విచారణ ఎందుకు జరిపించలేదో చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేదంటే తామే ఆదేశిస్తామని కూడా స్పష్టంచేసింది. ఈ అంశంపై సమాధానమివ్వాలంటూ అక్కడి ప్రభుత్వానికి వారం రోజుల గడువునిచ్చింది. నిజానికి అప్పట్లోనే సీబీఐ దర్యాప్తు జరిపి ఉంటే.. ఈ పాటికే బాబు దోపిడీ బయటపడి, చంద్రబాబు జైల్లో ఊచలు లెక్కబెడుతుండేవారని చెప్పొచ్చు.

బాబు... నా జేబులో ఉంటారన్న బిల్లీ

తాజా పరిణామాల నేపథ్యంలో... అప్పట్లో బిల్లీరావు స్పై కెమెరాల సాక్షిగా ఏమన్నారు... బాబు ఎంత ఎంత పెద్ద దోపిడీకి స్కెచ్ వేశారు? వంటి వివరాలు మరొక్కసారి చూద్దాం. "ఇదిగో తీర్పు ఇదే మనకు అనుకూలంగా రాబోతున్న కోర్టు తీర్పు కాపీ. ఈ తీర్పును నేనే రాశాను. నేను ఏది రాస్తే అదే తీర్పు గా వస్తుంది. ఈ విషయం చంద్రబాబుకు కూడా తెలుసు. --- కు ఎంత డబ్బులు ఇవ్వాలో చంద్రబాబే చెప్పారు. అసలు ఆయనకు ఉన్న జ్ఞాపక శక్తి అలాంటిది. ఆయనే అన్నీ చూస్తున్నారు. అర్ధరాత్రి 2 గంటలకు నిద్రలేపి అడిగినా ఈ కేసుకు సంబంధించిన అన్ని విషయాలను ఆయన చెప్పేస్తారు. నేను ఏం చెబితే చంద్రబాబు అది చేస్తారు". వాస్తవానికి నాటి వీడియోలో న్యాయ వ్యవస్థలోని పలువురి పేర్లను బిల్లీ వాడేశారు. 'సాక్షి' వాటిని ప్రచురించలేదు. ఆ వీడియో కాపీని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపింది కూడా.

క్రీడా వ్యవస్థను చెరబట్టేందుకు పన్నాగం

కేవలం కాగితాలకే పరిమితమైన ఐంఎంజీ భారత్ కంపెనీకి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోని యావత్ క్రీడా వ్యవస్థను ధారాదత్తం చేసేందుకు చంద్రబాబు కుతంత్రం పన్నారు. 2004 ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం గెలిచినా, వైఎస్సార్ ప్రభుత్వం నాటి ఒప్పందాన్ని రద్దు చేయకపోయినా... రాష్ట్రంలో క్రీడా వ్యవస్థ మొత్తం ఓ మాఫియా గుప్పిట్లోకి వెళ్లిపోయేది. సామాన్యులెవ్వరూ క్రీడల్లోకి ప్రవేశించే ఆలోచన కూడా చేయలేకపోయేవారు. ఎందుకంటే ఐఎంజీ భారత్ కంపెనీతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం అలాంటిది. కేవలం హైదరాబాద్ గచ్చిబౌలిలోని 850 ఎకరాలను కేటాయించడమే కాదు. 16 స్టేడియంలు సహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని యావత్ క్రీడా వ్యవస్థను తన బినామీ బిల్లీ రావుకు 45 ఏళ్లపాటు లీజు పేరిట కట్టబెట్టేశారు. ఆ సమయంలో ఆ స్టేడియంలు, వాటి ఆస్తుల నిర్వహణ అంతా ఐంఎంజీ భారత్ పెత్తనం కిందకే వస్తాయి. కానీ ఏటా నిర్వహణ వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. బీమా ప్రీమియాన్నీ చెల్లిస్తుంది. స్టేడియాల నిర్వహణ కోసం ఆ కంపెనీకి ఉచిత నీరు, ఉచిత విద్యుత్, వినోద పన్ను రాయితీ, విదేశీ సుంకం రాయితీలు అన్ని వెసులుబాట్లు కల్పిస్తుంది. టీవీ ప్రసార హక్కుల ఆదాయం ఆ కంపెనీకే దక్కుతుంది. అంతేకాదు.. మరో ప్రమాదకరమైన నిబంధననూ చేర్చారు. స్టేడియంలు, వాటి ఆస్తులను ఐఎంజీ భారత్ తన విచక్షణ మేరకు నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసుకోవచ్చనే క్లాజును చేర్చారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తే ఆ క్లాజు కింద ఆ స్టేడియంలను ఐఎంజీ భారత్ తన సొంతం చేసుకునే హక్కు కల్పించడమన్న మాట. అంటే రాష్ట్రంలో 45 ఏళ్ల పాటు క్రీడా వ్యవస్థ అంతా ఐఎంజీ భారత్ కంపెనీ ముసుగులో చంద్రబాబు గుత్తాధిపత్యం కింద ఉంటుంది. ఏదో ఒక సాకు చూపించి స్టేడియంలు, వాటి ఆస్తులన కూడా ఆ కంపెనీ తాను నిర్ణయించిన నామమాత్రపు ధర కింద కొనుగోలు చేసేసుకోవచ్చు.

అంటే ప్రస్తుతం చంద్రబాబు భాషలో చెప్పాలంటే... రాష్ట్రంలో క్రీడా వ్యవస్థను చంద్రబాబు కుర్చీ మాదిరి మడతపెట్టేస్తారన్నది సుస్పష్టం. కాగా న్యాయ వ్యవస్థ తన నిబద్ధతను, విశ్వసనీయతను మరోసారి చాటిచెప్పింది. చంద్రబాబు, ఐఎంజీ భారత్ కంపెనీ కుతంత్రాలను తిప్పికొట్టింది. ఐఎంజీ భారత్‌కు అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం హైదరాబాద్‌లో 850 ఎకరాలను కేటాయించడాన్ని రద్దు చేస్తూ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. ఆ భూకేటాయింపులు సరైన నిర్ణయమేనని తీర్పునిచ్చింది. దాంతో చంద్రబాబు భూబాగోతం బెడిసికొట్టింది.

చంద్రబాబు అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

- బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి
- హైకోర్టు తీర్పుతో 850 ఎకరాల ప్రభుత్వ ఆస్తిని కాపాడినట్లయింది



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఐఎంజీ భారత్ అనే సంస్థకు ధారాదత్తం చేసిన 850 ఎకరాలను హైకోర్టు తీర్పుతో కాపాడుకున్నట్లైందని, తీర్పును స్వాగతిస్తున్నట్లు బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుపై శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...అత్యంత విలువైన భూములను ఐఎంజీ భారత్‌కు ధారాదత్తం చేసిన ఈ కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం సీబీఐతో గాని తగిన ఇతర సంస్థతో గానీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఐఎంజీ భారత్ అనే సంస్థ ఏర్పాటైన నాలుగు రోజుల్లోనే హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన 450 ఎకరాలతో పాటు ఏకంగా 850 ఎకరాలను అప్పగించడం దారుణమన్నారు. భారీ మెయింటెనెన్స్ ఫీజు చెల్లించి హైదరాబాద్‌లోని 11 స్టేడియాలను, జూబ్లీ హిల్స్‌లోని ఐదెకరాల భూమిని కూడా అప్పగించాలని చంద్రబాబు ప్రతిపాదించడం సరికాదని చెప్పారు. అప్పట్లో ఎకరాకు రూ.13 లక్షలు విలువ చేసే భూమిని రూ.25వేల నుంచి రూ. 50వేలు ధర నిర్ణయించి ఐఎంజీ భారత్‌కు 400 ఎకరాలు రిజిస్టర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన ప్రిన్సిపల్ సెక్రెటరీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని కూడా కోర్టు ప్రశ్నించిందని తెలిపారు.

అంతర్జాతీయ గజదొంగ

చంద్రబాబుపై సజ్జల ధ్వజం

- తలాతోక లేని ఐఎంజీ భారత్‌కు హైదరాబాద్‌లో 850 ఎకరాలా?
- 21 ఏళ్ల క్రితమే రూ.లక్ష కోట్ల దోపిడీకి బాబు స్కెచ్
- వైఎస్సార్ ఔదార్యం చూపకుంటే నాడే జైలు పాలు
- తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో బాబు దోపిడీ రుజువైంది
- అమరావతిలోనూ అదే తరహా దోపిడీకి పథకం
- రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ఇక్కడా రూ.లక్ష కోట్లు కాజేసే ఎత్తుగడ



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అత్యంత శాస్త్రీయంగా దోపిడీ చేయగలిగిన అంతర్జాతీయ గజదొంగ అన్నది మరోసారి నిరూపితమైందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. ఐఎంజీ భారత్ భూ కుంభకోణంపై తెలంగాణ హైకోర్టు గురువారం జారీ చేసిన ఆదేశాలే అందుకు నిదర్శనమన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సరిగ్గా 21 ఏళ్ల క్రితం తలా తోక లేని ఐఎంజీ భారత్ కంపెనీకి నాలుగు రోజుల్లోనే 850 ఎకరాలు కట్టబెట్టి రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్ వేసిన ఘనాపాటి చంద్రబాబు అని పేర్కొన్నారు. విభజన తర్వాత అదే తరహాలో అమరావతి స్టార్టప్ ఏరియా కుంభకోణానికి తెరతీసి రూ.లక్ష కోట్ల దోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారని గుర్తు చేశారు. ఐఎంజీ భారత్ కుంభకోణంలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టడానికి సెక్షన్ వేస్తే స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులో రైతుల భూములను కాజేసేందుకు పథకం వేశారన్నారు. స్కిల్ స్కామ్‌లో రూ.371 కోట్లు అడ్డంగా దోచేశారన్నారు. మరోసారి దోచుకునేందుకే అధికారం కోసం అర్రులు చాస్తున్నారని దుయ్యబట్టారు.

ఇంటర్నేషనల్ స్కామ్‌స్టర్..

- ఐఎంజీ స్పోర్ట్స్ అనే అంతర్జాతీయ సంస్థతో సంబంధం లేకుండా ఐఎంజీ భారత్ అనే బోగస్ సంస్థను 2003 ఆగస్టు 5న ఏర్పాటు చేశారు. క్రీడల అభివృద్ధికి ఆ సంస్థ చేసిన ప్రతిపాదనపై ఎలాంటి విచారణ చేయకుండానే 2003 ఆగస్టు 6న ఆగమేఘాలపై ఆమోదించారు. ఆగస్టు 9న ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. కోరుకున్న స్టేడియంలను ఆ సంస్థకు అప్పగించాలని, స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణం, స్టేడియాల నిర్వహణకు ఏడాదికి రూ.2.50 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు అయితే ప్రభుత్వం భరిస్తుందని ఒప్పందంలో పేర్కొన్నారు. మూడేళ్లపాటు విద్యుత్, నీరు, సీవేజ్, డ్రైనేజ్ బిల్లులను వంద శాతం తిరిగి చెల్లిస్తామని, ఆ తర్వాత తగ్గిస్తామని ఒప్పందం చేసుకున్నారు.
- 2003 నవంబర్ 14న చంద్రబాబు ప్రభుత్వం రద్దయింది. ఆ తర్వాత చంద్రబాబు నేతృత్వంలో ఆపద్ధర్మ ప్రభుత్వం కొనసాగింది. ఆపద్ధర్మ ప్రభుత్వ హయాంలో గచ్చిబౌలి వద్ద 400 ఎకరాలను ఎకరం రూ.50 వేల చొప్పున కారు చౌకగా ఐఎంజీ భారత్‌కు కట్టబెడుతూ సేల్ డీడ్ చేశారు. ఈ భూమికి అప్పట్లోనే మార్కెట్ విలువ ఎకరా రూ.2.50 కోట్లపైగానే ఉంది. అప్పటికే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ నిర్మాణానికి ఈ భూమికి సమీపంలోనే అంకురార్పణ జరిగింది. శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వస్తుందని తెలిసిన చంద్రబాబు దానికి పక్కనే మామిడిపల్లి వద్ద మరో 400 ఎకరాలను ఐఎంజీ భారత్‌కు కట్టబెట్టారు. జూబ్లీ హిల్స్‌లో ఐఎంజీ భారత్ కార్యాలయం ఏర్పాటుకు 5 వేల చదరపు గజాల భూమిని కేటాయించారు.
- 2004లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాకపోయి ఉంటే చంద్రబాబు ఐఎంజీ భారత్‌తో కలిసి ఆ భూములను కాజేసేవారు. ఇప్పుడు ఆ భూముల విలువ రూ.లక్ష కోట్లు ఉంది. వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక ఆ కుంభకోణంపై విచారణ జరిపి భూముల కేటాయింపును రద్దు చేశారు. వైఎస్సార్ ఔదార్యం చూపకపోయి ఉంటే ఈ కుంభకోణంలో చంద్రబాబు అప్పుడే జైలుకు వెళ్లేవారు.
- ఈ కుంభకోణంపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు తలా తోకా లేని సంస్థకు 4 రోజుల్లోనే 850 ఎకరాల భూమిని కేటాయించడంపై విస్మయం వ్యక్తం చేసింది. దీనిపై సీబీఐ దర్యాప్తుకు తాము ఆదేశించాలా? లేక మీరే కోరతారో చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

రైతుల భూములతో రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్

- విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాజధాని భూసమీకరణ పేరుతో 33 వేల ఎకరాలను రైతుల నుంచి లాక్కుని అభివృద్ధి చేసిన వాణిజ్య, నివాస స్థలాలు ఇస్తానంటూ నమ్మబలికారు.
- రైతుల నుంచి లాక్కున్న 33 వేల ఎకరాల్లో 1,700 ఎకరాలను రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు అంటూ సింగపూర్ ప్రభుత్వం పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. ఆ ప్రాజెక్టులో గత ప్రభుత్వం పెట్టుబడి పెట్టడంతోపాటు రూ.5,500 కోట్లతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని ఒప్పందంలో పేర్కొంది. స్టార్టప్ ఏరియా చుట్టూ సచివాలయం, అసెంబ్లీ, సీఎం కార్యాలయం, రాజ్‌భవన్ ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా ప్లాట్లకు డిమాండ్‌సృష్టించి రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రూ.లక్ష కోట్లు దోపిడీకి స్కెచ్ వేశారు. ఆ ప్రాంతంలోనే నాటి మంత్రి నారాయణ, చంద్రబాబు బినామీలు భూములు కొన్నారు. రైతులకు అభివృద్ధి చేసిన వాణిజ్య, నివాస స్థలాలు ఇవ్వడంపై దృష్టి పెట్టకుండా వారి భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రూ.లక్ష కోట్ల దోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారు.
- సీమన్స్‌తో సంబంధం లేని బోగస్ సంస్థతో స్కిల్ డెవలప్‌మెంట్ ఒప్పందం ద్వారా షెల్ కంపెనీలతో రూ.371 కోట్లను చంద్రబాబు కాజేశారు. ఈ కుంభకోణంలో ఆధారాలతో చంద్రబాబు పట్టుబడటంతో సీఐడీ ఆయన్ను అరెస్టు చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టింది. ఆ అక్రమాలకు ఆధారాలు లభ్యమవడంతో కోర్టు ఆయన్ను జైలుకు పంపింది. ఫైబర్ నెట్ స్కామ్ కూడా ఇలాంటిదే.
- కరుడు గట్టిన గజదొంగలకు దొంగతనం చేయడంలో ప్రత్యేక శైలి ఉంటుంది. దాని ఆధారంగానే నిందితులను పోలీసులు పక్కాగా గుర్తిస్తారు. చంద్రబాబు కూడా అంతే. తలా తోకా లేని సంస్థలను తెరపైకి తెచ్చి ఐఎంజీ భారత్, అమరావతి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు స్కిల్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్ లాంటి కుంభకోణాలకు పాల్పడ్డారు.

దింపుడు కళ్లెం ఆశతో

అధికారంపై దింపుడు కళ్లెం ఆశతోనే చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతున్నారు. ఇప్పటికే జనసేనతో పొత్తు పెట్టుకున్నారు. కాంగ్రెస్‌ను చేతిలో పెట్టుకుని షర్మిలమ్మకు పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇప్పించారు. అయినా సరే తాను అధికారంలోకి రాలేననే భయంతో బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీలో ఆ పార్టీ పెద్దల కాళ్లావేళ్లాపడుతున్నారు. ఇది చంద్రబాబు బలహీనతను, ప్రజల్లో సీఎం జగన్‌కు ఉన్న బలాన్ని చాటిచెబుతోంది. చంద్రబాబు ఎన్ని జెండాలతో జత కట్టినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యం. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం.

క్లుప్తంగా...

అన్నారం, పార్వతి బ్యారేజీలను పరిశీలించిన ఎన్‌డీఎస్‌ఏ

కాళేశ్వరం, మంథని: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం(సరస్వతీ)బ్యారేజీని, పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం గ్రామ సమీపంలో నిర్మించిన పార్వతి బ్యారేజీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) శుక్రవారం పరిశీలించింది. ఆరుగురి సభ్యుల బృందం చంద్రశేఖర్ అయ్యర్ ఆధ్వర్యంలో పరిశీలన చేపట్టింది. శుక్రవారం ఉదయం 10.35గంటలకు అన్నారం చేరుకున్న బృందం సభ్యులు మొదట సీపేజీ లీకేజీలు ఏర్పడ్డ 4, 5 బ్లాకుల్లోని 28, 38, 41, 44 పియర్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తరువాత బ్యారేజీలోని 66 పియర్‌లను పరిశీలించారు. బ్యారేజీ నిర్వహణ సరిగ్గా లేదని ఆ బృందం సభ్యులు అసంతృప్తి వ్యక్తపరిచినట్లు తెలిసింది. సుమారుగా 3.30గంటల పాటు బ్యారేజీని అడుగడుగునా చూశారు. ఆ తర్వాత పార్వతి బ్యారేజీని పరిశీలించారు.. తొలుత నీటిపారుదల శాఖ, బ్యారేజీ నిర్మాణ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. బ్యారేజీలో ఏర్పడ్డ డ్యామేజీ వివరాలతోపాటు అనేక అంశాలను ఎన్‌డీఎస్‌ఏ బృందం సేకరించినట్లు సమాచారం. అనంతరం బ్యారేజీ గేట్ల దిగువ భాగంతోపాటు నీటి ప్రవాహానికి కుంగిన, కొట్టుకుపోయిన సిమెంట్ బ్లాక్స్‌ను బృందం పరిశీలించింది.

డ్యామ్ సేఫ్టీ కమిటీ ముందుకు రండి

- కాళేశ్వరం బ్యారేజీల ఉద్యోగులకు నీటిపారుదల శాఖ పిలుపు
- పనిచేస్తున్న, బదిలీ, పదవీ విరమణ చేసిన వారు కూడా రావాల్సిందే
- సర్క్యులర్ మెమో జారీ చేసిన నీటిపారుదల శాఖ




సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలతో ముడిపడిన ఉద్యోగులు/ ఇంజనీర్లు ఈనెల 9వ తేదీన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ ముందుకు రావాలని నీటిపారుదల శాఖ కబురు పంపింది. 2016 నుంచి ప్రస్తుతం(ఈ నెల 8వ తేదీ దాకా) బ్యారేజీల ఇన్వెస్టిగేషన్, హైడ్రాలజీ, మోడల్ స్టడీస్, డిజైన్లు, నిర్మాణం , క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లో పాల్గొన్నవారు ఈనెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు జలసౌధలోని నీటిపారుదల శాఖ ఐదో అంతస్తులో ఉన్న మీటింగ్ హాలులో జరిగే సమావేశానికి హాజరుకావాలని కోరింది. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న వారితో పాటు బదిలీ అయిన వారు, పదవీ విరమణ చేసిన వారు కూడా విధిగా హాజరుకావాలని నీటిపారుదల శాఖ ఈఎన్సీ(అడ్మిన్) జి.అనిల్ కుమార్ సర్క్యులర్ మెమో జారీ చేశారు. సంబంధిత ప్రాజెక్టులకు చెందిన చీఫ్ ఇంజనీర్లు/ సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తమ పరిధిలోని తాజా, మాజీ ఉద్యోగులంతా హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

ఖాయంగా తు'ఫ్యానే'

ఏపీలో 21-22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం

- 3–4 ఎంపీ సీట్లకే టీడీపీ–జనసేన కూటమి పరిమితం
- టైమ్స్‌నౌ – ఈటీజీ సర్వేలో వెల్లడి
- సీఎం జగన్ విశ్వసనీయతే ఘన విజయానికి బాటలు వేస్తోందని విశ్లేషణ



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని టౌమ్స్ నౌ – ఈటీజీ రీసెర్చ్ సర్వే తేల్చి చెప్పింది. వైఎస్సార్ సీపీ 49 శాతం ఓట్లతో 21 నుంచి 22 లోక్‌సభ స్థానాలను దక్కించుకుని ఘనవిజయం సాధిస్తుందని వెల్లడించింది. టీడీపీ – జనసేన కూటమి 45 శాతం ఓట్లతో 3 నుంచి 4 లోక్‌సభ స్థానాలకే పరిమితం కానుందని తేల్చింది. బీజేపీ 2 శాతం ఓట్లు, కాంగ్రెస్, వామపక్షాలు తదితరులు 4 శాతం ఓట్లు దక్కించుకుంటాయని అంచనా వేసింది. జీ న్యూస్, రిపబ్లిక్ టీవీ లాంటి డజనుకుపైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేలు సైతం సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘనవిజయం సాధించడం ఖాయమని ఇప్పటికే తేల్చాయి. టీడీపీ – జనసేన పొత్తు కుదిరాక గతేడాది డిసెంబర్ 13 నుంచి ఈనెల 7 వరకూ రాష్ట్రంలో వివిధ వర్గాలకు చెందిన 3,23,257 మంది అభిప్రాయాలను సేకరించి సర్వే ఫలితాలను రూపొందించినట్లు టైమ్స్‌నౌ – ఈటీజీ సర్వేను శుక్రవారం టైమ్స్‌నౌ ఛానెల్‌లో సమర్పించిన సంస్థ సీనియర్ న్యూస్ ఎడిటర్ పద్మజా జోషి వెల్లడించారు. ఆ అభిప్రాయాలను క్రోడీకరిస్తే వైఎస్సార్ సీపీ సంచలనం విజయం సాధించడం ఖాయమని తేలిందన్నారు. టీడీపీ – జనసేన పచ్చి అవకాశవాదంతో పొత్తు పెట్టుకున్నాయని అధిక శాతం ప్రజలు తమ అభిప్రాయాన్ని కుండబద్ధలు కొట్టినట్లు వ్యక్తం చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడం, సుపరిపాలన అందించడం ద్వారా సీఎం వైఎస్ జగన్ విశ్వసనీయత చాటుకున్నారని, వైఎస్సార్‌సీపీ ఘనవిజయానికి ఇదే బాటలు వేస్తున్నట్లు తాము నిర్వహించిన సర్వేలో వెల్లడైందన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్‌కు 9 స్థానాలు

బీజేపీకి 5, బీఆర్‌ఎస్‌కు 2, ఎంఐఎంకు 1

సాక్షి హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని టైమ్స్ నౌ ఛానల్ నిర్వహించిన సర్వేలో తేలింది. గత లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ (ఇప్పటి బీఆర్‌ఎస్) పార్టీ సాధించినన్ని స్థానాలను ఈసారి కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆ సర్వే వెల్లడించింది. ఆ సర్వే ప్రకారం..రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 9 స్థానాలు, బీజేపీకి 5, బీఆర్‌ఎస్‌కు 2, ఎంఐఎంకు 1 స్థానం దక్కనున్నాయి. కాంగ్రెస్‌కు 40.4 శాతం ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 28.1 శాతం, బీజేపీకి 22.6 శాతం, ఎంఐఎంకు 3.3 శాతం ఓట్లు లభిస్తాయని సర్వే తేల్చింది.

రంగాను చంపిన బాబుకు ఓటేయాలా పవన్?

- కమ్మ కులంలో పుడితే బాగుండేదన్నది పవన్ భావన
- కాపులను వంచిస్తున్న ఘనత ఆయనదే
- రంగాను అభిమానించేవారెవరైనా టీడీపీకి ఓటు వేయొద్దు:పోసాని



హైదరాబాద్ : తాను కాపు కులంలో ఎందుకు పుట్టానా.. కమ్మ కులంలో పుడితే బాగుండేది.. అన్న భావనలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఉన్నారని ఏపీఎఫ్‌డీసీ చైర్మన్, నటుడు పోసాని కృష్ణ మురళి అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మాట్లాడారు. కాపు కులస్తులంతా తమ వాడు సీఎం కావాలని పవన్‌కు అండగా నిలిచారని, అయితే వారిని వంచించిన ఘనత పవన్‌కే దక్కిందన్నారు. కాపు సోదరుల కోసమే తాను ఈ ప్రెస్ మీట్ పెట్టినట్టు చెప్పారు. జనసేనను చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టిన పవన్.. చంద్రబాబు సీఎం అవడానికి ఓట్ల పేరుతో మరోసారి కాపులను మోసం చేయడానికి వస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కాపుల ఆశాజ్యోతి వంగవీటి రంగా తామందరికీ పెద్ద హీరో అని.. అలాంటి రంగాను ఎలా చంపారో ఈ పోస్టర్ మీకు చెబుతుందంటూ అక్కడున్న పోస్టర్‌ను చూపారు. రంగాను హత్య చేయించింది చంద్రబాబేనని ఆరోపించారు. రంగాను గొంతు కోశాక ఆయన చనిపోయాడా లేదా.. అని మళ్లీ చంపారని చెప్పారు. రంగాను చంపిందెవరో అందరికీ తెలుసని, ఆయన కుమారుడికీ తెలుసన్నారు. రంగా బతికి ఉంటే ఎప్పటికైనా కాపు కులం నుంచి సీఎం అవుతారనే పథకం ప్రకారం చంద్రబాబు హత్య చేయించారని ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని అప్పట్లో రంగా సీఎం ఎన్టీఆర్‌కు, హోం మంత్రి కోడెల శివప్రసాదరావుకు సెక్యూరిటీ కోసం వినతి పత్రాలిచ్చారని, అయితే భద్రత కల్పించకుండా చంద్రబాబు అడ్డుపడ్డారని చెప్పారు. తనకు సెక్యూరిటీ కావాలని కేంద్రానికి రంగా లేఖ రాయగా.. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబు సెక్యూరిటీ కల్పించే లోపే రంగాను నడిరోడ్డుపై నరికి చంపించారని ఆరోపించారు.

ముద్రగడ విషయంలో మౌనమా.. బాబు జైలుకు వెళ్లగానే మద్దతా?

ఈ తరుణంలోనే పవన్‌కళ్యాణ్ వచ్చారని.. చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణలను పవన్ బూతులు తిడుతుంటే కాపులు నమ్మారని, పార్టీ పెట్టాను సీఎం అవుతానంటే ఆయన వెంట కాపులంతా నడిచారని తెలిపారు. కాపు కులంలో పవన్ సీఎం అవుతారని కాపులు నమ్మారని, అయితే నమ్మిన కాపులను మోసం చేసి.. చంద్రబాబుకు మద్దతు తెలపాలని, తనకు అంత సీన్ లేదని పవన్ చెప్పడంతో కాపుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ముద్రగడ పద్మనాభంను మెడపట్టి గెంటించి, ఆయన కుటుంబ ఆడపడుచులను అవమానించింది చంద్రబాబేనని.. అప్పుడు మాట్లాడని పవన్.. అవినీతి కేసులో చంద్రబాబు జైలుకు వెళ్లగానే వెళ్లి పలకరించాడని దుయ్యబట్టారు. కాపులను రౌడీలు, గుండాలు అన్న చంద్రబాబుకు ఓటు వేయాలని పవన్ చెబుతున్నాడని.. రంగాను చంపిన చంద్రబాబును ఎలా సీఎంను చేయమంటావని ప్రశ్నించారు. రంగా చంపిన వాడు సీఎం అయితే బాగుంటుందని పవన్ అభిప్రాయపడుతున్నారని దుయ్యబట్టారు. రంగాను అభిమానించే వారెవరైనా చంద్రబాబుకు, సైకిల్ గుర్తుకు ఓటేయొద్దని పిలుపునిచ్చారు.

కాపు సంక్షేమ సేన తాత్కాలికంగా రద్దు

- హరిరామజోగయ్య ప్రకటన

పాలకొల్లు సెంట్రల్: కాపు సంక్షేమ సేనను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య ప్రకటించారు. ముద్రగడ పద్మనాభం కాపు సంక్షేమ పోరాటం నుంచి తప్పుకున్న తరువాత కొందరు మిత్రుల సలహా మేరకు కాపు సంక్షేమ సేన స్థాపించినట్టు తెలిపారు. కాపు సంక్షేమ సేన కొన్ని పరిణామాలతో పరోక్షంగా రాజకీయాల్లోకి ప్రవేశించి తప్పు చేసిందని పేర్కొన్నారు. పవన్‌ను ముఖ్యమంత్రిని చేస్తే కాపులకు న్యాయం జరుగుతుందనే ఆలోచనతో ఆయనకు సలహాలు ఇవ్వడం తనకు శాపంగా మారిందన్నారు. కొందరు జనసైనికులు తనను అపార్థం చేసుకుని చాలా అమర్యాదగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నాడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు తాను ఎంపీ పదవి వదులుకుని ఆ పార్టీలో చేరినట్టు తెలిపారు. ఆ తర్వాత ఆయన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేశారని, దీంతో తనతో పాటు చాలామంది కాపులు నష్టపోయారని తెలిపారు. మళ్లీ అలాంటి పరిస్థితి రాకూడదనేదే తన తపన అని చెప్పారు. అందువల్ల శుక్రవారం జరిగిన కాపు సంక్షేమ సేన జనరల్ బాడీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సంస్థలోని వివిధ హోదాలను, కమిటీలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు. ఎన్నికలైన తర్వాత జూన్ నుంచి కొత్త కమిటీలను ఏర్పాటు చేసి కాపు సంక్షేమ సేనను కొనసాగిస్తానని హరిరామజోగయ్య ఆ లేఖలో వెల్లడించారు.

పనికిరాని ప్రాజెక్టు కాళేశ్వరం

- రూ.లక్ష కోట్లతో అది కట్టే బదులు సారంగం పూర్తి చేస్తే బాగుండేది
- నల్లగొండకు కరువు వచ్చేది కాదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పానగల్లులోని పచ్చల సోమేశ్వర ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ: "గత కేసీఆర్ ప్రభుత్వం శ్రీశైలం సొరంగమార్గాన్ని పూర్తి చేసి ఉంటే నల్లగొండ జిల్లాకు ఈ రోజు కరువు వచ్చినా ఇబ్బంది ఉండేది కాదు. రూ.లక్ష కోట్లు పెట్టి పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు తప్ప ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గానికి రూ.3 వేల కోట్లు కేటాయించలేదు"అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకు, రోడ్ల విస్తరణ పనులను ప్రారంభించారు. పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కాలేజీ వద్ద అన్నపూర్ణ క్యాంటీన్‌ను ప్రారంభించి రూ.5 భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో త్వరలో 25 వేల మందికి 5 రూపాయలకే భోజన పథకాన్ని ప్రారంభిస్తామన్నారు, ట్యాంకర్ల ద్వారా అయినా పానగల్ ఉదయ సముద్రం నుంచి నీరు తెప్పించి నల్లగొండ ప్రజలను ఆదుకుంటానని చెప్పారు. నల్లగొండ పట్టణంలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం, పచ్చల సోమేశ్వర ఆలయాలకు యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని మంత్రి హామీనిచ్చారు.

టచ్ చేసి చూడు కేటీఆర్

గుర్రంపోడు: "మా ప్రభుత్వాన్ని టచ్ చేసి చూడు కేటీఆర్.. మేము కాదు 4 కోట్ల ప్రజలే చూసుకుంటారు"అని కోమటిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా గుర్రంపోడులో రోడ్డు పనులకు శంకుస్థాపన తర్వాత విలేకరులతో మా ట్లాడారు. తాము తలుచుకుంటే 39 మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురే మిగులుతారని, కానీ తాము ఆపని చేయమని, మంచి పనులు చేసి వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ బలం డబుల్ చేసుకుంటామన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
9-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	33	74,119
నిఫ్టీ ▲	20	22,494

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు ముగింపు)			
నాస్డాక్	16,209	▽	63
డోజోన్స్	38,885	△	93
ఎఫ్టీఎస్ఈ 100	7,660	▽	33
డాక్స్	17,815	▽	28
షాంఘై	3,046	▽	19
నికాయ్	39,685	△	90

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.44	82.42
£	బ్రిటన్ పౌండ్	104.30	106.85
€	యూరో	89.21	91.56
¥	జపాన్ ఎన్ (100)	55.14	56.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.49	53.57
S$	సింగపూర్ డాలర్	59.87	64.10
SAR	సౌదీ రియాల్	21.17	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	21.65	23.43
¥	చైనా యువాన్	10.37	12.37

టాటా సన్స్ మెగా ఐపీవో!

- అంచనా విలువ రూ. 11 లక్షల కోట్లు
- ఐపీవో పరిమాణం రూ. 55,000 కోట్లు!
- ఏడాదిన్నర కాలంలో లిస్టింగ్ తప్పనిసరి



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం టాటా సన్స్ పబ్లిక్ ఇష్యూకి రానున్నట్లు ఈక్విటీ మార్కెట్ రీసెర్చ్ సంస్థ స్పార్క్ క్యాపిటల్ పేర్కొంది. టాటా గ్రూప్ ఎన్బీఎఫ్సీ హోల్డింగ్ కంపెనీ విలువను రూ. 7.8 లక్షల కోట్లుగా మదింపు చేసింది. గ్రూప్ కంపెనీల ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం విలువ మదింపు చేయగా.. ఆర్బీఐ నిబంధనల ప్రకారం రానున్న 18 నెలల్లో టాటా సన్స్ ఐపీవో చేపట్టనున్నట్లు తెలియజేసింది. అప్పర్లేయర్ ఎన్బీఎఫ్సీగా ఆర్బీఐ గతేడాది గుర్తింపునిచ్చిన నేపథ్యంలో 2025 సెప్టెంబర్కల్లా తప్పనిసరిగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కావలసి ఉన్నట్లు స్పార్క్ పేర్కొంది. ఇందుకు ఏడాదిన్నర కాలంలో పబ్లిక్ ఇష్యూ చేపట్టవలసి ఉంటుందని తెలియజేసింది. దీంతో సంక్లిష్టంగా ఉన్న గ్రూప్ హోల్డింగ్ నిర్మాణం సరళతరమయ్యేందుకు వీలుంటుందని అభిప్రాయపడింది. కాగా.. ఇటీవల వెలువడిన సమాచారం ప్రకారం కంపెనీ రూ. 11 లక్షల కోట్ల విలువను అందుకోగలదని వెల్లడించింది. వెరసి ఐపీవో పరిమాణం రూ. 55,000 కోట్లుగా ఉండవచ్చని అంచనా వేసింది. టాటా సన్స్ హోల్డింగ్స్లో 80 శాతం మోనిటైజబుల్ కానప్పటికీ పునర్వ్యవస్థీకరణ కారణంగా కంపెనీ రీరేటింగ్ను సాధించే వీలున్నట్లు పేర్కొంది.

టీసీఎస్ బలిమి

టాటా సన్స్ విలువలో సాఫ్ట్వేర్ సేవల దిగ్గజం టీసీఎస్ అతిపెద్ద వాటాను ఆక్రమిస్తోంది. టీసీఎస్ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం టాటా సన్స్ వాటా విలువ రూ. 10 లక్షల కోట్లవరకూ ఉంటుంది. అన్లిస్టెడ్ కంపెనీలు, పెట్టుబడులుకాకుండా గ్రూప్లోని ఇతర లిస్టెడ్ దిగ్గజాలు టాటా మోటార్స్, టాటా పవర్, ఇండియన్ హోటల్స్లో యాజమాన్య వాటాలు కలిగి ఉంది. టాటా కెమికల్స్లో అత్యధిక స్థాయి(కంపెనీ విలువలో 80 శాతం)లో యాజమాన్య హక్కులను కలిగి ఉంది. కాగా.. టాటా సన్స్లో దొరాబ్జీ టాటా ట్రస్ట్ 28 శాతం, రతన్ టాటా ట్రస్ట్ 24 శాతం, సైరస్ మిస్త్రీ కుటుంబ పెట్టుబడి సంస్థ(స్టెర్లింగ్ ఇన్వెస్ట్మెంట్) 9 శాతం, ఇతర ప్రమోటర్లు 14 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి.

విలువ జోడింపు

అన్లిస్టెడ్ పెట్టుబడులతో పలు మార్గాల ద్వారా టాటా సన్స్కు అదనపు విలువ జమకానున్నట్లు స్పార్క్ క్యాపిటల్ తెలియజేసింది. ఇటీవల సెమీకండక్టర్స్ తదితర ఆధునికతరం విభాగాలలోకి టాటా గ్రూప్ ప్రవేశించడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. టాటా ఎలక్ట్రానిక్స్.. చిప్ తయారీ ప్రణాళికలు ప్రకటించిన విషయం విదితమే. టాటా టెక్నాలజీస్, టాటా మెటాలిక్స్, ర్యాలీస్ తదితర అనుబంధ సంస్థలను పేర్కొంది. ఫలితంగా టాటా గ్రూప్ మరో రూ. 1-1.5 లక్షల కోట్ల విలువను జోడించుకోనున్నట్లు అంచనా వేసింది. లిస్టెడ్, అన్ లిస్టెడ్ కంపెనీలు, ప్రిఫరెన్స్ షేర్లు, ఫండ్స్లో పెట్టుబడులను పరిగణించి విలువను మదింపు చేసింది.

మే 20 నుంచి స్పెక్ట్రం వేలం

న్యూఢిల్లీ: తదుపరి స్పెక్ట్రం వేలం మే 20 నుంచి ప్రారంభం కానుంది. టెలికం కంపెనీలను ఆహ్వానిస్తూ టెలికమ్యూనికేషన్ శాఖ ఈ మేరకు నోటీసు విడుదల చేసింది. మొబైల్ ఫోన్ సేవల కోసం ఎనిమిది 5జీ స్పెక్ట్రమ్ బ్యాండ్స్ను రూ.96,317.65 కోట్ల బేస్ ధరకు ప్రభుత్వం వేలం వేయనుంది.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-3-2024	
విశాఖ	475-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463-00
విజయవాడ	463-00
రిటైల్ ధర (డజను)	72.00
8-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469-00
వరంగల్	471-00
రిటైల్ ధర	5.30

ఎయిరిండియా- విస్తారా విలీనం వేగం!



న్యూఢిల్లీ: విమానయాన దిగ్గజాలు ఎయిరిండియా, విస్తారా విలీన ప్రక్రియ వేగమందుకోనుంది. ఇందుకు సింగపూర్ నియంత్రణ సంస్థ కాంపిటీషన్ అండ్ కన్జూమర్ కమిషన్(సీసీసీఎస్) షరతులతో కూడిన అనుమతులు ఇచ్చినట్లు ఎయిరిండియా చీఫ్ క్యాంప్బెల్ విల్సన్ తాజాగా పేర్కొన్నారు. దీంతో రెండు సంస్థలూ తమ షెడ్యూళ్లు, కాంట్రాక్టులు తదితర సవివర సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు అనుమతి లభించినట్లు తెలియజేశారు. 2022 నవంబర్లో ఎయిరిండియాలో విస్తారా విలీన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఎయిరిండియాలో 25.1 శాతం వాటాను సింగపూర్ ఎయిర్లైన్స్ సొంతం చేసుకోనుంది. టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్లైన్స్ కలసి సంయుక్త సంస్థ(జేవీ)గా విస్తారాను ఏర్పాటు చేసిన విషయం విదితమే.

ఈక్విటీ ఎంఎఫ్లకు ఫిబ్రవరిలో రూ.26,866 కోట్లు



న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)లోకి ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.26,866 కోట్ల పెట్టుబడులు వచ్చాయని భారత మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) గణాంకాలు వెల్లడించాయి. ఒక నెలలో ఈ స్థాయిలో పెట్టుబడులు పెట్టడం గడిచిన 23 ఏళ్లలో గరిష్టం. ఈ జనవరిలో వెల్లువెత్తిన రూ.21,721 కోట్లతో పోలిస్తే కూడా 23% అధికం. కొత్త ఫండ్ల ఆవిష్కరణ, థీమాటిక్/సెక్టోరియల్ ఫండ్లపై ఆసక్తి ఇందుకు ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. సిస్టమేటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్(సిప్) పథకాల్లోకి కూడా ఫిబ్రవరి జీవితకాల గరిష్టం రూ.19,186 కోట్లకు చేరాయి. జనవరి ఇవి రూ.18,838 కోట్లుగా ఉన్నాయి.

ప్రీమియమైజేషన్ దిశగా షావోమి..




రూ.లక్ష ఖరీదైన షావోమి 14 సిరీస్ విడుదల

ముంబై: చైనా స్మార్ట్ఫోన్ల తయారీ సంస్థ షావోమి భారత మార్కెట్లో తన వ్యాపార వ్యూహాన్ని మార్చింది. ప్రీమియమైజేషన్ (డబ్బున్న కస్టమర్లు అత్యంత ఖరీదైన ఉత్పత్తుల వైపు మొగ్గుచూపడం) దిశగా అడుగులు వేస్తూ తన పోర్ట్ఫోలియోలోనే అత్యంత ఖరీదైన షావోమి 14 సిరీస్ స్మార్ట్ఫోన్లను విడుదల చేసింది. ఇందులో ప్రారంభ స్థాయి షావోమి 14 స్మార్ట్ ఫోన్ ధర రూ.59,999 కాగా, షావోమి 14 అల్ట్రా స్మార్ట్ ఫోన్ రూ.99,999 ఉంది.

ట్రేడింగ్లో మహిళల హవా..

- సానుకూలంగా తక్కువ బ్రోకరేజ్ ఫీజులు, ట్రేడింగ్ వేళలు
- యస్ సెక్యూరిటీస్ ఖాతాల్లో 75 శాతం వృద్ధి
- రెలిగేర్ బ్రోకింగ్ యాక్టివ్ ట్రేడర్లలో 30 శాతం మహిళలే



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అన్ని రంగాలతో పాటు ట్రేడింగ్లోనూ మహిళలు దూసుకెడుతున్నారు. బ్రోకరేజీ ఫీజులు తగ్గడం, ట్రేడింగ్ వేళలు కొంత అనువుగా ఉండటం వంటి అంశాలు ఇందుకు కారణంగా ఉంటున్నాయి. ఖాతాలు తెరవడమే కాకుండా మహిళలు ట్రేడింగ్లో చురుగ్గా పాలుపంచుకుంటున్నారని యస్ సెక్యూరిటీస్ ఒక నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది జనవరి 31 నాటికి మహిళా ఇన్వెస్టర్ల అకౌంట్లు వార్షికంగా 75 శాతం పెరిగినట్లు తెలిపింది. అలాగే, మరో బ్రోకరేజ్ సంస్థ రెలిగేర్ బ్రోకింగ్ ప్లాట్ఫాంలోని యాక్టివ్ ట్రేడర్లలో మహిళలు 30 శాతం ఉన్నారు. ఇక ఇన్వెస్ట్మెంట్పరంగా చూస్తే గతేడాది తమ ప్లాట్ఫామ్ను ఎంచుకున్న కొత్త ఇన్వెస్టర్లలో 41 శాతం మంది మహిళలే ఉన్నారని టెక్ ఆధారిత ఇన్వెస్ట్మెంట్ మేనేజ్మెంట్ సంస్థ ఫిన్ఎడ్జ్ తెలిపింది. రియల్ ఎస్టేట్లాగా కాకుండా చాలా తక్కువ మొత్తాన్నైనా షేర్లలో ఇన్వెస్ట్ చేసే వీలుండటం కూడా మహిళలు స్టాక్ మార్కెట్ వైపు మొగ్గు చూపుతుండటానికి కారణం కావచ్చన్నది విశ్లేషణ.

ఆర్థిక స్వాతంత్ర్యంపై అవగాహన..

కచ్చితంగా నిర్దిష్ట ప్రదేశానికే పరిమితం కాకుండా ఎక్కడి నుంచైనా ట్రేడింగ్ చేసే సౌలభ్యం ఉండటం, వేళలు కూడా అనుకూలంగా ఉండటం వల్ల మహిళలు కూడా ట్రేడింగ్ను ఎంచుకుంటున్నారని ఆర్థిక అక్షరాస్యత కన్సల్టెంట్, ఫుల్-టైమ్ ట్రేడర్ అయిన ప్రీతి చాబ్రా తెలిపారు. మహిళా ట్రేడర్లు పెరగడానికి గల కారణాల్లో ఆర్థిక స్వాతంత్ర్యంపై అవగాహన మెరుగుపడుతుండటం కూడా ఒకటని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఇంటి నుంచే ఆదాయాన్ని ఆర్జించే అవకాశాలను కల్పించే ట్రేడింగ్ ఆకర్షణీయంగా ఉంటోందని ఉమాదేవి అనే మరో ట్రేడర్ తెలిపారు. ట్రేడింగ్ అంత సులువైనదేమీ కాకపోయినప్పటికీ మార్కెట్ల గురించి అవగాహన పెంచుకుంటూ, రిస్కు మేనేజ్మెంటును అర్థం చేసుకుంటూ మహిళలు ఇప్పుడిప్పుడే ఇన్వెస్ట్మెంట్, ట్రేడింగ్ వైపు అడుగులు వేస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

మహిళా ఖాతాదార్లకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆఫర్లు..

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్పొరేట్ సంస్థలు పలు కార్యక్రమాలు ప్రకటించాయి. ఈ ఏడాది జూన్ 30 వరకు మహిళా శక్తి సేవింగ్స్ ఖాతాలు లేదా ఉమెన్ పవర్ కరెంట్ అకౌంట్లు తీసుకున్నా, డిసెంబర్ 31లోగా రుణాలు తీసుకున్న మహిళలకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తెలిపింది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు తక్కువ వడ్డీ రేటు, ప్రాసెసింగ్ చార్జీలు పూర్తిగా మినహాయింపు, వార్షికంగా సేఫ్ డిపాజిట్ లాకర్ చార్జీలపై 50 శాతం డిస్కౌంటు వంటివి వీటిలో ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెరియర్లో వివిధ దశల్లో ఉన్న మహిళా ఉద్యోగుల కోసం రీకిండిల్, ర్యాంప్ బ్యాక్, యామ్ వాయిస్ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు అమెజాన్ వెల్లడించింది. మరోవైపు, వేతనాల్లో సమానత, ఉద్యోగం-వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యతను ప్రోత్సహించే విధానాలు అమలు చేస్తున్నట్లు ఐకియా తెలిపింది. మహిళా ఎంట్రప్రెన్యూర్స్కు తోడ్పాటు అందించేందుకు హర్స్టోర్ అనే వేదికను ఏర్పాటు చేసినట్లు బ్రిటానియా పేర్కొంది. హెచ్సీసీబీ 25,000 మంది మహిళలకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతలో శిక్షణ కల్పించినట్లు తెలిపింది.

సాక్షి స్పోర్ట్స్



న్యూజిలాండ్ 162... ఆస్ట్రేలియా 124/4

క్రైస్ట్చర్చ్లో శుక్రవారం న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మధ్య ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజే 14 వికెట్లు నేలకూలాయి. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్కు దిగిన న్యూజిలాండ్ 162 పరుగులకే ఆలౌటైంది. టామ్ లాథమ్ (38)దే అత్యధిక స్కోరు. ఒక దశలో కివీస్ 107/8తో నిలవగా తొమ్మిదో వికెట్కు 55 పరుగులు జోడించి హెన్రీ (29), సౌతీ (26) ఆదుకున్నారు. హాజల్వుడ్ (5/31) ఐదు వికెట్లతో కివీస్ను కుప్పకూల్చగా...మిచెల్ స్టార్క్ (3/59) కెరీర్లో 357 వికెట్లతో ఆసీస్ దిగ్గజం డెన్నిస్ లిల్లీ (354)ను అధిగమించాడు. అనంతరం ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా 4 వికెట్లకు 124 పరుగులు చేసి మరో 38 పరుగులు వెనుకంజలో ఉంది. స్మిత్ (11), ఖ్వాజా (16), గ్రీన్ (25), హెడ్ (21) వెనుదిరగ్గా... లబుషేన్ (45 బ్యాటింగ్) ఆసీస్ను నడిపిస్తుండగా, మ్యాట్ హెన్రీ 3 వికెట్లు పడగొట్టాడు. కివీస్ ఆటగాళ్లు కేన్ విలియమ్సన్, టిమ్ సౌతీలకు ఇది 100వ టెస్టు మ్యాచ్ కావడం విశేషం.

ఢిల్లీని ఓడించిన దీప్తి

- పరుగు తేడాతో యూపీ అనూహ్య విజయం
- మహిళల ప్రీమియర్ లీగ్


ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దీప్తి

న్యూఢిల్లీ: మహిళా దినోత్సవం రోజున మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఉత్కంఠభరితంగా మ్యాచ్ జరిగింది. గెలుపు దిశగా పయనిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ను దీప్తిశర్మ (4/19) అద్భుత బౌలింగ్తో ఓడించింది. ఢిల్లీ లక్ష్యం 138 పరుగులు కాగా... ఒక దశలో 18 ఓవర్లలో 124/4 స్కోరు వద్ద విజయానికి 12 బంతుల్లో 15 పరుగుల దూరంలో ఉంది. అయితే 11 బంతుల్లో 6 వికెట్లను కోల్పోయిన ఢిల్లీ గెలుపు వాకిట బొక్కబోర్లా పడింది. యూపీ వారియర్స్ ఆఖరి దాకా పోరాడి పరుగు తేడాతో గెలిచింది. 19వ ఓవర్ వేసిన దీప్తి 3 వికెట్లు తీసి 5 పరుగులే ఇవ్వడం మ్యాచ్ను మలుపు తిప్పింది. ఆమె శ్రమను నీరుగార్చకుండా చివరి ఓవర్లో బౌలింగ్కు దిగిన గ్రేస్ హారిస్ (2/8) ఐదు బంతులేసి రెండు వికెట్లు తీసింది. దీంతో పాటు మరో రనౌట్ కూడా చేసిన యూపీ విజయాన్నందుకుంది. ఉత్కంఠ రేపిన ఈ పోరు అందర్నీ మునివేళ్లపై నిలబెట్టింది. మొదట యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 138 పరుగులు చేసింది. దీప్తిశర్మ (48 బంతుల్లో 59; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో మళ్లీ ఒంటరి పోరాటం చేసింది. క్యాపిటల్స్ బౌలర్లు రాధా యాదవ్, టైటస్ సాధు చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19.5 ఓవర్లలో 137 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్, కెప్టెన్ మెగ్ లానింగ్ (46 బంతుల్లో 60; 12 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా, తర్వాత వచ్చిన వారు చెత్త షాట్లతో ఓటమిని మూల్యంగా చెల్లించారు. జెమీమా (17), షఫాలీ (15), అలైస్ క్యాప్సీ (15) రెండంకెల స్కోర్లు చేశారంతే! ఎవరూ క్రీజులో నిలిచే ప్రయత్నం చేయలేదు. నేడు జరిగే మ్యాచ్లో గుజరాత్ జెయింట్స్తో ముంబై ఇండియన్స్ తలపడుతుంది.

సింధు పరాజయం

సెమీస్లో సాత్విక్-చిరాగ్ ద్వయం • ఫ్రెంచ్ ఓపెన్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత షట్లర్లకు క్వార్టర్ ఫైనల్లో మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ప్రపంచ నంబర్వన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లగా, రెండు వరుస ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధుకు క్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సింధు 24-22, 17-21, 18-21తో ఒలింపిక్ చాంపియన్ చెన్ యూ ఫె (చైనా) చేతిలో పోరాడి ఓడింది. గంటా 32 నిమిషాల పాటు భారత స్టార్ తుదికంటా పోరాడినా ఫలితం దక్కలేదు. ప్రపంచ రెండో ర్యాంకర్ చెన్ యూ ఫెకు దీటుగా కోర్టులో శ్రమించడంతో ర్యాలీలు సుదీర్ఘంగా సాగాయి. దీంతో తొలిగేమ్ హోరాహోరీగా సాగింది. 22-22 వద్ద సింధు క్రాస్కోర్టు షాట్లతో విరుచుకుపడి తొలిగేమ్ నెగ్గింది. తర్వాత రెండో గేమ్లో సర్వీస్ వైఫల్యంతో వెనుకబడిన సింధు గేమ్ను కోల్పోయింది. నిర్ణాయక మూడో గేమ్లోనూ ఇద్దరు నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. కానీ చైనా ప్రత్యర్థి పైచేయి సాధించడంతో మ్యాచ్లో ఓటమి తప్పలేదు. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్సీడ్ సాత్విక్-చిరాగ్ ద్వయం 21-19, 21-13తో థాయ్లాండ్కు చెందిన సుపక్ జొమ్కొ-కిటినుపాంగ్ కెడ్రెన్ జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్లో లక్ష్య సేన్ కూడా సెమీస్ చేరుకున్నాడు. క్వార్టర్స్ మ్యాచ్లో లక్ష్య 19-21, 21-15, 21-13 స్కోరుతో లో కీన్ యూ (సింగపూర్)ను ఓడించాడు.

తొలి రౌండ్లోనే నగాల్ ఓటమి

ఇండియన్ వెల్స్: ఏటీపీ మాస్టర్స్-1000 టోర్నీ ఇండియన్ వెల్స్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్లో భారత నంబర్వన్ ఆటగాడు సుమిత్ నగాల్కు తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. కెనడాకు చెందిన మిలోస్ రావ్నిక్ 6-3, 6-2తో ప్రపంచ 101వ ర్యాంకర్ నగాల్ను వరుస సెట్లలో ఓడించాడు. గంటా 28 నిమిషాల పాటు జరిగిన ఈ సమరంలో మాజీ వరల్డ్ నంబర్ 3 రావ్నిక్ మెరుగైన ఆటతీరు కనబరిచాడు. మూడు బ్రేక్ పాయింట్లు సాధించి మ్యాచ్పై పట్టు బిగించాడు. ఈ టోర్నీలో క్వాలిఫయింగ్లోనే నగాల్ ఓడినప్పటికీ చివరి నిమిషంలో స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ వైదొలగడంతో 'లక్కీ లూజర్'గా సుమిత్ నగాల్కు మెయిన్ 'డ్రా' అవకాశం లభించింది.

క్వార్టర్స్లో ఓడిన సహజ

నాగపూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్- డబ్ల్యూ35) టోర్నమెంట్లో సహజ యామలపల్లి పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. సింగిల్స్లో ఐదో సీడ్ సహజ 4-6, 1-6 స్కోరుతో అన్సీడెడ్ డాయెన్ బ్యాక్ (కొరియా) చేతిలో ఓటమిపాలైంది. మరో వైపు శ్రీవల్లి రష్మిక భమిడిపాటి - వైదేహి చౌదరి ద్వయం పోరాటం సెమీ ఫైనల్లో ముగిసింది. మహిళల డబుల్స్ సెమీస్లో నాలుగో సీడ్ జస్టినా మికుల్స్కైట్ (లిథువేనియా) - యెన్వూ కూ (కొరియా) జోడీ 6-1, 2-6, 10-8 తేడాతో రష్మిక - వైదేహి జంటపై విజయం సాధించింది.

జోరు కొనసాగింది


రోహిత్ గిల్

ధర్మశాల టెస్టు మ్యాచ్ రెండో రోజు ఊహించినట్లుగానే అంచనాలకు అనుగుణంగా సాగింది...పటిష్టమైన భారత బ్యాటింగ్ లైనప్ ఇంగ్లండ్కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా శుక్రవారం ఆటలో 338 పరుగులు రాబట్టింది...రోహిత్, గిల్ సెంచరీలు పూర్తి చేసుకొని సగర్వంగా నిలవగా...యువ ఆటగాళ్లు పడిక్కల్, సర్ఫరాజ్ భారీ భాగస్వామ్యంతో తమ వంతు పాత్ర పోషించారు. ఒక దశలో ఒక పరుగు తేడాతో మూడు వికెట్లు కోల్పోయినా దాని ప్రభావం జట్టుపై పడలేదు... ఫలితంగా ఇప్పటికే 255 పరుగుల ఆధిక్యంలో నిలిచిన టీమిండియా విజయానికి కావాల్సిన సరంజామాను సిద్ధం చేసుకుంది. సుదీర్ఘ భారత పర్యటనలో తమ చివరి ఇన్నింగ్స్లో భారత స్పిన్నర్లను ఎదుర్కొని ఇంగ్లండ్ ఏమాత్రం పోరాటపటిమ కనబరుస్తుందనేది చూడాలి.

- తొలి ఇన్నింగ్స్లో భారత్ 473/8
- రోహిత్, గిల్ సెంచరీలు
- ప్రస్తుత ఆధిక్యం 255 పరుగులు
- రాణించిన పడిక్కల్, సర్ఫరాజ్

ధర్మశాల: ఇంగ్లండ్తో టెస్టు సిరీస్ను 4-1తో ముగించే దిశగా భారత జట్టు వేగంగా దూసుకుపోతోంది. మ్యాచ్ రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్లో 120 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 473 పరుగులు చేసింది. శుబ్మన్ గిల్ (150 బంతుల్లో 110; 12 ఫోర్లు, 5 సిక్స్లు), రోహిత్ శర్మ (162 బంతుల్లో 103; 13 ఫోర్లు, 3 సిక్స్లు) సెంచరీలు సాధించారు. వీరిద్దరు రెండో వికెట్కు 171 పరుగులు జోడించారు. దేవ్దత్ పడిక్కల్ (103 బంతుల్లో 65; 10 ఫోర్లు, 1 సిక్స్), సర్ఫరాజ్ ఖాన్ (60 బంతుల్లో 56; 8 ఫోర్లు, 1 సిక్స్) కూడా అర్ధ సెంచరీలు చేశారు. వీరిద్దరు నాలుగో వికెట్కు 97 పరుగులు జత చేయడం విశేషం.

శతకాలు పూర్తి...

రెండో రోజు ఆటను రోహిత్, గిల్ బౌండరీలతో దూకుడుగా మొదలు పెట్టారు. వీరిని నిలువరించేందుకు ఇంగ్లండ్ బౌలర్లు చేసిన ప్రయత్నం విఫలమైంది. 68 పరుగుల వద్ద రోహిత్ ఇచ్చిన క్యాచ్ను క్రాలీ వదిలేయడం భారత్కు కలిసి రాగా, 64 బంతుల్లో గిల్ అర్ధ సెంచరీ పూర్తయింది. ముఖ్యంగా వుడ్, బషీర్ బౌలింగ్లో భారత బ్యాటర్లు ధారాళంగా పరుగులు రాబట్టారు. ఇదే జోరును కొనసాగిస్తూ మూడు బంతుల వ్యవధిలో ఇద్దరూ శతకాలు పూర్తి చేసుకున్నారు. 154 బంతుల్లో రోహిత్ 12వ టెస్టు సెంచరీ రాగా, 137 బంతుల్లో గిల్ నాలుగో సెంచరీని అందుకున్నాడు. తొలి సెషన్లో భారత్ 30 ఓవర్లలో 129 పరుగులు చేయగా, ఇంగ్లండ్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయింది. అయితే లంచ్ తర్వాత వరుస ఓవర్లలో వీరిద్దరు వెనుదిరిగారు. గత జూన్ తర్వాత తొలి సారి బౌలింగ్కు దిగిన స్టోక్స్ తన మొదటి బంతికే రోహిత్ను బౌల్డ్ చేయగా, తర్వాతి ఓవర్లో గిల్ను మరో చక్కటి బంతితో అండర్సన్ బౌల్డ్ చేశాడు.


సర్ఫరాజ్


పడిక్కల్

కుర్రాళ్ల జోరు...

మూడో వికెట్గా గిల్ అవుటైన సమయంలో భారత్ ఆధిక్యం 61 పరుగులు మాత్రమే! రెండు కీలక వికెట్లు తీసి ఒత్తిడి పెంచేందుకు ఇంగ్లండ్ సిద్ధం కాగా...భారత యువ బ్యాటర్లు పడిక్కల్, సర్ఫరాజ్ దానిని సమర్థంగా అడ్డుకున్నారు. మూడో టెస్టు ఆడుతున్న సర్ఫరాజ్, అరంగేట్ర బ్యాటర్ పడిక్కల్ భాగస్వామ్యం ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లింది. అండర్సన్ ఓవర్లో మూడు ఫోర్లతో ధాటిని చూపిన పడిక్కల్ తొలి 30 పరుగుల్లో 7 ఫోర్లు ఉండటం విశేషం. మరో వైపు ఆరంభంలో జాగ్రత్తగా ఆడిన సర్ఫరాజ్ ఆ తర్వాత జోరు పెంచాడు. వుడ్ బౌలింగ్లో అతను కొట్టిన 3 ఫోర్లు, సిక్స్ హైలైట్గా నిలిచాయి. బషీర్ ఓవర్లో 2 ఫోర్లతో సర్ఫరాజ్ 55 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. రెండో సెషన్లో భారత్ 24 ఓవర్లలో 112 పరుగులు రాబట్టింది. అయితే టీ విరామం తర్వాత తొలి బంతికే సర్ఫరాజ్ వెనుదిరిగాడు. అనంతరం 83 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకున్న పడిక్కల్ కూడా కొద్దిసేపటికే పెవిలియన్ చేరాడు. జురేల్ (15) ప్రభావం చూపలేకపోగా...హార్ట్లీ ఒకే ఓవర్లో జడేజా (15), అశ్విన్ (0)లను వెనక్కి పంపాడు. ఈ దశలో కుల్దీప్ (27 బ్యాటింగ్) పట్టుదల కనబర్చగా, బుమ్రా (19 బ్యాటింగ్) అండగా నిలిచాడు. వీరిద్దరు 18 ఓవర్ల పాటు మరో వికెట్ పడకుండా ఆటను ముగించారు.

స్కోరు వివరాలు:

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 218; భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (స్టంప్డ్) ఫోక్స్ (బి) బషీర్ 57; రోహిత్ (బి) స్టోక్స్ 103; గిల్ (బి) అండర్సన్ 110; పడిక్కల్ (బి) బషీర్ 65; సర్ఫరాజ్ (సి) రూట్ (బి) బషీర్ 56; జడేజా (ఎల్బీ) (బి) హార్ట్లీ 15; జురేల్ (సి) డకెట్ (బి) బషీర్ 15; అశ్విన్ (బి) హార్ట్లీ 0; కుల్దీప్ (బ్యాటింగ్) 27; బుమ్రా (బ్యాటింగ్) 19; ఎక్స్ట్రాలు 6; **మొత్తం** (120 ఓవర్లలో 8 వికెట్లకు) 473. **వికెట్ల పతనం:** 1-104, 2-275, 3-279, 4-376, 5-403, 6-427, 7-427, 8-428. **బౌలింగ్:** అండర్సన్ 14-1-59-1, వుడ్ 15-1-89-0, హార్ట్లీ 39-3-126-2, బషీర్ 44-5-170-4, స్టోక్స్ 5-1-17-1, రూట్ 3-0-8-0.

క్లుప్తంగా...

రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం

302.09 మిలియన్ యూనిట్లుగా నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రెక్కలు కట్టుకొని ఎగురుతోంది. గురువారం రాష్ట్రంలో వినియోగం 300 మిలియన్ యూనిట్ల మైలురాయిని దాటేసింది. ఇప్పటివరకు గత పదేళ్లలో రోజువారీ గరిష్ట వినియోగం 298 మిలియన్ యూనిట్లు కాగా... గురువారం రికార్డులన్నీ బద్దలు కొడుతూ 302.09 మిలియన్ యూనిట్లుగా నమోదయింది. రాష్ట్రవ్యాప్తంగా 302.09 మిలియన్ యూనిట్లుగా వినియోగం రికార్డు కాగా... ఒక్క దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్–హైదరాబాద్) పరిధిలో 195.19 మిలియన్ యూనిట్లుగా ఉంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 70.71 మిలియన్ యూనిట్లుగా రికార్డయింది. ఇక డిమాండ్ గురువారం ఉదయం 10 గంటల సమయంలో 15,353 మెగావాట్లుగా నమోదయింది. ఇక నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల వద్ద జెన్కో(హైడల్) కేంద్రాల్లో 1.7 మిలియన్ యూనిట్లను రివర్సబుల్ పంపింగ్ కోసం వాడారు. పగటిపూట డిమాండ్ పెరిగి... చీకటి పడగానే డిమాండ్ తగ్గడంతో గ్రిడ్‌ను కాపాడుకోవడానికి వీలుగా టెయిల్ పాండ్ల నుంచి నీటిని ఎత్తి... రిజర్వాయర్లలో పోశారు. ఉష్ణోగ్రతల పెరుగుదలతో గృహ వినియోగంతో పాటు వ్యవసాయ వినియోగం పెరుగుదలే దీనికి కారణమని అధికారులు పేర్కొన్నారు.

మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా తఫ్సీర్ ఇక్బాల్

అనితారామచంద్రన్‌కు సెర్ప్ సీఈఓగా బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా 2008 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి తఫ్సీర్ ఇక్బాల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఏఎస్ అధికారి ఒమర్‌జలీల్ స్థానంలో ఇక్బాల్‌ను నియమించారు. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) డీఐజీగా పనిచేస్తున్న ఇక్బాల్‌ను అదేస్థానంలో పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న 2014 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అనితా రామచంద్రన్‌కు సెర్ప్ సీఈఓగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఈ బాధ్యతల్లో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రెప్పవాలితే చాలు!

రహదారులపై మృత్యుఘోష



- డ్రైవర్లు, ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్న నిద్రమత్తు
- హైవేలు, కీలక మార్గాల్లో దీనివల్లే 40 శాతం ప్రమాదాలు
- సుదీర్ఘ ప్రయాణాలు, విశ్రాంతి లేకపోవడంతో అలసట
- చట్టం చెబుతున్నా అమలుకాని డ్రైవర్ల పని గంటలు
- ప్రమాదాల నివారణకు సాగుతున్న పరిశోధనలు

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డుపై కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో అల్వాల్ వెంకటాపురానికి చెందిన నవ దంపతులు బాల కిరణ్, కావ్య సహా ఐదుగురు.. ఉత్తరాంధ్రలోని కాశీబుగ్గ వద్ద చైతన్యపురికి చెందిన వేదవతి, వెంకటయ్య..ఇలా ఎందరో డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ప్రాణాలు కోల్పోయారు. సుదీర్ఘ ప్రయాణం, తగినంత విశ్రాంతి లేకుండా వాహనాలు నడపడం వల్ల నిద్ర మత్తులోకి జారుకుంటున్న డ్రైవర్లు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఏటా లక్షలాది మంది డ్రైవర్లు, ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 40 శాతం నిద్రమత్తు వల్లే చోటు చేసుకుంటున్నాయని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాగా డ్రైవర్ల పని వేళలకు సంబంధించిన చట్టం అమలు కావడంతో పాటు సాంకేతికంగానూ అనేక మార్పులు వస్తేనే ఈ ప్రమాదాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

అలసటే ప్రధాన కారణం

దేశ వ్యాప్తంగా ఉన్న జాతీయ, రాష్ట్ర రహదారులు..అలాగే హైదరాబాద్‌లోని పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే, నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ వంటి కీలక రోడ్లపై ప్రయాణించే వాహనాల్లో అత్యధికం ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలకు చెందినవే అయినప్పటికీ.. వ్యక్తిగత రవాణా వాహనాలు, ప్రైవేటు వాహనాలు సైతం పెద్ద సంఖ్యలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం సుదూర ప్రాంతాల నుంచి గమ్య స్థానాలకు సరుకు రవాణా చేసే వాహనాల డ్రైవర్లకు అవసరమైన విశ్రాంతి ఉండదు. ఎన్ని ట్రిప్పులు ఎక్కువ వేయిస్తే అంత ఎక్కువ మొత్తం సంపాదించవచ్చనే ధోరణితో యాజమాన్యాలు పని చేస్తుంటాయి. ఎప్పటికప్పుడు డ్రైవర్లపై ఒత్తిడి పెంచుతుంటాయి. రిలీవర్ రాకపోవడం, ఇతరత్రా కారణాలతో విశ్రాంతి ఇవ్వకుండా పని చేయిస్తుంటాయి. ఇక వివిధ పనులపై వ్యక్తిగత వాహనాల్లో వెళ్లే వారు సైతం వీలైనంత త్వరగా గమ్యస్థానానికి చేరుకోవాలనుకుంటారు. త్వరగా పని పూర్తి చేసుకుని ఇంటికి చేరుకోవాలనుకుంటారు. తగినంత విశ్రాంతి లేకుండా వేగంగా డ్రైవ్ చేస్తుంటారు. అలసటతో నిద్రమత్తుకు గురై వాహనంపై నియంత్రణ కోల్పోతారు. రోడ్డు పక్కనే ఉన్న చెట్టునో, నిలిపి ఉంచిన లారీ లాంటి ఏ భారీ వాహనాన్నో ఢీకొట్టేస్తారు. ఇలాంటి ఘటనల్లో ఏం జరిగిందో తెలుసుకునే లోపే ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి.

రోడ్డు పక్కన ఆపినా..

జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లలో కొందరు కాస్త అలసట తీర్చుకుందామనో, టీ తాగుదామనో రోడ్డు పక్కన వాహనాలు నిలిపి ఉంచడం ప్రమాదాలకు కారణమవుతోంది. డ్రైవర్లు తమ వాహనాలను పార్కింగ్ చేసుకుని సేద తీరేందుకు అవసరమైన స్థలాలు అన్నిచోట్లా అందుబాటులో ఉండట్లేదు. చాలావరకు దాబాలు, రెస్టారెంట్లు, పెట్రోల్ బంకుల వద్దే వీరు తమ వాహనాలను ఆపి ఉంచుతున్నా.. మరికొందరు వెంటనే వెళ్లిపోదామనో, ఇతరత్రా కారణాలతోనో రహదారికి పక్కగానే ఆపుతున్నారు. ఇది అనేక సందర్భాల్లో ఎదుటి వారికి, కొన్నిసార్లు వారికే ప్రమాదకరంగా మారుతోంది. ఈ వాహనాలు సరిగా కనబడక పోవడం, అలసట, నిద్రావస్థలో ఆదమరిచి ఉండటం లాంటి కారణాలతో వేగంగా వచ్చే వాహనాలు వీటిని ఢీ కొంటున్నాయి. హైవేలపై ఈ తరహా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల వాహనాలు నిలుపుకోవడానికి ప్రత్యేక స్థలాలు కేటాయించినా డ్రైవర్లు వాటిని ఉపయోగించడం లేదు. బ్లాక్ స్పాట్స్ వద్ద నిలుపుతున్న సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారులపై తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలను పోలీసులు గుర్తిస్తుంటారు. వీటినే సాంకేతిక పరిభాషలో బ్లాక్‌స్పాట్స్ అంటారు. ఇలాంటి బ్లాక్‌స్పాట్స్ హైవేలపై ఎక్కువగా ఉంటున్నాయి.

ఎంవీ యాక్ట్ ఏం చెబుతోందంటే...

ప్రతి రవాణా వాహనంలో డ్రైవర్‌తో పాటు కచ్చితంగా కో–డ్రైవర్ ఉండాలని మోటారు వాహనాల చట్టం స్పష్టం చేస్తోంది. దీనిప్రకారం.. డ్రైవర్లు రోజుకు కేవలం పది గంటల (విశ్రాంతితో కలిపి) చొప్పున వారానికి 48 గంటలు మాత్రమే పని చేయాలి. డ్రైవర్ విధులు నిర్వర్తించే ఎనిమిది గంటల కాలంలో కచ్చితంగా రెండు గంటల విశ్రాంతి ఉండాలి. తన వాహనం ద్వారా ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఆ సమాచారాన్ని పోలీసులకు తెలిపి తీరాలి. రహదారుల పక్కన నిర్దేశిత ప్రాంతాల్లో మినహా ఎక్కడా వాహనాలను పార్క్ చేయకూడదు. ఈ నిబంధనలు కేవలం రవాణా వాహనాలకే కాదు.. వ్యక్తిగత వాహనాల డ్రైవర్లకూ వర్తిస్తాయి. అయితే ఇవి ఎక్కడా అమలుకాని కారణంగానే హైవేలు, ఇతర మార్గాలపై ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నాయని నిపుణులు అంటున్నారు.

ప్రమాదాల నివారణకు పరిశోధనలు

ఏటా లక్షల మందిని మింగుతున్న కారు ప్రమాదాల నివారణకు ప్రపంచ వ్యాప్తంగా ఆటోమొబైల్ సంస్థలు దశాబ్దాలుగా ముమ్మర పరిశోధనలు చేస్తున్నాయి. వీటి ఫలితంగానే 1948లో రోడ్ గ్రిప్, ఆ తర్వాత రేడియల్ గ్రిప్ టైర్లు అందుబాటులోకి వచ్చాయి. 1958లో ఓల్వో కంపెనీ సీటుబెల్ట్‌ను కనుగొంది. తర్వాత ఎయిర్ బ్యాగులూ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ప్రధానంగా మూడు అంశాలపై ఆటోమొబైల్ కంపెనీల పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి కూడా సాకారమైతే కారు ప్రమాదాలకు దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టొచ్చని మోటారు వాహన రంగ నిపుణులు చెప్తున్నారు.

ఆటో బ్రేకింగ్

ముందున్న వాహనాలు/వస్తువులు కారుకు సమీపంలోకి రాగానే కారులో ఉండే సెన్సర్లు పని చేస్తాయి. బ్రేకులు వాటంతట అవే పడేలా చేస్తాయి. ఈ టెక్నాలజీ ప్రస్తుతం స్వీడన్‌లో ప్రయోగాల దశలో ఉంది.

ఇంటెలిజెంట్ విండ్ స్క్రీన్

డ్రైవర్ కారు నడిపేటప్పుడు అతడు నిద్రలో జోగకుండా, అతని దృష్టి మళ్లకుండా ఇది ఉపకరిస్తుంది. డ్రైవర్ సరిగా చూస్తున్నాడా? ఎటు చూస్తున్నాడనే దాన్ని గమనిస్తూ అప్రమత్తం చేస్తుంది. రోడ్ల అంచులు, వాహనం స్థితి తదితరాలను సూచిస్తుంది.

క్రాష్ టెస్ట్ డమ్మీ

కారు నడిపే వ్యక్తి పర్సనాలిటీ ఆధారంగా ఎక్కడ ఢీ కొంటే ఏ అవయవాలు దెబ్బతింటాయి అనేది నిర్ధారిస్తుంది. ఇప్పటికే 100కు పైగా నమూనాలు రూపొందించిన ఈ టెక్నాలజీతో వ్యక్తికి తగ్గట్టుగా భద్రతా ప్రమాణాలను కారులో ఏర్పాటు చేసేందుకు వీలుగా పరిశోధనలు సాగుతున్నాయి.

మానవ తప్పిదాలను నివారించాలి

వాహనం ఎంతటి భద్రతా ప్రమాణాలతో కూడినదైనా, ఎంత టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా.. అతి ఎక్కువగా ప్రమాదాలకు కారణమయ్యే మానవ తప్పిదాలను నివారించకపోతే ఫలితం ఉండదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సరిగా రాకపోయినా వాహనం నడపడం, హైవే డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడం, మితిమీరిన వేగం, వాహనాన్ని అదుపు చేయలేక పోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం, సీట్‌బెల్ట్ ధరించడంలో నిర్లక్ష్యం వహించడం లాంటివి నివారిస్తేనే ఏ టెక్నాలజీతోనైనా పూర్తి ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు.

ఉక్కపోత పెరుగుతోంది

సాధారణం కంటే 3 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలకు సమాంతరంగా రాత్రి ఉష్ణోగ్రతలు సైతం అదేస్థాయిలో పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతల్లో పెరుగుదల వేగంగా నమోదవుతోంది. శుక్రవారం రాష్ట్రంలోని గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే ... గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 38.7 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 16.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. శుక్రవారం రాష్ట్రంలోని చాలాచోట్ల గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. మెదక్‌లో సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు కాగా... ఖమ్మం, మహబూబ్‌నగర్‌లో 2 డిగ్రీల సెల్సియస్, మిగతా చోట్ల ఒక డిగ్రీ సెల్సియస్ చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వాతావరణంలో తేమశాతం తగ్గడంతో ఉక్కపోత కూడా పెరుగుతోంది.

శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	38.7	25.2
మహబూబ్‌నగర్	38.4	25.6
నల్లగొండ	37.2	23.0
నిజామాబాద్	37.1	20.5
హైదరాబాద్	37.0	23.3
ఆదిలాబాద్	37.0	16.6
భద్రాచలం	37.0	25.2
దుండిగల్	36.5	20.6
హకీంపేట్	36.5	19.7
హనుమకొండ	36.0	22.5
మెదక్	36.0	21.6
రామగుండం	36.0	20.4

ఈఆర్సీలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

- పదేళ్లలో తొలిసారిగా అధిక సంఖ్యలో భర్తీకి నిర్ణయం
- దరఖాస్తులకు ఏప్రిల్ 1 వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ)లో ఉద్యోగ నియామకాలకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదలయ్యింది. టారిఫ్ ఉత్తర్వులు ఇచ్చే క్రమంలో పిటిషన్లను సమగ్రంగా పరిశీలించడానికి వీలుగా భారీగా ఉద్యోగులను భర్తీ చేసుకోవాలని మండలి నిర్ణయించింది. ఇందులో భాగంగా గత పదేళ్ల కాలంలో మునుపెన్నడూ లేనివిధంగా కొలువుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. జాయింట్ డైరెక్టర్ (ఇంజనీరింగ్), డిప్యూటీ డైరెక్టర్ (ట్రాన్స్‌మిషన్), డిప్యూటీ డైరెక్టర్ (డిస్ట్రిబ్యూషన్), డిప్యూటీ డైరెక్టర్ (లా), డిప్యూటీ డైరెక్టర్/లీగల్ ప్రొసీజర్స్, డిప్యూటీ డైరెక్టర్/టారిఫ్ (అకౌంట్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలిసిస్), డిప్యూటీ డైరెక్టర్ (టారిఫ్ ఎకనామిక్స్), డిప్యూటీ డైరెక్టర్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), డిప్యూటీ డైరెక్టర్ (టారిఫ్ ఇంజనీరింగ్), డిప్యూటీ డైరెక్టర్ (పే అండ్ అకౌంట్స్), డిప్యూటీ డైరెక్టర్ (కన్జూమర్ అసిస్టెంట్), అకౌంట్స్ ఆఫీసర్, క్యాషియర్, లైబ్రేరియన్, రిసెప్షనిస్టు ఒక్కో పోస్టు చొప్పున, అలాగే రెండు స్టెనో కమ్ కంప్యూటర్ ఆపరేటర్, నాలుగు క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, రెండు పర్సనల్ అసిస్టెంట్, ఐదు ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఆయా ఉద్యోగాలకు ఏప్రిల్ 1వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను కమిషన్ కార్యదర్శి, ఇంటి నం.11–4–660, ఐదో అంతస్తు, సింగరేణి భవన్, రెడ్ హిల్స్, హైదరాబాద్–500 004 చిరునామాలో సమర్పించాల్సి ఉంటుంది. 18 ఏళ్లు నిండి..46 ఏళ్ల లోపు వయసు కలిగిన అభ్యర్థులు ఆయా ఉద్యోగాలకు అర్హులుగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, సమగ్ర నోటిఫికేషన్, అర్హతలు, ఎంపిక విధానం కోసం http://tserc.gov.in అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.